



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 11 సంచిక :135 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శుక్రవారం 17 జనవరి 2025 వెల : 5/-రూ॥
VOLUME : 11 ISSUE :135 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA FRI 17 JANUARY 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Kakinada, Visakhapatnam, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur

# టెక్నాలజీ మనుషులను ఎక్కడికో తీసుకెళ్లింది

- సచివాలయంలో సీఎం చంద్రబాబు మీడియా సమావేశం
- గతంలో తాను టెక్నాలజీ గురించి మాట్లాడితే హేళన చేశారని వెల్లడి
- ఇప్పుడు సెల్ ఫోన్ లేకుండా ఉండలేని పరిస్థితి వచ్చిందని వివరణ



పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు ఏపీకి జీవనాడి అని అన్నారు. కానీ గత ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టును గోదావరిలో కలిపేశారని వ్యాఖ్యానించారు. అదే సమయంలో అమరావతిని కూడా భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరైనా వెనుకాడే పరిస్థితి నెలకొందని తెలిపారు. గతంలో తాను టెక్నాలజీ గురించి, ఐటీ గురించి మాట్లాడితే అవహేళన చేశారని, కానీ ఇవాళ అదే టెక్నాలజీ తిండి పెట్టడం కాదు... మనుషులను ఎక్కడికో తీసుకెళుతోందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఇప్పటిరోజుల్లో సెల్ ఫోన్ లేకుండా ఉండలేని పరిస్థితి నెలకొందని అన్నారు. అప్పట్లోనే రెండో తరం ఆర్థిక సంస్కరణల గురించి ఆలోచించానని, మలేసియాలో మెరుగైన రోడ్లను చూసి, భారత్ లోనూ అలాంటి రోడ్లు ఉండాలని అప్పటి ప్రధాని వాజ్ పేయికి వివరించానని చంద్రబాబు గుర్తుచేశారు. నిధులు ఎక్కడ్నించి వస్తాయని వాజ్ పేయి అన్నారని, దాంతో ఆయనకు రోడ్ల నిర్మాణంలో అనుసరించే వివిధ పద్ధతులు వివరించానని చెప్పారు. ఇప్పుడు ఫోర్ లేన్, సిక్స్ లేన్, 14 లేన్ల రహదారులు కూడా వచ్చాయని అన్నారు. హైదరాబాదుకు 160 కిలోమీటర్ల అవుటర్ రింగ్ రోడ్డు, 5 వేల ఎకరాల్లో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు తీసుకువచ్చామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్ ద్వారానే అత్యధిక ఆదాయం వస్తోందని తెలిపారు. "ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అభివృద్ధి చేసి, సంపద సృష్టించి, పెరిగిన ఆదాయంతో మళ్లీ అభివృద్ధి చేస్తూనే, సంక్షేమ పథకాలకు నాంది పలికి, సాధికారతకు నిరంతరం చర్యలు తీసుకుంటామని చెప్పాం. ఇప్పుడు విజన్ 2047ని నిర్దేశించుకున్నాం. అందులో నిర్దిష్టమైన అంశాలకు స్థానం కల్పించాం. ఒక వ్యక్తి పూర్తిగా ఆనందంగా ఉంటే ఆ వ్యక్తి కుటుంబం పూర్తిగా ముందుకు పోయే పరిస్థితి ఉంటుంది. గతంలో తల్లిదండ్రులను వారి పిల్లలు సరిగ్గా చూసుకోలేని పరిస్థితి ఉండేది. ఇవాళ మేం పెన్షన్ ఇచ్చాం... దాంతో వృద్ధులను చూసుకోవడానికి వారి పిల్లలు సిద్ధంగా ఉన్నారు. అన్ని సంస్కృతుల కంటే మన సంస్కృతి ఎక్స్‌ట్రార్డినరీ. కుటుంబ వ్యవస్థ వల్ల భద్రత చాలా పర్ఫెక్ట్ గా ఉంటుంది. ఇటువంటి పటిష్టమైన వ్యవస్థ మన భారతదేశానికి మాత్రమే ఉంది. ఆధార్ వంటి వ్యవస్థ ఎక్కడా లేదు. భారత్ కు ఇదొక అడ్వాంటేజి. ప్రతి ఒక్క వ్యక్తిని ఆధార్ ద్వారా గుర్తించవచ్చు. గతంలో నేను ఏమేం చెప్పానో అవన్నీ ఇప్పుడు అమలులో ఉన్నాయి. ఇప్పుడు విజన్ డాక్యుమెంట్-2047ని తీసుకు వస్తున్నాం. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడమే ఏపీ లక్ష్యం. 2047 నాటికి తలసరి ఆదాయం 42 వేల డాలర్లకు చేరాలి. ఈ లక్ష్యాలను సాకారం చేసేందుకు ప్రజలను భాగస్వామ్యం చేసుకుని ముందుకు వెళుతున్నాం" అని వివరించారు.

## రేపు చంద్రబాబు ఇంటికి వెళుతున్న అమిత్ షా

- ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లనున్న అమిత్ షా
- అమిత్ షాకు హైలెవెల్ డిన్నర్ ఏర్పాటు చేస్తున్న చంద్రబాబు
- 19న దావోస్ కు బయల్దేరుతున్న చంద్రబాబు



పెన్ పవర్ డెస్క్:ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువైన నేపథ్యంలో... రాష్ట్రంలో బీజేపీ అగ్రనేతలు, కేంద్ర మంత్రుల పర్యటనలు కొనసాగుతూ ఉన్నాయి. ఇటీవలే ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఏపీలో పర్యటించి, పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ క్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఏపీకి వస్తున్నారు. ఈ నెల 18న అమిత్ షా ఏపీకి వస్తున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర బీజేపీ అధికారికంగా ప్రకటించింది. తన పర్యటనలో భాగంగా... ఈ నెల 18న (శనివారం)

వివరాలు 2లో..

## ఛత్తీస్ గఢ్-తెలంగాణ సరిహద్దులో భారీ ఎన్ కౌంటర్... 11 మంది నక్సల్స్ మృతి

- మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ
- బీజాపూర్ జిల్లాలో కాల్పుల మోత
- ఉదయం 9 గంటల నుంచి ఎదురుకాల్పులు



పెన్ పవర్ డెస్క్:ఇటీవల కాలంలో ఛత్తీస్ గఢ్ లో వరుస ఎన్ కౌంటర్లతో నక్సల్స్ కు గట్టి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. తాజాగా ఛత్తీస్ గఢ్ లో మరో భారీ ఎన్ కౌంటర్ జరిగింది.

వివరాలు 2లో..

## రింగ్ రోడ్డు సమీపంలోని భూముల్ని ఓ మంత్రి రాయించుకునే ప్రయత్నం చేస్తున్నారు




- మూడు తరాలుగా అక్కడే ఉంటున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలన్న ఎంపీ
- భూమాత చట్టాన్ని తెచ్చామని చెప్పిన మంత్రే భూములు లాక్కునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం
- కాంగ్రెస్ నేతలు హైదరాబాద్ రింగ్ రోడ్డు చుట్టూ పేదల భూములు లాక్కుంటున్నారని ఆరోపణ

వివరాలు 2లో..

## యంగ్ క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డికి రూ.25 లక్షల చెక్ అందించిన సీఎం చంద్రబాబు

- ఆస్ట్రేలియా పర్యటనలో అంచనాలకు మించి రాణించిన నితీశ్
- సెంచరీతో మెరిసిన తెలుగు క్రికెటర్
- రూ.25 లక్షల నజరానా ప్రకటించిన ఏసీఏ
- చంద్రబాబు చేతుల మీదుగా చెక్ బహూకరణ



పెన్ పవర్ డెస్క్:ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో తన ఆల్ రౌండ్ నైపుణ్యంతో అదరగొట్టిన ఆంధ్రా క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి నేడు సీఎం చంద్రబాబును కలిశాడు. తండ్రి ముత్యాలరెడ్డితో కలిసి నితీశ్ నేడు ఉండవల్లి వచ్చాడు.

వివరాలు 2లో..

## తాగు, తిను, ఊగు... సంక్రాంతికి కూటమి ప్రభుత్వం చేసింది ఇదే

- సంక్రాంతి సంబరాలను ఆర్గనైజ్డ్ క్రైమ్ గా మార్చారన్న పోతిన మహేశ్
- కోడి పందేల్లో మహిళా బౌన్సర్లను కూడా పెట్టారని విమర్శ
- పందేలను నిర్వహించిన ఎమ్మెల్యేలను పవన్ ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్న




పెన్ పవర్ డెస్క్: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలను కూటమి ప్రభుత్వం దోచుకుందని వైసీపీ నేత పోతిన మహేశ్ విమర్శించారు. సంక్రాంతిని అడ్డం పెట్టుకుని వేల కోట్లను దోచుకున్నారని ఆరోపించారు.

వివరాలు 2లో..

## చరిత్ర సృష్టించిన టీడీపీ... కోటి దాటిన సభ్యత్వాల సంఖ్య

- 1,00,52,598 సభ్యత్వాలు నమోదుచేసిన టీడీపీ
- 11 నియోజకవర్గాల్లో లక్ష సభ్యత్వాలు దాటిన వైనం
- 105 నియోజకవర్గాల్లో 50 వేలకు పైగా సభ్యత్వాలు



పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సరికొత్త రికార్డు సృష్టించింది. గత ఏడాది అక్టోబర్ 26న టీడీపీ జాతీయ అధినేత చంద్రబాబు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అండమాన్ లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తాజాగా సభ్యత్వాలు తీసుకున్న వారి సంఖ్య ఒక కోటి మార్క్ ను దాటి చరిత్రను తిరగరాసింది. ఇప్పటివరకు 1,00,52,598 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు. 11 నియోజకవర్గాలు లక్ష సభ్యత్వాల మార్కును దాటాయి. 105 నియోజకవర్గాలు 50 వేల సభ్యత్వాల మార్కును దాటాయి. ఈ క్రమంలో, కోటి మంది సభ్యులతో తెలుగుదేశం పార్టీ అతి పెద్ద కుటుంబంగా అవతరించింది. టెక్నాలజీ అనుసంధానంతో సభ్యత్వ నమోదు కార్యక్రమం సులభమైంది. ప్రజలు స్వయంగా సభ్యత్వ నమోదు చేసుకునే సౌలభ్యం కల్పిస్తూ, వారు ఎక్కువగా వినియోగించే ప్లాట్ ఫామ్స్ తో

వివరాలు 2లో..

## ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

- 8వ వేతన సంఘం ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం
- వేతన సంఘం సిఫార్సుల మేరకు వేతనాలు పెరగనున్నాయి
- 2026 జనవరి 1 నుంచి అమల్లోకి కొత్త వేతనాలు



పెన్ పవర్ డెస్క్: ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 8వ వేతన సంఘం ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో ఉద్యోగులు, పెన్షనర్లకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.వేతన సంఘం సిఫార్సుల మేరకు

వివరాలు 2లో..

## విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్రం శుభవార్త... భారీ ప్యాకేజీకి ఆమోదం

- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంటూ జరుగుతున్న ప్రచారానికి తెర
- ప్రధాని మోదీ అధ్యక్షతన ఢిల్లీలో కేంద్ర క్యాబినెట్ సమావేశం
- విశాఖ ఉక్కుపై కీలక నిర్ణయం తీసుకున్న క్యాబినెట్
- ప్యాకేజీపై రేపు అధికారిక ప్రకటన వెలువడే అవకాశం


వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తారంటూ జరుగుతున్న ప్రచారానికి కేంద్రం చెక్ పెట్టింది. నేడు విశాఖ స్టీల్ ప్లాంట్ కు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నష్టాల్లో ఉన్న ఉక్కు పరిశ్రమను మళ్లీ నిలబెట్టేందుకు రూ.11,500 కోట్లతో భారీ ఉద్దీపన ప్యాకేజీకి ఆమోదం తెలిపింది




## సైఫ్ అలీ ఖాన్ ఇంటిని పరిశీలించిన ఎన్ కౌంటర్ స్పెషలిస్ట్

- ముంబై అండర్ వరల్డ్ ను వణికించిన దయా నాయక్
- దాదాపు 80 మందిని ఎన్ కౌంటర్ చేసినట్లు సమాచారం
- దయా జీవిత కథతో సినిమాలు నిర్మించిన బాలీవుడ్




పెన్ పవర్ డెస్క్:కత్తిపోట్లకు గురైన బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీ ఖాన్ ప్రస్తుతం ముంబైలోని లీలావతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. మరోపై సైఫ్ పై దాడి చేసిన నిందితుల కోసం పోలీసులు పది బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. మరోవైపు, బాంద్రాలోని సైఫ్ ఇంటిని పోలీసు అధికారులు పరిశీలించారు. వీరిలో ఎన్ కౌంటర్ స్పెషలిస్టుగా పేరుగాంచిన దయా నాయక్ కూడా ఉన్నారు. సైఫ్ ఇంటికి వచ్చిన ఆయన... ఘటనకు సంబంధించిన

వివరాలు 2లో..

## బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడి.. ఆరు చోట్ల గాయాలు

- తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఘటన
- చోరీ కోసం ఇంట్లోకి ప్రవేశించిన దుండగుడు
- అడ్డుకునే ప్రయత్నం చేసిన సైఫ్‌పై దాడి
- లీలావతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నటుడు



పెన్ పవర్ డెస్క్: బాలీవుడ్ ప్రముఖ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దుండగుడు దాడిచేశారు. గుర్తు తెలియని వ్యక్తి ఒకరు ఆయన ఇంట్లోకి ప్రవేశించి కత్తితో ఆయనపై దాడిచేశాడు. ఈ ఘటనలో సైఫ్‌కు ఆరు చోట్ల గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించారు. ముంబైలోని లీలావతి ఆసుపత్రిలో సైఫ్ చికిత్స పొందుతున్నాడు. ఈ తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సైఫ్ కుటుంబం నిద్రలో ఉండగా ఇంట్లోకి ప్రవేశించిన దుండగుడు చోరీకి యత్నించాడు. అలికిడికి మెలకువ వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేసిన సైఫ్‌పై దుండగుడు దాడిచేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సైఫ్ ఇంటికి చేరుకుని ఆధారాలు సేకరించారు. నిందితుడి కోసం పోలీసులు వేట ప్రారంభించారు.

## ఎడిటర్ వ్యూ

# ఆధ్యాత్మిక వేడుకలో రికార్డులు

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా సంరంభం మొదలైంది. జనవరి 13న పౌర్ణమినాడు మొదలైన కుంభమేళా ఫిబ్రవరి 26న శివరాత్రితో ముగుస్తుంది. 45 రోజుల పాటు మినీ భారతాన్ని తలపించే విధంగా సాగే ఈ మహా కుంభమేళా కోసం పవిత్ర త్రివేణీ సంగమమైన ప్రయాగ్‌రాజ్ భక్త జన సందోహంతో కిటకిటలాడనుంది. దాదాపు 40 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి తరిస్తారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేస్తోంది. దేశ జనాభాలో ప్రతి నలుగురిలో ఒకరు వస్తారన్న మాట. వీరే కాకుండా విదేశాలలోని ప్రవాస భారతీయులు, విదేశీయులు కూడా పెద్దసంఖ్యలో ఇప్పటికే ప్రయాగ్ రాజ్‌కు చేరుకున్నారు. ఈ మహా ఉత్సవం కోసం ఏడాది ముందునుంచే ఏర్పాట్లు మొదలయ్యాయి. రూ.12,700 కోట్ల బడ్జెట్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ ఏర్పాట్లు చేశాయి. పవిత్ర స్నానాలు ఆచరించడం కోసం వచ్చే లక్షలాది భక్తుల కోసం త్రివేణీ సంగమం వద్ద ఓ తాత్కాలిక మహా నగరమే ఏర్పాటయిందని చెప్పవచ్చు.దాదాపు పదివేల ఎకరాల్లో లక్షన్నర రెస్ట్ రూమ్‌లు, వేలాది వాష్‌రూమ్‌లు, అంబులెన్స్‌లు, వందలాది పడకలతో తాత్కాలిక ఆస్పత్రులు ఏర్పాటు చేశారు. లక్షల సంఖ్యలో ప్రత్యేక బస్సులు, వేలాది ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. ఒక్క రైళ్ల ద్వారానే దాదాపు రెండు కోట్ల మంది వస్తారని రైల్వే శాఖ అంచనా. ఇక ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారి కోసం 5 లక్షల కార్ల పార్కింగ్‌కు సౌకర్యాలు కల్పించారు.కాలుష్య నివారణ కోసం పెద్ద సంఖ్యలో విద్యుత్ వాహనాల వినియోగం, అతిపెద్ద నదీ శుద్ధి కార్యక్రమం, వేల సంఖ్యలో పారిశుద్ధి కార్మికులు.. ఇలా ఎన్నెన్నో సదుపాయాలను కల్పించారు. మిగతా కుంభమేళాలకు భిన్నంగా 144 ఏళ్ల తర్వాత జరగనున్న ఈ మహా కుంభమేళాకు ఎన్నో ప్రత్యేకతలున్నాయి. ఆధ్యాత్మికతతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మిళితం చేసి ప్రత్యేక ఏర్పాట్లు చేయడం విశేషం.వేల సంఖ్యలో సీసీ కెమెరాలు, నీటి అడుగునుంచే పర్యవేక్షించే నిఘా కెమెరాలు, పడవలపైనుంచి నిఘా లాంటి ఎన్నెన్నో ఆధునిక సాంకేతికతో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర పోలీసులతో పాటుగా వేల సంఖ్యలో పారా మిలిటరీ బలగాల సేవలను ఉపయోగించుకోనున్నారు. అందుబాటులో ఉన్న అన్ని సేవలను ఉపయోగించుకోవడం ద్వారా భక్తులకు మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి.కుంభమేళాకు ప్రత్యేక ఆకర్షణ లక్షల సంఖ్యలో తరలివచ్చే సాధువులేనని చెప్పవచ్చు. హిమాలయాల్లో ఉండే నాగసాధువులతో పాటు వివిధ అఖారాలనుంచి లక్షల సంఖ్యలో సాధువులు ఈ మహా కుంభమేళాకు తరలి రానున్నారు. నాగసాధువులను దర్శించుకొని వారి ఆశీర్వాదాలు తీసుకోవడానికి భక్తులు ఎగబడతారు. మరోవైపు ఇన్ని కోట్లమంది భక్తులకు ఆహార, వసతుల కోసం వివిధ మఠాలు, స్వచ్ఛంద సంస్థలు కూడా తమ శక్తివంచన లేకుండా ఏర్పాట్లు చేశాయి.అవసరమైన సమాచారాన్ని అందించడానికి రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్‌తో పాటుగా వందల సంఖ్యలో సమాచార కేంద్రాలు సిద్ధం చేసింది. రోజుకు కోటిమంది భక్తులు వచ్చినా ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చూడడానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఉత్సవాల ప్రారంభం సందర్భంగా యూపీ సీఎం యోగిఆదిత్యనాథ్ చెప్పడం గమనార్హం. ఇక తొలి రోజే కోటికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు చెప్తున్నారు.మకర సంక్రాంతినాడు తొలి రాజస్నానం మొదలు కాగా , మహా శివరాత్రినాటి రాజస్నానంతో మేళా ముగుస్తుంది. మహా కుంభం మొదటి రెండు రోజుల్లో 5.15 కోట్ల

మంది స్నానాలు చేయడం కూడా ఒక రికార్డేనట.

తొలిరోజు మహాకుంభంలో 1.65 కోట్ల మంది స్నానాలు చేయగా,

మకర సంక్రాంతి రోజున 3.50 కోట్ల మంది స్నానాలు చేశారట.

హింస జరగలేదు... కులం, మతం, పౌరసత్వం గురించి ఎవరినీ అడగలేదు...

ఎవరినీ కించపరచలేదు.. మరే ఇతర మతాన్ని కూడా చిన్నచూపు చూడలేదు.

ప్రపంచం నలుమూలల నుంచి ఎందరో ధనవంతులు,

స్వదేశీ, విదేశాల నుంచి అన్ని రకాల భక్తులు...

ఎంతో భక్తిపూర్వంగా వచ్చి.. తమ తమ భక్తి శ్రద్ధలను ఆచరించి

**తరించి పరమానంద భరితులయ్యారో.**

ఇన్ని కోట్ల మందికి ఆహారం, నీరు తదితరాల ఏర్పాటు ఉంది...

ప్రయాగ్‌రాజ్‌లో వసతి కూడా ఉంది... భక్తులకు ఇది పూర్తిగా ఉచితం...

ఇలాంటి ఉదాహరణ ప్రపంచంలో ఎక్కడా

**మనకూ కనిపించదు...**

ఈ ప్రయాగ్‌రాజ్ మహాకుంభం అతీంద్రియమైనది...

మరపురానిది... ఊహకందనిది....

ఇది కేవలం భారత్ లో మాత్రమే సాధ్యమవుతున్నది...

ఇంత చిన్న నగరంలో ఇందరు భక్తులు రాక పోకలు సాగించడమా?

ఇది కలయా నిజమా? అన్న మీమాంశను వదిలి

ప్రయాగ్ రాజ్ వెళ్లండి.. 144 ఏళ్ల తర్వాత జరుగుతోన్న మహాకుంభమేళాను

ఆస్వాదించి.. ఆ గంగామాయి ఆశీస్సులు పొందండి..

ముక్కోటి దేవతల ఆశీర్వచనాలు అందుకోండంటూ

పిలుస్తోంది ఉత్తర ప్రదేశ్!!!మహాకుంభమేళా సందర్భంగా దాదాపు 2 లక్షల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుందని అంచనా. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన ఆధ్యాత్మిక పండుగగా భావించే ఈ మహాకుంభమేళాలో స్నానమాచరిస్తే ఆత్మశుద్ధిని పొందడమే కాకుండా భగవంతుడికి చేరువవుతారన్నది హిందువుల బలమైన విశ్వాసం. అందుకే ఈ ఆధ్యాత్మిక జనసంద్రం.

# రింగ్ రోడ్డు సమీపంలోని భూముల్ని ఓ మంత్రి రాయించుకునే ప్రయత్నం చేస్తున్నారు

**పెన్ పవర్ డెస్క్:**రింగ్ రోడ్డు సమీపంలోని 85 ఎకరాల భూమిని ఓ మంత్రి తన కుటుంబసభ్యుల పేరు మీద రాయించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. ఈరోజు ఆయన నాంపల్లి పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చేతనైతే మూడు తరాలుగా అక్కడే ఉంటున్న గిరిజన రైతులకు పట్టాలు ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురం మండలం, శంకర్ పల్లి మండలం మధ్య చాలాకాలంగా భూవి వాదం నడుస్తోందని శంకర్‌పల్లిలోని కొండకల్, రామచంద్రాపురంలోని వెలిమెల గ్రామాల మధ్య మిగిలిన దాదాపు రూ.1,500 కోట్ల విలువైన 85 ఎకరాలను కబ్జా చేసేందుకు ప్రజలపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు.ప్రజల భూములను కాపాడేందుకే ధరణి స్థానంలో భూమాత చట్టాన్ని తెచ్చామని అసెంబ్లీలో ఉపన్యాసాలు ఇచ్చిన మంత్రి ఇప్పుడు పేద ప్రజల భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పేదలకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నిస్తే పోలీసులను అడ్డు పెట్టుకొని బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఈ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఒక రంగు పోయి మూడు రంగుల జెండా వచ్చిందే తప్ప ప్రజల బతుకులు మారలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలు కొంతమంది హైదరాబాద్ రింగ్ రోడ్డు చుట్టూ ఉన్న పేదల ఖాళీ స్థలాలను, భూములను లాక్కుంటున్నారని ఆరోపించారు.

# తాగు, తిను, ఊగు... సంక్రాంతికి కూటమి ప్రభుత్వం చేసింది ఇదే

- మొదటి పేజీ తరువాయి

సరదాగా జరిగే సంక్రాంతి సంబరాలను కేసినో స్థాయికి తీసుకెళ్లారని అన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కోడి పందేల బరులను ఏర్పాటు చేశారని... పందేల ద్వారా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు వేల కోట్లు సంపాదించారని దుయ్యబట్టారు. జూదం అధికారికమే అనే విధంగా సంక్రాంతి సంబరాలను ఆర్గనైజ్డ్ క్రైమ్ గా మార్చేశారని చెప్పారు. రికార్డింగ్ డ్యాన్సులు కూడా చేయించారని మండిపడ్డారు. తాగు, తిను, ఊగు అనే విధంగా సంక్రాంతిని కూటమి ప్రభుత్వం చేసిందని చెప్పారు. ఐపీఎల్ మాదిరి కోడి ప్రీమియర్ లీగులు పెట్టారని విమర్శించారు.

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కూడా కోడి పందేల్లో పాల్గొన్నారని మహేశ్ విమర్శలు గుప్పించారు. కోడి పందేల్లో మహిళా బౌన్సర్లను కూడా పెట్టారని మండిపడ్డారు. కోడి పందేలు ఆడుకోవచ్చని హోం మంత్రి అనిత పర్మిషన్ ఇచ్చారా? అని ప్రశ్నించారు. దీనికి అనిత సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గోదావరి జిల్లాలకు దీటుగా కృష్ణా జిల్లాలో 320కి పైగా కోడి పందేల బరులు ఏర్పాటు చేశారని మహేశ్ చెప్పారు. స్కూళ్ల ప్రాంగణాల్లో కూడా బరులు ఏర్పాటు చేశారని అన్నారు. ఇదేం పాలన అని చంద్రబాబుని, పవన్ కల్యాణ్ ని జనాలు తిట్టుకుంటున్నారని తెలిపారు. అశ్లీల నృత్యాలను ప్రమోట్ చేయడమేనా అభివృద్ధి అంటే అని ప్రశ్నించారు. పవన్ చెప్పే సనాతన ధర్మం అంటే... కోడి పందేలు, పేకాట, గుండాట ఆడటమేనా? అని అడిగారు. కోడి పందేలను నిర్వహించిన ఎమ్మెల్యేలను పవన్ ఎందుకు సస్పెండ్ చేయడం లేదని ప్రశ్నించారు.

# యంగ్ క్రికెటర్ నితీశ కుమార్ రెడ్డికి రూ.25 లక్షల చెక్ అందించిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు చేతుల మీదుగా రూ.25 లక్షల చెక్ అందుకున్నాడు.ఆస్ట్రేలియా టూర్లో నితీశ్ కుమార్ రెడ్డి వీరోచితంగా ఆడి సెంచరీ నమోదు చేయడం తెలిసిందే. దాంతో ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ) అతడికి రూ.25 లక్షల నజరానా ప్రకటించింది. ఏసీఏ అధ్యక్షుడు, టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) నేడు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆ నజరానా చెక్ ను నితీశ్ కుమార్ రెడ్డికి అందించారు. దీనిపై సీఎం చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందించారు.

"విశేష ప్రతిభావంతుడైన యువ క్రికెటర్ మన నితీశ్ కుమార్ రెడ్డిని నేడు కలిశాను. తెలుగు సమాజం నుంచి వెలుగులు విరజిమ్ముతున్న నికార్సయిన ధ్రువతార నితీశ్. తన ఆట ద్వారా ప్రపంచ వేదికపై భారత్ కు గర్వకారణంలా నిలిచాడు. నితీశ్ కెరీర్ ను తీర్చిదిద్దడంలో మద్దతుగా నిలుస్తున్న అతడి తల్లిదండ్రులను అభినందించాను. రాబోయే సంవత్సరాల్లో మరిన్ని సెంచరీలు సాధించాలని, మరింత విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను" అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు. అంతేకాదు, నితీశ్ తనను కలిసిన ఫొటోలు కూడా పంచుకున్నారు.

# చరిత్ర సృష్టించిన టీడీపీ... కోటి దాటిన సభ్యత్వాల సంఖ్య

- మొదటి పేజీ తరువాయి

సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీసుకున్న నిర్ణయం సభ్యత్వ నమోదు కార్యక్రమం ఇంత పెద్ద సక్సెస్ కావడానికి ప్రధాన కారణం.

టెక్నాలజీ వినియోగం ద్వారా... పార్టీ కోసం క్షేత్ర స్థాయిలో ఎవరు కష్టపడి పనిచేస్తున్నారో పార్టీ అధిష్ఠానానికి స్పష్టంగా తెలుస్తుంది. తద్వారా పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు ఇచ్చేప్పుడు ప్రాధాన్యత లభిస్తుంది. పనిచేసే వారికే ప్రాధాన్యత అని లోకేశ్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని నాయకులు సభ్యత్వ నమోదు కోసం తీవ్రంగా కృషి చేశారు. పార్టీ సభ్యత్వ నమోదులో తాము చేసిన కష్టానికి గుర్తింపు లభిస్తుందని కార్యకర్తలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. నారా లోకేశ్ ఎక్కువ సభ్యత్వాలు చేసిన కార్యకర్తలతో మాట్లాడి అభినందించడం, ప్రోత్సహించడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

**సభ్యత్వాల నమోదులో టాప్ టెన్ నియోజకవర్గాలు ఇవే...**

సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పోటీపడి మరీ రికార్డులు సృష్టించారు. 11 నియోజకవర్గాలు లక్ష సభ్యత్వాల మార్కు దాటాయి. టాప్ టెన్ లో నెల్లూరు సిటీ 1,49,270, ఆత్మకూరు 1,48,802, పాలకొల్లు 1,48,559, రాజంపేట 1,45,766, కుప్పం 1,38,446, ఉండి 1,21,527, గురజాల 1,11,458, వినుకొండ 1,06,867, మంగళగిరి 1,06,145, కళ్యాణదుర్గం 1,01,221, కొవూరు 1,00,473 సభ్యత్వాలతో ఉన్నాయి.

**లైఫ్ టైమ్ మెంబర్షిప్**

శాశ్వత సభ్యత్వాలకు కూడా పెద్ద ఎత్తున స్పందన లభించింది. మంగళగిరి - 145, ఆత్మకూరు - 137, వినుకొండ - 79, గంగాధర నెల్లూరు - 62, తణుకు - 60 నియోజకవర్గాలు టాప్ ఫైవ్ లో నిలిచాయి.

**కార్యకర్తల సంక్షేమం**

కార్యకర్తల సంక్షేమం కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి... నారా లోకేశ్ ఆధ్వర్యంలో దిగ్విజయంగా నడిపిస్తున్నారు. కార్యకర్తలు.. వారి కుటుంబసభ్యుల విద్య, వైద్యం, వివాహం, ఆర్థిక అవసరాలలో ఆదుకుంటూ కొండంత అండగా నిలుస్తున్నారు. ప్రమాదంలో కార్యకర్తలు చనిపోతే వారి కుటుంబానికి ప్రమాదబీమా అందించి ధీమా కల్పిస్తున్నారు.

టీడీపీ కార్యకర్తల బాగోగులు చూసుకునే బాధ్యత లోకేశ్ కు అప్పగిస్తున్నామని 2014 మహానాడులో చంద్రబాబు ప్రకటించారు. నాటి నుంచి నేటివరకూ 2500 మందికి పైగా కార్యకర్తల పిల్లల చదువులకు సహాయం చేశారు. వివిధ ప్రమాదాల్లో మరణించిన సుమారు 5164 మంది కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల రూపాయలు చొప్పున రూ. 103 కోట్ల 28 లక్షల రూపాయలు అందించారు.

అనారోగ్యంతో బాధపడుతున్న అనేక మంది కార్యకర్తలకు వైద్య సహాయం అందించారు. సుమారు 2000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. సుమారు 5000 మంది కార్యకర్తల కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలిచి రూ. 19 కోట్లు ఆర్థిక సహాయం చేశారు.

రూ.100తో సభ్యత్వం తీసుకున్న తెలుగుదేశం కార్యకర్తల సంక్షేమం చూసేందుకు లోకేశ్ ఆధ్వర్యంలో టీడీపీ వెల్ఫేర్ వింగ్ అవిశ్రాంతంగా పని చేస్తోంది. ఎన్టీఆర్ మోడల్ స్కూళ్ల ద్వారా ఉచిత విద్య, ఉపకారవేతనాలు, ప్రైవేట్ స్కూళ్లలోనూ ఫీజుల్లో రాయితీలుగా రూ. 2 కోట్ల 35 లక్షల రూపాయలు చెల్లించారు. చదువు పూర్తయిన వారికి ఉపాధి, ఉద్యోగావకాశాలు సాధించేలా నైపుణ్యశిక్షణ ఇస్తున్నారు.

రూ.100తో తీసుకున్న సభ్యత్వం ద్వారా వచ్చే ప్రమాద బీమా ప్రయోజనాన్ని రూ. 5 లక్షలకు పెంచారు. నారా లోకేశ్ సమక్షంలో కోటి మందికి ప్రమాద బీమా కల్పిస్తూ తెలుగుదేశం పార్టీ, యునైటెడ్ ఇండియా ఇన్స్యూరెన్స్ మధ్య ఒప్పందం చేసుకున్నారు.

# ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

- మొదటి పేజీ తరువాయి

వేతనాలు పెరగనున్నాయి. 2026 జనవరి 1 నుంచి కొత్త వేతనాలు అమల్లోకి వస్తాయి. త్వరలో కొత్త కమిషన్ కు చైర్మన్, ఇద్దరు సభ్యులను నియమించనున్నారు.మరోవైపు, శ్రీహరికోటలోని షార్‌లో మూడో లాంచ్ ప్యాడ్ నిర్మాణానికి కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.3,985 కోట్ల వ్యయంతో మూడో లాంచ్ ప్యాడ్‌ను నిర్మించనున్నారు. ఎన్‌జీఎల్‌వీ ప్రయోగాలకు అనుగుణంగా మూడో లాంచ్ ప్యాడ్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఎన్‌జీఎల్‌వీ ద్వారా భారీ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టే అవకాశం ఉంటుంది.

# రేపు చంద్రబాబు ఇంటికి వెళుతున్న అమిత్ షా

- మొదటి పేజీ తరువాయి

అమిత్ షా ఏపీకి చేరుకుంటారు. ఆ రాత్రి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయనతో భేటీ అవుతారు. అమిత్ షాకు చంద్రబాబు హైలెవెల్ డిన్నర్ ఇవ్వబోతున్నారు. అనంతరం అమిత్ షా విజయవాడలోని హోటల్లో బస చేస్తారు. గన్నవరం సమీపంలో నిర్మించిన ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం కార్యాలయాలను జనవరి 19న ఆయన ప్రారంభిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత చంద్రబాబు దావోస్ పర్యటనకు బయల్దేరుతారు.

# సైఫ్ అలీ ఖాన్ ఇంటిని పరిశీలించిన ఎన్ కౌంటర్ స్పెషలిస్ట్

- మొదటి పేజీ తరువాయి

వివరాలను ఆరా తీశారు. ముంబై అండర్ వరల్డ్ ను వణికించిన ఎన్ కౌంటర్ స్పెషలిస్టుగా దయాకు పేరుంది. దాదాపు 80 మందిని ఆయన ఎన్ కౌంటర్ చేసినట్టు సమాచారం. ఎన్ కౌంటర్ స్పెషలిస్టుగా ఆయనకు ఎంత గొప్ప పేరు ఉందో... ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కూడా అంతే అపఖ్యాతి ఉంది. దయా నాయక్ జీవిత కథ స్ఫూర్తితో బాలీవుడ్ లో సినిమాలు కూడా వచ్చాయి. సైఫ్ పై దాడి కేసులో ఘటనను పరిశీలించడానికి దయా నాయక్ రావడంతో... అందరిలో ఎంతో ఆసక్తి నెలకొంది.

# ఛత్తీస్ గఢ్-తెలంగాణ సరిహద్దులో భారీ ఎన్ కౌంటర్... 11 మంది నక్సల్స్ మృతి

- మొదటి పేజీ తరువాయి

ఈ ఎదురుకాల్పుల ఘటనలో 11 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఛత్తీస్ గఢ్-తెలంగాణ సరిహద్దు అటవీప్రాంతం కాల్పుల మోతతో దద్దరిల్లింది. బీజాపూర్ జిల్లా బారేడుబాక అటవీ ప్రాంతం వద్ద భద్రతా దళాలకు, నక్సల్స్ కు మధ్య కాల్పులు జరిగాయి. యాంటీ నక్సల్ ఆపరేషన్ చేపడుతున్న సంయుక్త భద్రతా దళాలకు మావోయిస్టులు తారసపడ్డారు. ఈ ఉదయం 9 గంటల నుంచి కాల్పులు జరుగుతున్నాయి. ఘటన స్థలం నుంచి పోలీసులు పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

## విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్రం శుభవార్త...

# భారీ ప్యాకేజీకి ఆమోదం

- మొదటి పేజీ తరువాయి

ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. ఉక్కు పరిశ్రమకు సంబంధించి ఆపరేషనల్ పేమెంట్స్ కోసం ఈ ప్యాకేజీని వినియోగించనున్నారు. తాజా ఉద్దీపన ప్యాకేజీపై రేపు అధికారిక ప్రకటన వెలువడనుంది.కేంద్రం పెద్దలను కలిసిన ప్రతిసారి ఏపీ సీఎం చంద్రబాబు విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రస్తావన తెస్తూ, ప్లాంట్ ను గట్టెక్కించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల ప్రధాని మోదీ విశాఖ రాగా, ఆ సభలో విశాఖ ప్లాంట్ పై ప్రకటన చేస్తారని అందరూ భావించారు. అయితే, మోదీ సహా చంద్రబాబు, పవన్, లోకేశ్ ఎవరూ ఉక్కు పరిశ్రమపై మాట్లాడకపోవడంతో... ప్రైవేటీకరణ ఖాయమేనన్న వాదనలు వినిపించాయి. కానీ, చంద్రబాబు ప్రయత్నాలు ఫలించి కేంద్రం సానుకూల నిర్ణయంతో ఏపీ ప్రజలకు శుభవార్తను వినిపించింది.

# సైఫ్ చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వచ్చిన తల్లి షర్మిలా ఠాగూర్

### గత రాత్రి తన నివాసంలో కత్తిపోట్లకు గురైన సైఫ్ అలీ ఖాన్

### ముంబయిలోని లీలావతి ఆసుపత్రిలో చికిత్స

### ఘటన పట్ల దిగ్భ్రాంతికి గురైన సైఫ్ తల్లి షర్మిలా ఠాగూర్

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ తన ఇంట్లో ఓ దుండగుడి చేతిలో కత్తిపోట్లకు గురవడం తెలిసిందే. గత రాత్రి జరిగిన ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. సైఫ్ ఒంటిపై 6 కత్తిపోట్లు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. సైఫ్ కు శస్త్రచికిత్స చేసి వెన్నులో ఇరుక్కుపోయిన కత్తి మొనను తొలగించారు. ప్రస్తుతం సైతం ముంబయిలోని లీలావతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, సైఫ్ తల్లి, అలనాటి నటి షర్మిలా ఠాగూర్ ఈ సాయంత్రం లీలావతి ఆసుపత్రికి వచ్చారు. చికిత్స పొందుతున్న కుమారుడ్ని పరామర్శించారు. కత్తిపోట్ల ఘటన పట్ల ఆమె దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. షర్మిలా ఠాగూర్ రాకకు ముందే సైఫ్ ను పలువురు బాలీవుడ్ తారలు పరామర్శించారు. సంజయ్ దత్, మలైకా అరోరా, రణబీర్ కపూర్, అలియా భట్ తదితరులు పరామర్శించారు.

# అనాధ శవానికి దహన సంస్కారాలు



**జగ్గంపేట, పెన్ పవర్, జనవరి 16**: స్థానిక సంత మార్కెట్ లో గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మరణించడంతో విషయం తెలుసుకున్న కాకినాడ జిల్లా భారతీయ ధర్మ పరిషత్ అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి తన సొంత ఖర్చులతో దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన వారు మరణించక తప్పదని మరణించిన ప్రతి వ్యక్తి ఆ పరమాత్ముని సన్నిధికి చేరుకుంటామన్నారు. మెట్ట ప్రాంతంలో ఎక్కడైనా అనాధలు చనిపోతే వారి దాహన సంస్కారాలు మా సొంత ఖర్చులతో నిర్వహిస్తామన్నారు. గత ఏడు సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ సేవా రత్న బిరుదు అందుకున్న ఆయన ఆ బిరుదుకు సార్ధకత చేకూరుస్తూ అనేక రకాల సేవలందిస్తున్న నాగేంద్ర చౌదరిని పలువురు అభినందిస్తున్నారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# పందెం కో..డ్డీ గెలిచింది







### -మహేంద్ర థార్ విజేత గోల్డ్‌మ్యాన్
### -జోరుగా పందేలు..కిక్కిరిసిన జనం
### -యథేచ్ఛగా పందేలు -తగ్గేదేలే!

**కాకినాడ జిల్లా స్టాఫ్ రిపోర్టర్, పెన్‌పవర్**:జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన కోడి పందేల నిర్వహణలో పందెం కోడే గెలిచింది.సంక్రాంతి పండుగను పరుస్కరించుకుని యుభయగోదావరి జిల్లా వ్యాప్తంగా కోడిపందాలు హెూరాహెూరీగా జరిగాయి.సంప్రదాయ ముసుగులో నిర్వాహకులు ఎక్కడికక్కడ కోడిపందాలు యథేచ్ఛగా నిర్వహించారు.పండగ మూడు రోజుల ముందరే ఎక్కడా కూడా జూద క్రీడలు ఆడేందుకు ఎటువంటి అనుమతలు లేవంటూ బిరుల నిర్వాహకులకు పోలీసులు ఆంక్షలు విధించారు. మైక్‌లలో కోడిపందాలు నిర్వహణకు ఎటువంటి అనుమతలు లేవంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు.భోగి ముందురోజువరకు పోలీసులు చేసిన హంగామా అంతా ఇంతాకాదు. చివరికి ఆ ప్రచార గొంతులు ఒక్కసారిగా మూగబోయాయి. బరులలో పందెం కోళ్లు కత్తులు దూసాయి.యథేచ్ఛగా కోడిపందాల నిర్వహణకు మినీ స్టేడియంను తలపించే విదంగా ,క్రీడా మైదానాలు రాత్రికి రాత్రే బరులు సిద్ధం చేశారు.ప్రతి బరిలో భారీ ఎత్తున నగదు మార్పులు జరిగాయి. యథేచ్ఛగా కోడిపందాలు జరిగితే..పోలీసులు ప్రేక్షకపాత్రవహించారు. ప్రతి బరివద్ద ఇద్దరు పోలీసులు మఫ్టీలో ఉండటం విశేషం.పందెం రాయుళ్లు బరితెగించారు.కరప, కాకినాడ రూరల్, పెదతాళ్లపొలం,జగన్నాధగిరి, గొర్రెపూడి,కొంగోడు,తదితర గ్రామాల్లో నిర్వహించిన పందెం బరులలో కోళ్లకు కత్తెలు కట్టి బరిలో ఉదలగానే హెూరాహెూరీగా పోరాడాయి.కరప మండల పరిధిలోని కొరిపల్లిలో నిర్వహించిన పందేలు చూసేందుకు జనం పోటెత్తారు.నువ్వా -నేనా అంటూ పందెం కోళ్లు కత్తులతో నాట్యం చేయడంతో పందెం రాయుళ్ల ,వీక్షకుల గుండెల్లో ఉత్కంఠ మొదలైంది.కొన్ని సందర్భాలలో చావు అంచులకు చేరినా తగ్గేదేలే! అంటూ చివరి క్షణం వరకూ పోరాడీ..తమ యజమానులను నెగ్గించేందుకు ఎక్కడా తగ్గేవి కావు.కొన్ని పుంజులు బరిలోనే ప్రాణాలు విడిచాయి.పండగ మూడు రోజులు ఇటు కోడిపందాలు, అటు పక్కనే నెంబరు గుండాటలు హెూరెత్తాయి. రామచంద్రపురం నియోజకవర్గంలో మొదటి రోజే కొన్ని బరులలో బోర్డులు తిప్పేశారు.కాజులూరు, వెల్లగ్రామాల్లో బరులు వెలవెలబోయాయి. అయితే అక్కడ నిర్వాహకులు, కూటమి నేతలు ఇతరాత్రా కారణాలు చెప్పడం విశేషం.అసలు విషయం ఏమిటనేదీ వారికే ఎరుక.అయితే కాకినాడ , కోనసీమ జిల్లాలలో పందేలు జోరుగా కొనసాగాయి.ఈ ఏడాది పందెం బరులలో జనసేన, టీడీపీ నేతలు పోటాపోటీగా బరులు సిద్ధం చేసి పందాలు ఆడించారు. కొన్ని చోట్ల నిర్వాహకులు పందెంలో విజయం సాధించిన వర్గాలకు బుల్లెట్ బైక్, థార్ జీపులను బహుమతులుగా ఇవ్వడం జరగుతుందని ప్రకటించడంతో కరప, కాకినాడ రూరల్, గొర్రెపూడి తదితర బరులలో పోటీలు రసవత్తరంగా సాగాయి.కరప పందేలు తిలకించేందకు ప్రముఖులు,రాజకీయ నేతలు, మహిళలు కోడిపందాలు తిలకించేందుకు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అందుకు తగ్గట్టుగానే నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.అలాంటివారికి నిర్వాహకులు స్వాగతం పలుకుతూ వారి ప్రశంసలు పొందారనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇదిలా ఉంటే కనుమ పండుగ రోజున కరపలో జనసేన కొండబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన బరిలో పందాలు ఉదయం నుంచి ఉత్కంఠగా సాగాయి.64 పందేలు నిర్వహించగా ,33 మ్యాజిక్ ఫిగర్ దాటినవారికి మహేంద్రా తార్ బహుమానంగా ప్రకటించారు.బుధవారం సాయంత్రానికి 33 పందాలను కాజులూరు మండల పరిధిలోని బందనపూడి గ్రామ సర్పంచ్ దేగల తిరుమలవేణి కుమారుడు దేగల నాగేంద్ర (గోల్డ్ మ్యాన్) గెలుచుకున్నారు.దీంతో ఆయన్ని విజేతగా ప్రకటించారు.గత ఏడాది గొర్రిపూడిలో నిర్వహించిన పందేలలో బుల్లెట్ కైవసం చేసుకోగా, 2025 నూతన సంవత్సరంలో మహేంద్రాతార్ విజేతగా నిలవడంతో గోల్డ్‌మ్యాన్ సంతోషం వ్యక్తం చేశారు.దీంతో కోడిపందేల బరిలో ఆయన అభిమానులు,వీక్షకులతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా హర్షధ్వానాలతో మార్మోగిపోయింది.పందేలు తిలకించిన వారిలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ,పిల్లి సత్తిబాబు,ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వి,తోట కుటుంబ సభ్యులు,టీడీపీ నేత రేవు శ్రీను కుటుంబ సభ్యులు, గుబ్బల ఏసురాజు,గండి కిషోర్,మాజీ జెడ్పీటీసీ బుంగా సింహాద్రి,జనసేన నాయకులు తదితరలు ఉన్నారు.

# ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మికతనిఖీ





**ఏలూరు జనవరి 16 పెన్ పవర్** : ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్ చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం ఆకస్మికతనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో డాక్టర్లు, నర్సులు సమన్వయంతో పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు.ఆసుపత్రిలో సిసి రోడ్లు, డ్రైయినేజీల పనులుఫిబ్రవరి 28వ తేదీ లోగా పూర్తిచెయ్యాలన్నారు. ఆసుపత్రిలో ప్రాధమిక సేవలుతోపాటు స్పెషాలిటీ చికిత్సలు పొందే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది సమన్వయ స్ఫూర్తితో పనిచేసి పేదలకు వైద్యసేవలు అందించాలన్నారు.స్థానిక కలెక్టరేట్ లోని నిర్వహించే డిఆర్సి సమావేశానికి హాజరయ్యే ముందు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ తనిఖీలో భాగంగా రోగులకు అందుతున్న వైద్య సేవలపై రోగులను కలిసి ఆరా తీశారు.ఎముకల విభాగంలో ఎముకలకు సంబంధించిన చికిత్స నిమిత్తం వచ్చిన వ్యక్తితో మంత్రి మాట్లాడుతూ ఉదయం ఆసుపత్రికి ఎన్నిగంటలకు వచ్చారని మంత్రి అడుగగా 9 గంటలకు వచ్చానాని మంత్రికి తెలిపారు. తొమ్మిది గంటలకు వచ్చిన రోగులను ఇంతవరకు చూడకపోవడంపై మంత్రి డాక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి రోగులకు సేవలు అందించాలని తెలిపారు. అదే విధంగా ఓపి కి సంబంధించిన సమాచారాన్ని అడిగి తెలుసుకొని రోజువారీ ఓపిలు ఎంత వచ్చేది, వాటికి సంబంధించిన కంప్యూటర్ లో నమోదు చేసిన నివేదికను మంత్రి పరిశీలించారు.బ్లడ్ బ్యాంక్ ను పరిశీలించి బోర్డులో వివరించిన వివరాలు తప్పుగా ఉండడం గమనించి సంబంధిత సెంటర్ ఇన్ ఛార్జిని మంత్రి నిలదీశారు. డ్రైయినేజీ, సిసి రోడ్లు, పంపు లీకేజి లకు సంబంధించి ఫిబ్రవరి 28వ తేదీ లోగా డ్రైయిన్ లు,సిసి రోడ్లు, పూర్తిచెయ్యాలని వైద్య విధాన పరిషత్ ఇఇ ని మంత్రి ఆదేశించారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు. ఆసుపత్రి తనిఖీ అనంతరం పాత్రికేయుల సమావేశంలో మంత్రి నా మనోహర్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఏలూరు జనరల్ ఆసుపత్రికి వైద్య సేవలు అందించడంలో మంచి పేరువుందని, జిల్లాలు విడుపోయినతర్వాత ఏలూరు జిల్లాలో జనరల్ ఆసుపత్రి ఉండటం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.600 పడకలు గల ఈ ఆసుపత్రిలో డాక్టర్లు, నర్సిగ్ సిబ్బంది సమన్వయంతో టీం స్పిరిట్ తో రోగులకు వైద్య సేలవలు అందించలో సమాయత్తం చేయడానికి కృషిచేస్తాని తెలిపారు. ఆసుపత్రిలో డాక్టర్లు, నర్సింగ్ డిపార్ట్ పెంట్ వారీగా ఖాళీలు ఉన్నాయని, పేషెంట్ తరపున వీల్ చైర్స్ , పరికరాలు,యంత్రాలు, తర్వాత డిఆర్ సిలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆధ్వర్యంలో శాసన సభ్యులతో ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన చర్యలను తీసుకోవడానికి కృషిచేస్తామని చెప్పారు. గుండెకు సంబంధించిన వైద్యులు ఈ ఆసుపత్రికి అవసరమని పార్లమెంట్ సభ్యులు, దాతల సహాయాన్ని కోరతామని, అలాగే రాబోయే రోజుల్లో అన్ని ప్రాధమిక వైద్య సేవలుతోపాటు స్పెషాలిటీ చికిత్స ఉండేలాగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తనిఖీలో మంత్రి వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. యం.ఏస్.రాజు, ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు, పోలవరం శాసన సభ్యులు చిర్రి బాలరాజు మాజీ శాసన సభ్యులు గన్ని వీరాంజనేయులు, ఘంటా మురళి ,ఆసుపత్రి డాక్టర్లు, నర్సులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# కాకినాడలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్




### ప్రాతినిధ్యం వహించడం గొప్ప శుభ పరిణామం
### జిల్లా కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ.పెన్ పవర్ జనవరి 16** :ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు కాకినాడ ప్రాతినిధ్యం వహించడం గొప్ప శుభ పరిణామం అని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ కాకినాడ జిల్లాలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ చేసిన ప్రతిపాదన మేరకు సెంట్రల్ సివిల్ సర్వీసెస్ బోర్డ్ కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆస్ట్రో టర్ఫ్ హాకీ ఫీల్డ్ నందు నిర్వహించేందుకు అంగీకరించడంతో కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్, ట్రస్ట్ ఫౌండర్, ఆదాయ పన్ను అధికారి రవిచంద్ర..జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ తో కలిసి గురువారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ కాకినాడలో నిర్వహించేందుకు చేసిన కృషికి గాను ఆయన ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ కాకినాడ వేదికగా జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ టోర్నమెంట్ రానున్న ఫిబ్రవరి నెల 15 నుంచి 28 వరకు కాకినాడ క్రీడా ప్రాధికార సంస్థ మైదానం ఆస్ట్రో టర్ఫ్ హాకీ ఫీల్డ్ లో జరుగుతుందన్నారు. కోకనడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్, జిల్లా హాకీ అసోసియేషన్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సక్రమంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఇటువంటి మెగా టోర్నమెంట్ కాకినాడ జిల్లా ప్రాతినిధ్యం వహించడం ద్వారా జిల్లాలోని క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో కాకినాడలో అంతర్జాతీయ టోర్నమెంట్లు నిర్వహించేందుకు అన్ని విధాల కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

# జనసంద్రం... గొల్లాలమ్మ సంబరం....








**అనపర్తి,పెన్ పవర్,జనవరి 16** చిన్నారుల పాలిట క్షేమదాయినిగా, రైతుల పాలిట వరదాయినిగా భక్తులకు కల్పవల్లిగా కొలువైన గొల్లాలమ్మ అమ్మవారి సంబరం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం అమ్మవారి సంబరాన్ని అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, తనయుడు మనోజ్ రెడ్డిలు అమ్మవారికి పూజలు నిర్వహించి ప్రారంభించారు. మూడు నెలల క్రితం గ్రామ ప్రవేశం చేసిన అమ్మవారు శివాలయం సమీపాన తాత్కాలిక ఆవాసంలో కొలువై చల్లఘటం రూపంలో పూజలందుకుంది. గ్రామస్తులు ప్రతి రెండేళ్లకోసారి ఇలా అమ్మవారిని పల్లెకు తీసుకురావడం ఆనవాయితీ. సంక్రాంతి రోజున అమ్మవారికి జాగారం, కనుమ రోజున నైవేద్యాలు, ముక్కనుమ రోజున సంబరం నిర్వహించి తిరిగి సాగనంపుతారు. గురువారం మధ్యాహ్నం అమ్మవారికి గ్రామోత్సవం జరగటం ఆనవాయితీగా వస్తుంది. దూరప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులను సబ్బిళ్ళ శ్రీనివాసరెడ్డి (బొచ్చు శీను) బాపనమ్మ అమ్మవారి సన్నిధిలో పూలమాల శాలువాలతో సత్కరించారు. ఆసాదులు గరగను ఎమ్మెల్యే తలపై ఉంచి ఆశీర్వదించారు. చిన్నారులను ఆశీర్వాదం కోసం అమ్మవారి పాదాల చెంత ఉంచారు. అమ్మవారు చంటిపిల్లలపై నుంచి దాటితే చిన్నారులకు శుభం జరుగుతుందని భక్తుల నమ్మకం. సల్లఘటం రూపంలో ఉన్న అమ్మవారి దర్శనానికి భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. పసుపు నీళ్లతో అమ్మవారి కాళ్లు కడిగి వడపప్పు, చలిమిడి నైవేద్యాలు పెట్టారు. చంటి బిడ్డల తల్లులు పెద్దసంఖ్యలో అమ్మవారి దర్శనానికి వచ్చారు. గ్రామోత్సవంలో తీన్ మార్, కోలాటం, కనుమరుగవుతున్న గారడి, కొడిగడుతున్న కళారూపాలు ఎంతగానో అలరించాయి.

## జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్ష




**జీలుగుమిల్లి ,పెన్ పవర్, జనవరి 16:**ఏలూరు జిల్లాలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమపై ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్చించినట్లు పోలవరం ఎమ్మెల్యే చిరి బాలరాజు తెలిపారు. గురువారం ఏలూరు లో జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టులు, అమలు అవుతున్న సంక్షేమ పథకాలు, భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, దీపం, ధాన్యం కొనుగోలు, శాంతి భద్రతలు, పరిపాలనపరమైన అంశాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి, కలెక్టర్ వెట్రి సెల్వి, జెసి దాత్రి రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## అల్లుడికి 207 రకాలతో విందు






**గోపాలపురం,పెన్ పవర్ జనవరి 16 :**సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కొత్త అల్లుడికి 207 రకాల వంటకాలతో విందు తయారుచేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది.దొండపూడి గ్రామానికి చెందిన గుడివాడ శ్రీలక్ష్మి గోపాల్ దంపతుల ప్రథమ పుత్రిక శ్రీలేఖకు చింతలపూడి గ్రామానికి చెందిన జల్లిపల్లి రోజా విశ్వేశ్వరరావు దంపతులకు కుమారుడు సాయి కు గత ఏడాది ఆగస్టు నెలలో వివాహం జరిగింది.సంక్రాంతి పండుగ సందర్భంగా అత్తవారింటికి వచ్చిన కొత్త అల్లుడికి 207 రకాల పిండి వంటలు ఆహార పదార్థాలను సిద్ధం చేశారు.వాటన్నింటినీ ఒక క్రమ పద్ధతిలో అమర్చి అల్లుడి ముందు పెట్టారు. వాటి అన్ని రుచులు చూడాలని కోరారు.ఈ సందర్భంలో మరదళ్ళు,బావమరుదులు బావను ఆట పట్టిస్తూ ఈ 27 రకాల వంటకాలు పూర్తిగా తినాలని పట్టు పట్టడం విశేషం.

## అంబరాన్ని తాకిన సంక్రాంతి ముగింపు సంబరాలు






**గోపాలపురం,పెన్ పవర్ జనవరి 16 :**హిందువులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆనంద ఉత్సాహాలతో జరుపుకునే పెద్ద పండుగ సంక్రాంతి.మూడు రోజులపాటు జరిగే ఈ పండుగను పురస్కరించుకుని మండలంలోని వెల్లచింతలగూడెం గ్రామంలో సంక్రాంతి సంబరాల కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు.ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఘంటా మధు కృష్ణ,స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సహకారంతో గ్రామస్తుల ఆధ్వర్యంలో గత ఎనిమిదేళ్లగా ఈ సంబరాలు నిర్వహిస్తూనే ఉన్నారు.సంక్రాంతికి పక్షం రోజుల ముందు నుండే గ్రామంలో పండుగ వాతావరణం కొట్టొచ్చినట్టు కనిపిస్తూ ఉంటుంది.జాతీయ రాష్ట్రస్థాయి కబ్బడి,క్రికెట్, వాలీబాల్ పోటీలు నియోజకవర్గస్థాయి ముగ్గుల పోటీలు చూపర్లను కనువిందు చేస్తాయి.పోటీల అనంతరం విజేతలకు ఎమ్మెల్యే వెంకట్రాజు చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు.అనంతరం బుధవారం రాత్రి ముగింపు కార్యక్రమం నిర్వహించారు.ఈ వేడుకకు హాజరైన రాష్ట్ర మంత్రి కందుల దొరికేష్ మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతంలో ఇటువంటి మహోన్నతమైన కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు.ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే వెంకట్రాజు,ఘంటా మధుకృష్ణ లను కొనియాడారు.సంక్రాంతి పండుగను పురస్కరించుకుని యువత వ్యసనాలకు లోనుకాకుండా గ్రామాల్లోని సంప్రదాయబద్ధమైన క్రీడా పోటీలపై దృష్టి సారించే విధంగా ఈ పోటీల నిర్వహించడం అభినందనీయమన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి సంక్రాంతి పండుగ విషయాన్ని తీసుకువెళ్లి రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఇటువంటి ఉత్సవాలు జరిగే విధంగా చూడాలని కోరుతానన్నారు.అనంతరం కార్యక్రమానికి హాజరైన పోలవరం,తాడేపల్లిగూడెం,రాజమండ్రి,అర్బన్,రాజనగరం,ఉంగ ుటూరు,ఏలూరు శాసనసభ్యులు సిర్రి బాలరాజు,బొలిశెట్టి



శ్రీనివాస్,ఆదిరెడ్డి వాసు,,బత్తుల బలరామకృష్ణ,ధర్మరాజు, బడేటి రాధాకృష్ణ,మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు తదితరులు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణాలను మించి పోయే విధంగా మారుమూల పల్లెలో ఇటువంటి భారీ స్థాయిలో వేడుకలు నిర్వహించిన మధు కృష్ణ వెంకట్రాజు లను కొనియాడారు.ముందు ముందు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.అనంతరం ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ నేను నాయకున్ని కాదని ప్రజాసేవకుడిని అన్నారు.తనకు అత్యధిక మెజారిటీ ఇచ్చి గెలిపించిన ప్రజానీకానికి నమస్కారాలని ఎప్పుడూ రుణపడి ఉంటానన్నారు.తాను ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.నియోజకవర్గంలో అన్ని మతాలను గౌరవిస్తూ అందరి సంతోషాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని రకాల పండుగలను నిర్వహిస్తానన్నారు.గతంలో దేవరపల్లిలో జరిగిన క్రిస్టమస్ వేడుకలను ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఇకనుండి తరచూ మంచి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల వెంటే ఉంటానని ఎమ్మెల్యే అన్నారు.అనంతరం జరిగిన వినోద కార్యక్రమం చూపర్లను ఉర్రూతలూగించింది.యాంకర్ వింధ్య కార్యక్రమాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు.మిమిక్రీ కళాకారులు శివ రెడ్డి పలువురిని అనుకరిస్తూ మాట్లాడిన మాటలు పాటలు,డాన్సులు ఎంతో అలరించాయి. నాయకులు సినీ గాయకులు కల్పన,కృష్ణ చైతన్య,వాగ్దేవి,సాకేత్,జానపద కళాకారులు కాసర్ల శ్యాం,మోహన భోగరాజు తమ పాటలతో ప్రేక్షకులను మైమరిపించారు.అలాగే జబర్దస్త్ కళాకారులు అదిరే అభి,రాజమౌళి,గడ్డం నవీన్,తన్మయిలు తమ హాస్య చతురతను ప్రదర్శించారు.గణేషన్ రోబో డ్యాన్స్ వేశారు.గోవింద్ బృందం రకరకాల పాటలకు నృత్యం చేశారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## గోపాలపురంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**గోపాలపురం,పెన్ పవర్ జనవరి 16:**గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు.ఆ పాఠశాలలో 2002-2003 సంవత్సరంలో విద్యను అభ్యసించిన విద్యార్థులు అంతా కలిసి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమానికి సుమారు వందమంది వరకు హాజరయ్యారు.ఒకరినొకరు ఆప్యాయతగా పలకరించుకొని చలోక్తులు విసురుకున్నారు.అనంతరం ఆటపాటలతో అంతా ఆనందంగా గడిపారు.ఆనాడు ఈ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన ప్రధాన ఉపాధ్యాయులు గోపాలరావు, ఉపాధ్యాయులు రవీంద్ర, లివింగ్ స్టన్,గౌరీ శంకర్, రామచంద్ర రావు,వీర్రాజు, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ,శ్రీనివాసరావు,పార్థసారథి,నాగరాజు, చౌదరి,ప్రశాంతి,సత్యవతి,సుశీల తదితరులు మాట్లాడారు.తమ వద్ద విద్యను అభ్యసించిన విద్యార్థులంతా అభివృద్ధి చెంది నేడు ఎంతో ఉన్నతమైన స్థితిలో ఉండడం ఆనందాన్ని కలిగిస్తుందన్నారు.ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇక.. పురుషులకు డ్వాక్రా సంఘాలు

- ఏర్పాటుకు అర్హుల ఎంపిక
- ప్రారంభిస్తున్న మెప్మా అధికారులు

**ఏలూరు జనవరి 16 పెన్ పవర్ :** ఇప్పటి వరకు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి కృషి చేస్తోంది. ఈ సంఘాల ద్వారా ఎందరో మహిళలు స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండటంతో పాటు సమాజానికి అవసరమైన అనేక రకాల వస్తువులు తయారుచేసి నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారు. కూటమి ప్రభుత్వం పురుషులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు, స్వయం ఉపాధి పొందేందుకు గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేయనుంది. ఇందుకు ఇప్పటికే ఆయా రంగాల్లో పనిచేస్తున్న వారిని గ్రూపులుగా చేసేందుకు ఆర్పీలు ఇంటింటికి వెళ్లి అర్హులను ఎంపిక చేయనున్నారు.

### అన్ని రంగాల వారు అర్హులే

గ్రూపుల్లో సభ్యులుగా చేరెందుకు అన్ని రంగాల వారు అర్హులేనని అధికారులు చెబుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, దివ్యాంగులు, జిగ్ వర్కర్స్ (జోమోటా, స్విగ్గి వంటి వాటిల్లో పనిచేసేవారు), రవాణా కార్మికులు, (రిక్షా, బల్లల బండ్లు), లతో పాటు, కేర్ టేకర్, ఏసి, వాషింగ్ మిషన్, ఫ్రిడ్జ్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, కార్పెంటర్లు, బ్యూటీషియన్స్ (సర్వీస్ ప్రొవైడర్లుగా) గుర్తించి వారి ని సంఘాలుగా ఏర్పాటు చేస్తారు. వారు చేసే వృత్తిలో నైపుణ్యం పెంచేందుకు కావలసిన సహాయ సహకారాలు అందిస్తారు. ఏసీ, వాషింగ్ మిషన్, ఫ్రిడ్జ్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, కార్పెంటర్లు, బ్యూటీషియన్స్ (సర్వీస్ ప్రొవైడర్లుగా గుర్తించి) వారికి శిక్షణ ఇప్పించి, రుణాలు మంజూరు చేసి ఉపాధి కల్పిస్తారు. ఇందుకు ఆర్పీలు అర్హులను గుర్తించి సంఘాలు ఏర్పాటు చేసి వారికి రుణాలు మంజూరు చేస్తారని అధికారులు చెబుతున్నారు.

### పురుషులకు స్వయం ఉపాధి లక్ష్యం

పురుషులకు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి వారు స్వయం ఉపాధి పని ఎందుకు సహకారాలు అందించనున్నారు. ఒక్కొక్క గ్రూపునకు 5 నుంచి 10 మంది సభ్యులు ఉంటారు. వారికి తొలివిడతగా రూ. పదివేల రుణం మంజూరు చేస్తారు. అది సకాలంలో తిరిగి చెల్లిస్తే వచ్చే సంవత్సరం అదనంగా మంజూరు చేస్తారు. గ్రూపులుగా ఏర్పాటై స్వయం ఉపాధి పొందాలనుకునే వారు జిల్లాలోని మెప్మా సిబ్బందిని గ్రూపులు ఏర్పాటు చేసుకోవాలి

## గ్రామ దేవత మారెమ్మ అమ్మవారి జాతర మహోత్సవం





**ఆత్రేయపురం పెన్ పవర్ జనవరి 16**
డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామంలో వేంచేసియున్న మారెమ్మ గ్రామ దేవత అమ్మవారు బుధవారం రాత్రి జాతర మహోత్సవము ఘనంగా జరిగింది. అమ్మవారి జాతర మహోత్సవంలో వివిధ సంస్కృతి కళాకారులతో గరగ నృత్యాలు డప్పు వాయిద్యాలు బుట్ట బొమ్మలు,గుర్ర గేదులు గ్రామ ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి అమ్మవారి జాతరలో ఎటువంటి ఇబ్బందులు జరగకుండా గ్రామ కమిటీ సభ్యులు ఎంతో చక్కగా నిర్వహించారు. అలాగే ఉదయం పుట్టింటి నుండి గ్రామదేవతను ఆడపడుచులు చలివిడి పానకాలు చీర సారీలు పసుపు కుంకాలు తో అమ్మవారిని అత్తవారింటికి సాగనంపారు ఈ వేడుకను వీక్షించడానికి అధిక సంఖ్యలో భక్తులు గ్రామస్తులు ఆడపడుచులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని అత్తవారింటికి సాగనంపారు. ఆత్రేయపురం కనక మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలు కూడా అత్యంత వైభవం గా జరిగింది. అమ్మవారి జాతరలో భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కార్య దర్శనం కరువు.. డిజిటల్ అసిస్టెంట్లతో కానరాని సేవలు




**సీతానగరం, పెన్ పవర్, జనవరి:16:** సీతానగరంమండలంలో పల్లె పాలనలో ప్రధాన భూమిక పోషించే పంచాయతీ కార్యదర్శులు కొరత వేధిస్తోంది. ఒకే కార్యదర్శి నాలుగైదు పంచాయతీల కుబాధ్యతలు అప్పగించడంతో సక్రమంగా సేవలు అందించడం లేదు, పర్యవేక్షణ కరువై గ్రామాల పాలన కుంటుపడుతుంది అదనపు బాధ్యతలు కారణంగా కార్యదర్శులు ఏరోజు ఏగ్రామంలో ఉంటారో తెలియడం లేదు.గ్రామల్లో త్రాగునీటి క్లోరినేషన్ పారిశుధ్యం వీధి దీపాలు మురుకు కాలువల నిర్వహణ తదితర సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత గ్రామ కార్యదర్శులదే ఒక్కో గ్రామ కార్యదర్శికి రెండు నుంచి నాలుగు పంచాయతీలు అప్పగించడంతో సమస్యలు సకాలంలో పరిష్కారానికి నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, మండలంలో 21ఒక్క గ్రామ పంచాయతీలు ఉండగా కొన్ని పంచాయతీలకు మాత్రమే కార్యదర్శులే ఉండడంతో ఉన్న గ్రామ పంచాయతీలకు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ల పాలనతో సాగిస్తూ ప్రజలకు ఇక్కట్లు పడాల్సినా పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు, కూటమి ప్రభుత్వం జిల్లా కలెక్టర్ స్పందించి గ్రామపంచాయితీలకు కార్యదర్శులను నియమించాలని గ్రామ సర్పంచ్ లు మండల ప్రజలు కోరుతున్నారు,

## చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయి



**కూనవరం,పెన్ పవర్,జనవరి 16.**మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003-04 పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 20 సం తర్వాత మధుర జ్ఞాపకాలను మననం చేసుకున్నారు.జీవిత కాలచక్రంలో కుటుంబ పోషణ కోసం బిజీ జీవితాన్ని పలు ప్రాంతాలలో ఉద్యోగాలు, వ్యాపారంలో స్థిరపడిన చిన్ననాటి మిత్రుల కలయిక 20 సంవత్సరాల తర్వాత కల నెరవేరిందని ఆనందించారు. చిన్ననాటి మిత్రులు విద్యను అభ్యసించిన హైస్కూల్లో చిన్ననాటి జ్ఞాపక స్మృతులను గుర్తు తెచ్చుకొని ఆనందంగా గడిపారు.అనంతరం మిత్రులందరు కలిసి వర రామచంద్రపురం మండలం దారపల్లి ప్రాంతంలో వన భోజనాలను ఏర్పాటు చేసుకొని ఆనందోత్సవాలతో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మచ్చ వినయ్ ప్రసాద్,నాచుపల్లి వెంకన్న,యలం గౌతం,సూరం వెంకట్,కొండ పద్దయ్య,పదముత్యం వెంకటేష్,చీమల కృష్ణార్జునరావు,బొగ్గ రామారావు,కొండా శ్రీను, కాలేపు ఉమా మహేశ్వరి, స్వాతి,అపర్ణ,సౌందర్య,లలిత తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్ పై అవగాహన కార్యక్రమం



**కాకినాడ.పెన్ పవర్ జనవరి 16 :**జనవరి 1వ తేదీ నుంచి 31 వ తేదీ వరకు 'జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల లో భాగముగా గురువారం ఉదయం 10 30 గంటలకు కాకినాడ ట్రాఫిక్ 1%ఌ%2 సిఐ లు ఎన్. రమేష్, డి. రామారావు, ట్రాఫిక్ ఎస్సై పి. కిషోర్ కుమార్ లు కాకినాడ లో (ఇంద్రపాలెం, జడ్పీ సెంటర్,జిజిహెచ్ బాలాజీ చెరువు) వద్ద నున్న ప్రయాణికులకు, ఆటో యూనియన్ సభ్యులకు, (ఆటో డ్రైవర్ లకు/యాజమానులకు) జిల్లా పరిషత్ సెంటర్ నందు ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది.

అధిక వేగంతో రోడ్డుపై వాహనాలను నడపడంవల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి, ప్రాణ నష్టం జరుగుతుందని ,రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి ట్రాఫిక్ రూల్స్ ను తప్పని సరిగా పాటించి ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని,అతివేగం అనర్థదాయకమని, మద్యం తాగి వాహనం నడపవద్దని, సెల్ ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని తెలిపారు.112/100, 1930, 1974 కాల్స్ యొక్క ఉపయోగములు గురించి అవగాహన కలిగించారు.

ఈ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా కాకినాడ పట్టణం లో ప్రతి ఒక్కరికి ట్రాఫిక్ రూల్స్ పై పూర్తిస్థాయి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు.

## ఆర్టీసీ భద్రతా మాసోత్సవాలు ప్రారంభం



**కాకినాడ.పెన్ పవర్ జనవరి16:** రాష్ట్రవ్యాప్తంగా ఏపీఎస్ఆర్టీసీ సంస్థలో జరుగుతున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమం గురువారం కాకినాడ డిపోలో జరిగింది. కాకినాడ డిపో మేనేజర్ ఎంయువి మనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం హరినాథ్ రెడ్డి హాజరయ్యారు. డిపో మేనేజర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు డ్రైవర్లు బస్సులు నడుపుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదములను అరికట్టుటకు కావలసిన నైపుణ్యములను వివరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ డిపో అసిస్టెంట్ మేనేజర్ టి బాలకృష్ణ, పీఆర్వో సిహెచ్ వెంకటరాజు అధిక సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు. నెలరోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా జరుగు కార్యక్రమం షెడ్యూల్ను కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం శ్రీనివాసరావు విడుదల చేశారు. జనవరి- 16 ప్రారంభ వేడుక జనవరి 17-21 బస్సులు కండిషన్ మెరుగుపరుచుట జనవరి 22 -23 ప్రమాద రహిత డ్రైవర్లకు సేఫ్టీ అలవెన్స్ ఇచ్చుట జనవరి- 24 డ్రైవర్స్ డేగా జరుపుకొనుట

జనవరి 25-28 రోడ్డు భద్రతపై డ్రైవర్లకు శిక్షణ ఇచ్చుట

జనవరి -29 నుండి ఫిబ్రవరి -4 వరకు డ్రైవర్లకు వైద్య పరీక్షలు

ఫిబ్రవరి 5-6 ప్రమాదములు చేసిన డ్రైవర్లకు కుటుంబంతోపాటు కౌన్సిలింగ్ ఫిబ్రవరి 7 - 10 రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కలిగించుట ఫిబ్రవరి 11 -12 బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఫిబ్రవరి 13 -14 రోడ్ సేఫ్టీపై ఆడిట్

ఫిబ్రవరి -15 ముగింపు వేడుక, ఉత్తమ డ్రైవర్లకు బహుమతి ప్రధాన ఉత్సవాలు నిర్వహించనున్నారు.

# అంగరంగ వైభవంగా ముగిసిన సంక్రాంతి సంబరాలు





ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు

**గంగవరం, పెన్ పవర్, జనవరి 16:**గంగవరం గ్రామంలో సంక్రాంతి సంబరాలు లో భాగంగా ముగ్గుల పోటీలు, కబడ్డీ , చైర్ గేమ్ విజేతలకు గురువారం బహుమతి ప్రధానం జరిగింది. గ్రామస్తులందరూ కలిసి సంక్రాంతి పండుగ లో భాగంగా పిల్లలు పెద్దలు యువత భక్తి శ్రద్ధలతో చాలా చక్కగా పెద్ద పండుగను నిర్వహించుకున్నారు. ఆటలు పాటలతో గ్రామంలో పండగ సందడి ముగిసింది. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించడం జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగాదేవి, మాజీ ఎంపీటీసీ కొమ్మన చిన్నారావు, టిడిపి నాయకురాలు సారపు సత్యవేణి విశ్వహిందూ పరిషత్ ప్రముఖ వై ఆర్ కె ప్రసాద్ ,మహేంద్ర ,మిరియాల సాయి ,లోకేష్, పవన్ గిరిజన మిత్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఉదయ్ శ్రీనివాస్ పలువురు యువత మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీల విజేతలు





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జనవరి 16:**

సంస్కృతి సాంప్రదాయాలకు సంక్రాంతి పండుగ ఆదర్శంగా ఉందని పలువురు వక్తలు అన్నారు. తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను లో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గ్రామంలోని పలువురు మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు. రకరకాలైన ముగ్గులు వేసి వాటికి రంగులు అద్దారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు గురికాకుండా మంచి మార్గంలో నడవాలని కోరారు. కోడిపందాలు గుండాట జూదం వంటి వాటిపై దృష్టి మరల్చకుండా సంప్రదాయాలకు అనుగుణంగా నడుచుకోవాలని హితవు పలికారు. గ్రామంలోని మహిళలు, యువత సంక్రాంతి సందర్భంగా ముగ్గులు పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి నాయకులు అభినందనలు తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి విజ్జు సీతామహాలక్ష్మి, రెండో బహుమతి తోట దేవి నాగ శశిరేఖ, మూడో బహుమతి, బోడపాటి ప్రవళిక గెలుచుకున్నారు. వీరికి గ్రామ సర్పంచ్ పీతల బుచ్చిబాబు, ఉప్పలపాటి వెంకట సత్యనారాయణ, ఎస్ వి ఎస్ రెడీమేడ్ శ్రీను బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సభ్యులు కాసగాని రాజేష్, షేక్ హసీన్, షేక్ సమీర్, చిటికెన సూరిబాబు, వీరమల్లు వెంకట సత్యనారాయణ, కాసాని బాపిరాజు, మహిళలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి- జగ్గంపేట సీఐ



**జగ్గంపేట(గండేపల్లి), పెన్ పవర్, జనవరి 16:** గండేపల్లి మండలం బొర్రంపాలెం గ్రామంలో గురువారం జగ్గంపేట సీఐ వై.ఆర్.కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల నివారణ, డ్రగ్స్ వద్దు బ్రో, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళా రక్షక్ పై అవగాహన కల్పించారు. యువత మత్తుకు దూరంగా ఉండాలన్నారు. రోడ్లపై వెళ్లేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మహిళలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొన్న తమకు తెలియజేయాలని మహిళా పోలీసులు అండగా ఉంటారన్నారు. అలాగే ఇటీవల సైబర్ నేరాలు అధికమయ్యాయని వాటిని అవగాహనతో నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు, సిబ్బంది, గ్రామ పెద్దలు ఉన్నారు.

# నేటి నుంచి జాతీయ స్థాయి చెస్ పోటీలు





**పెద్దాపురం, పెన్ పవర్, జనవరి 16 :** పదమూడవ నేషనల్ స్కూల్స్ చెస్ ఛాంపియన్షిప్ పోటీలు ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు పెద్దాపురం శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో జరగనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. షణ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, రెవెన్యూ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, పోలీస్ అధికారులతో కలిసి ఏర్పాట్లును పరిశీలించారు. అలాగే వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులకు కల్పించనున్న భోజన వసతి, మరుగుదొడ్లు, ప్రాక్టీస్ గదులు తదితర వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదు రోజులు పాటు జరగనున్న ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలకు చెందిన 1,239 మంది విద్యార్థులు, తదితరులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి శ్రీనివాస కుమార్, చెస్ ఛాంపియన్ షిప్ చైర్మన్, శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాల డైరెక్టర్ సిహెచ్ విజయ్ ప్రకాష్, చెన్నై చీఫ్ ఆర్బిటర్ పాల్ ఆరోగ్యరాజ్, పెద్దాపురం చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.వి.వి.శర్మ, కార్యదర్శి సురేష్, ఎస్ఐ వి. మౌనిక, పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలి

-మంత్రి సుభాష్ పిలుపు

**కాజులూరు,పెన్‌పవర్,జనవరి16:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా ఈనెల 18న రామచంద్రపురం రత్నంపేటలోని లయన్స్ కళ్యాణ మండపంలో రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు మంత్రి గురువారం మీడియాకు వివరించారు.రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.రక్తదానం చేసి మీరంతా ప్రాణదాతలు కావాలని మంత్రి పేర్కొన్నారు. రక్త దాన శిబిరంలో రక్తదానం చేసేందుకు ముందుకువచ్చిన ప్రతి ఒక్కరూ ఉదయం 9 గంటలకు రక్తదాన శిబిరానికి చేరుకోవాలని సూచించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉత్సాహవంతులైన యువకులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేసి, ప్రాణదాతలుగా నిలవాలని ఆయన సూచించారు.

# శాంతి భద్రతల పటిష్టతకు సహకరిస్తాం.





చింతపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ.

**చింతపల్లి పెన్ పవర్ జనవరి 16:-** చింతపల్లి సబ్ డివిజన్ ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నవజ్యోతి మిశ్రా ఈరోజు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా

శాంతి భద్రతలను పటిష్టంగా అమలు పరచేందుకు పాత్రికేయులుగా పోలీసు శాఖకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చింతపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేశెట్టి సత్యనారాయణ (సతీష్) అన్నారు. స్థానిక ఏ ఎస్ పి గా గురువారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన నవజ్యోతి మిశ్రా ను తోటి పాత్రికేయులతో కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి దుస్సాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు కొరుప్రోలు కృష్ణ, చల్లా రాజు, షేక్ సత్తార్, గుంటుపల్లి రమేష్ చౌదరి, ఉప్పల బంగారయ్య శెట్టి (రమేష్), జుంబు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## అంగరంగ వైభవంగా పోలేరమ్మ వారి తీర్థ మహోత్సవం.





**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 16:**ముక్కనుమ సందర్భంగా పెదపళ్ళ పోలేరమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం గురువారం కోలాహలంగా జరిగింది. సంక్రాంతికి మండలంలో ప్రభ తీర్థం జరిగే ఒకే ఒక్క తీర్థంగా పెదపళ్ళ పోలేరమ్మ తీర్థం ప్రసిద్ధి చెందింది. ఈ సందర్భంగా నూతన జాతర కమిటీ ఆధ్వర్యంలో శ్రీ పార్వతీ రామలింగేశ్వర స్వామి వారి ప్రభను కేరళ చందే డప్పు వాయిద్యాల మధ్య కోలాహలంగా గ్రామోత్సవం నిర్వహించి పోలేరమ్మ తీర్థ మహోత్సవం జరిగే చోటుకు తీసుకుని వచ్చారు. భక్తులు పోలేరమ్మకు, గని పోతురాజుకు, శ్రీ పార్వతీ రామలింగేశ్వర స్వామి వారి ప్రభకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేరళ చందే వాయిద్యకారుల లయబద్ధమైన సంగీత, నృత్యాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి.

# మానవత్వం... చాటుకుంటున్న...” దుమంతి “

**అనాధ పిల్లలకు సాయం అందించిన రెవెన్యూ ఉద్యోగి**



**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 16:** సమాజంలో నిత్యం ఏదో సేవా కార్యక్రమం చేస్తూ అనాధలను తనవంతుగా ఆదుకుంటూ ‘మాకు మహారాజు’ లా మారారంటూ కొయ్యూరు రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణను ఉద్దేశించి స్థానికులు కొనియాడుతున్నారు. మండలంలోని మంప పంచాయతీ, తుమ్మల బంధ గ్రామానికి చెందిన తల్లి సెగ్గే రత్నం 8 సంవత్సరాల క్రితం చనిపోగా, తండ్రి సెగ్గే మల్లేష్ రెండు నెలల క్రితం మృతి చెందగా వారి పిల్లలు సెగ్గే శివగంగ, బేబీ దుర్గ, విష్ణు అనాధలుగా మారారు. వీరు వృద్ధురాలైన తమ నానమ్మ సెగ్గే అక్కమ్మ వద్ద తలదాచుకుంటున్నారు. ఆ వృద్ధురాలు పెన్షన్ సొమ్ము తోనే పిల్లల బాగోగులు చూసుకుంటుంది. ఈ సంక్రాంతి పండుగకు ఈ అనాధ పిల్లలు కనీసం కట్టుబట్టలకు నోచుకోని దయనీయ స్థితిలో ఉండడాన్ని గమనించిన రెవిన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ వారికి బట్టలు,రూ. 2వేల నగదు సాయంగా అందించి, పిల్లల చదువులలో తన వంతు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇంగువ త్రినాధ్ మూర్తి పడాల్, దుమంతి రామకృష్ణ, వీరబాబు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు వితంతువులకు వస్త్రాలు పంపిణీ చేసిన ఉపాధ్యాయుడు





**స్టాప్ రిపోర్టర్, గూడెం కొత్తవీధి,చింతపల్లి,పెన్ పవర్ జనవరి 16:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం ఎర్నాపల్లి గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఉపాధ్యాయుడు పాడి కృష్ణ సుమారు 50 మంది వృద్ధులు, వితంతువులకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు పాడి కృష్ణ గత కొంతకాలంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగానే సంక్రాంతి పండగను పురస్కరించుకొని వస్త్రాలు పంపిణీ చేయడం జరిగిందని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తెలిపారు.

## కుటుంబ పెద్దలను సన్మానించిన లొంజా బ్రదర్స్





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి16:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం వంచుల పంచాయతీ కేంద్రంలో గల వంచులలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామంలో గల లొంజా కుటుంబ సభ్యులు వారి కుటుంబ పెద్దలను ఘనంగా సన్మానించుకున్నారు. వృత్తిరీత్యా వివిధ ప్రాంతాలలో స్థిరపడిన వారు సంక్రాంతి పండుగకు స్వగ్రామానికి వచ్చి లొంజా కుటుంబానికి పెద్దలైన లొంజా చిలకమ్మా,లొంజా బాలమ్మ మరియు లొంజా జనార్ధన్ రావులను ఘనంగా సన్మానించారు.

## హిందూసంఘాలు, క్రైస్తవులు మధ్య విభేదాలు





**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి16:** పండగ వేళ మండలంలోని మారుమూల బూదరాళ్ల పంచాయతీ, నూకరాయితోట గ్రామంలో అనూహ్య సంఘటన ఎదురయింది. హిందువులు, క్రైస్తవులు మధ్య విభేదాలు చోటుచేసుకుని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకునే పరిణామం సంభవించింది. గ్రామానికి చెందిన కొంతమంది హిందువులు సంక్రాంతి కనుమ పండగ సందర్భంగా సాంప్రదాయంగా బిందెలు అలంకరించి బియ్యం పప్పు బెల్లాలు సేకరిస్తుండగా, కొంతమంది క్రైస్తవులు అడ్డగించి, ఆ బిందెలను లాక్కుని ధ్వంసం చేసినట్టు గట్టి ప్రచారం సాగడంతో, మండలంలోని పలు హిందూ సంఘాలు హుటాహుటిన గ్రామానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. అంతేకాక ఈ దుశ్చర్యకు పాల్పడిన అన్యమతస్తులను శిక్షించాలని కోరుతూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్టు హిందూ సంఘాల ప్రతినిధులు తెలిపారు. అలాగే ఆ అన్యమతస్తులు భేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హిందూ సంఘాల ప్రతినిధులు ఈరే మల్లిబాబు, సడ్డ వెంకటేశ్వర్లు, కాకూరి వీర్రాజు, బండారు సోమరాజు, పొత్తూరు దేముడు, దుచ్చరి కృష్ణ తదితరులు డిమాండ్ చేశారు.

## చౌక దుకాణ దారుల (డీలర్) రాత పరీక్ష.



**పరీక్ష తేది-19.01.2025 ఆదివారం.**

**సమయం:- ఉ-10.30 నుండి 12.00 గంటల వరకు.**

**పాడేరు,పెన్ పవర్ జనవరి16.** అల్లూరి జిల్లా పాడేరు.అందరు అభ్యర్థులు తేది 19.01.2025 ఉదయం 9.00 గంటలకు హాజరు అవ్వాలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల,పాడేరు.పాతభవనము 1.అనంతగిరి 2.అరకువేలి 3.దుంబ్రిగుడ 4.పెదబయలు 5.పాడేరు 6.జి.మాడుగుల 7.చింతపల్లి 8.జి.కే వీధి మండల అభ్యర్థులు మీ తహసీల్దార్ కార్యాలయములో మీ యొక్క హాల్ టికెట్ లు మీ తహసీల్దార్ కార్యాలమునకు పంపించటం జరిగింది అభ్యర్థులందరు మీ యొక్క హాల్ టికెట్స్ ను తీసుకొనవలసినదిగా ఆయన అన్నారు పై తెలిపిన తహసీల్దార్ కార్యాలయపు సిబ్బంది మీ మండలానికి చెందిన అభ్యర్థులందిరికి తేది 17.01.2025 మరియు 18.01.2025 తేది లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి హాల్ టికెట్ జారీ చేయవలసినదిగా ఆదేశించడమైనది.

## జంప్డ్ డిపాజిట్ స్కామ్'తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్**
- **ఈ తరహా స్కాంలో డబ్బులు వచ్చినట్లుగా నోటిఫికేషన్ మెసేజ్ వస్తాయని,**
- **యూ.పీ.ఐ.ఓపెన్ చేసి, పిన్ నంబరును క్లిక్ చేస్తే అకౌంట్లో ఖాళీ అవుతాయన్న**
- **సైబరు నేరగాళ్ళ పట్ల ప్రజలందరూ అప్రమత్తం గా ఉండాలని పిలుపునిచ్చిన**

**విజయనగరం క్రైమ్ బ్యూరో, పెన్ పవర్ జనవరి 17 :** సైబరు నేరగాళ్ళు టెక్నాలజీని వినియోగించి, కొత్త తరహా స్కాములకు పాల్పడుతున్నారని, అటువంటి నేరగాళ్ళ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జనవరి 15న పిలుపునిచ్చారు.ఇటీవల కాలం లో ‘జంప్డ్ డిపాజిట్ స్కామ్’ పేరుతో కొత్త తరహా మోసం వెలుగులోకి వచ్చిందన్నారు. ఈస్కాము తో ప్రజలు తమ బ్యాంకు ఖాతాల్లోని నగదు ను కోల్పోయే అవకాశం ఉందన్నారు. సైబరు నేరగా ళ్ళ జంప్ట్ డిపాజిట్ స్కామ్ తో యూ.పి.ఐ. విని యోగదారులను లక్ష్యంగా చేసుకున్నారన్నారు. బాధితులను ఆకర్షించేందుకు,నేరగాళ్ళు బ్యాం కు ఖాతాల్లో రూ.5000/- లేదా అంతకంటే త క్కువ మొత్తాన్ని జమ చేస్తారని, ఖాతాలో డ బ్బు జమ,అయినట్లుగా ఒక నోటిఫికేషను ఎస్. ఎం.ఎస్. రూపంలో పంపుతారన్నారు. ఆ సమ యంలో బాధితుడు బ్యాలెన్సు చెక్ చేయడానికి యూపిఐ ఓపెన్ చేసి, పిన్ నంబరు ఎంటర్ చేస్తే, నేరగాడికి యాక్సెస్ లభిస్తుందని, దీంతో ఖాతాల్లోని ఉన్న మొత్తం నగదు మాయమవు తుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

ఈ తరహా ‘జంప్డ్ డిపాజిట్ స్కామ్’ను ఎదు ర్కొనేందుకు పాటించాల్సిన జాగ్రత్తలుఃలి గుర్తు తెలియని నంబరు నుండి మీ ఖాతాలో చిన్న మొత్తం జమ అయితే.. వెంటనే బ్యాంకు బ్యా లన్సును చెక్ చేయవద్దు. 15 నిమషాలు నుండి 30 నిమషాలు వరకు వేచి చూడండి. ఆ తరు వాత స్కామర్ అభ్యర్థన గడువు ముగిసిపో తుంది.ఒకవేళ మీ ఖాతాలో డబ్బు జమ అయి న తరువాత.. బ్యాలన్స్ చెక్ చేసుకునే సమ యంలో ఉద్ధేశ్యపూర్వకంగానే తప్పు పిన్ ఎంట ర్ చేయండి. దీంతో స్కామర్ అభ్యర్ధన క్యాన్సిల్ అవుతుంది.బ్యాంకు బ్యాలన్సును సంబంధిం చిన యాప్ నోటిఫికేషన్స్ లేదా మెసేజస్ వస్తే.. మీరు నేరుగా బ్యాంకును సంప్రదించి, మీ అను మానాలను నివృత్తి చేసుకోవచ్చు.ఎప్పుడూ మీ యూపిఐ పిన్ నంబరు ఇతరులకు షేర్ చేయవ ద్ద లేదా చెప్పవద్దు. పిన్ నంబరు గోప్యంగానే ఉండాలి. జంప్డ్ డిపాజిట్ స్కామ్ కు సంబంధిం చిన కేసులు.ఇటీవల చాలా ఎక్కువ అవుతు న్నాయి. ఈ తరహా మోసాలకు గురైతే.. వెంటనే సైబరు క్రైం పోలీసు స్టేషనులో లేదా సైబరు క్రైం పోర్టల్ లేదా 1930కు ఫిర్యాదు చేయవచ్చు.

కావున, ప్రజలు ఈ తరహా సైబరు నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ పిలుపుని చ్చారు. ఎవరైనా సైబరు మోసానికి గురైతే.మొ దటి గంట (గోల్డెన్ అవర్) లోనే సైబరు క్రైం పోర్ట ల్ లేదా 1930కు ఫిర్యాదు చేయాలని ప్రజలను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ కోరారు.




# ఏ.యూ.లో అన్యక్రాంతమైన భూములు పరిరక్షించాలి



**ఏ.యూ. పెన్ పవర్, జనవరి 16. :** ఆంధ్ర యూనివర్సిటీలో అన్యాక్రాంతమవుతు న్న భూములను పరిరక్షించాలి ఆక్రమణకు గురి అవుతున్న భూములను కాపాడాలి.ఆంధ్రయూ ని వర్సిటీ ఎగ్జిబిషన్ గ్రౌండ్ తక్కువ అద్దెకు ఇ చ్చి యూనివర్సిటీ ఆదాయానికి గండి కొడుతు న్న రాజారెడ్డి పై చర్యలు తీసుకోవాలి.ఇంకా అనేక సమస్యల పై ఆంధ్ర యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య కిషోర్ బాబుకు వినతి పత్రం సమర్పిం చిన ఎస్సీ.ఎస్టీ.బీసీ మైనారిటీ ఆలుమ్ని వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ అధ్యక్షుడు ఆచార్య కోటి జాన్ మరియు కార్యదర్శి ఆరేటి మహేష్ బాబు, డాక్టర్ బి మోహన్ బాబు, డాక్టర్ శిరీష్ కుమార్, డాక్టర్ బి సురేంద్ర బాబు తదితరులు పాల్గొన్నా రు.


## ఫిబ్రవరి 6 నుంచి ఏ.ఐ.వై.ఎఫ్ రాష్ట్ర మహాసభ లు .



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జనవరి 16 :** శ్రీకాకుళం లో ఫిబ్రవరి 6 నుంచి నాలుగు రోజు ల పాటు అఖిల భారత యువజన సమాఖ్య ( ఏ. ఐ వై ఎఫ్ ) 22 వ రాష్ట్ర మహాసభలు జరుగ నున్నా యని ఏ. ఐ టి యూ సి జాతీయ ఉపాధ్యక్షులు డి. ఆదినారాయణ తెలిపారు గురువారం కూర్మ న్న పాలెం ఉక్కు దీక్షా శిబిరం వద్ద ఏ. ఐ వై ఎఫ్ రాష్ట్ర మహాసభల గోడ పత్రిక ల ను ఆదినారాయణ ఆవిష్కరించారు,అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా, ఉపాధి ఉ ద్యోగ, అవకాశాలా సాధన కోసం ఏ. ఐ వై ఎఫ్ దేశ వ్యాప్తంగా పోరు సాగిస్తున్న దన్నారు .నిరు ద్యోగ సమస్య పై యువత ఉద్యమించాలని పి లుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అఖిల భార త యువజన సమాఖ్య జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు కెంగువ అచ్యుత రావు,వై. రాం బాబు , సి.పి.ఐ. నాయకులు జి. ఆనంద్, కిరణ్,లక్ష్మి ,రజనీ, ఉమ, పాల్గొన్నారు.

## కుమార్ రాజు కు ప్రతిష్టాత్మక “తెలుగు కీర్తి “పురస్కారం






**శ్రీకాకుళం, పెన్ పవర్, జనవరి 16. :** శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి, శ్రీ శ్రీ కళా వేదిక అధ్యక్షుడు, కవి రచయిత బుర్రి కుమార్ రాజు తెలుగు కీర్తి పురస్కారం కు ఎంపికైనట్లు శ్రీ శ్రీ కళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కత్తి మండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి ల నుంచి సమాచారం అందుకున్న కవి కుమార్ రా జు తనను ఈ ప్రతిష్టాత్మక పురస్కారంకు ఎంపి క చేసినందులకు అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తి మండ ప్రతాప్ కి జాతీయ కన్వీనర్ కొల్లి రమా వతి జాతీయ అధ్యక్షులు ఈశ్వరీ భూషణం,పా ర్థ సారధి ర్లకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియ చేసినారు . కుమార్ రాజు విద్యాభ్యా సం నాటినుంచి తన కవితలతో అలరించే వార ని, అలా ఎన్నో కవితలు పత్రికలలో ప్రచురించ టంతో తెలుగు సాహిత్యం పై ఆసక్తి పెరిగిందని తెలియ పరిచారు. ఈ పురస్కారం జనవరి 21 మంగళవారం 2025 న కౌతా పూర్ణానంద వి లాస్ కళావేదిక , విజయవాడ లో జరుగుతుం ది అని తెలిపారు

## కణితి లో ఘనంగా రామాలయం పరస



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జనవరి 16.** జీ.వీ.ఎం.సీ 87 వార్డు పరిధిలో గల కణితి కళింగ వీధి గా గాంధీ బొమ్మ దగ్గర “పరస “ఘ నంగాన నిర్వహించారు ఈ కార్యక్రమానికి ము ఖ్యఅతిథి గా మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరమణ పాల్గొని సీతారాముల వారికి ప్రత్యేక పూజ లు నిర్వహించారు అనంతరం భజనలు తప్పుడు గుళ్ళు,గరిడీలు సంస్కృత కార్యక్రమాలు తిలకించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ప్రగడ వేణుబాబు, దుగ్గపు దాన ప్పలు, ప్రగడ శంకర్రావు బొడ్డ సన్యాసిరావు, ప్ర గడ శ్రీను, గోన ప సన్యాసినాయుడు,బోండా గోవిందరా జులు, ఎస్ఎస్ విజయరామరాజు, కె.వి.నారా యణ పూడి శ్రీనివాస్,గున్న రామా రావు, ప్రగడ రా ము తదితరులు పాల్గొన్నారు.

# అరకు రిక్వెస్ట్ స్టేజీలో ప్యాసింజర్ రైళ్లు నిలుపుదల చెయ్యాలి.

ఎం పి.గుమ్మ తనూజారాణి



**అరకులోయ పెన్ పవర్ 16:**అరకులోయలో రైల్వే రిక్వెస్ట్ స్టేజీలో విశాఖ–కిరండూల్ ప్యాసింజర్ రైలు నిలుపుదలకు చర్యలు తీసుకుంటామని అరుకు ఎంపీ.గుమ్మ తనూజరాణి తెలిపారు. ఆమే మాట్లాడుతూ జనవరి ఈనెల ఒకటో తేదీ నుంచి రైల్వే రిక్వెస్ట్ స్టేజీలో ప్యాసింజర్ రైలు నిలపడం లేదని అరకులోయలోని ఆటో మోటార్ యూనియన్ ప్రతినిధులు తమ దృష్టికి తీసుకు వచ్చారన్నారని. దీనివల్ల వందలాది కుటుంబాలు వీధిన పడుతున్నందున సమస్యను విశాఖలో రైల్వే అడిషనల్ డిఆర్ఎం కి జనవరి 15న సీనియర్ డిసిఎం పవన్ కుమార్ ల దృష్టికి తీసుకెళ్ళమన్నారని. తమ సమక్షంలో ఆటో ఇతర కార్మికులతో వారు మాట్లాడారన్నారు. అరకు రైల్వే స్టేషన్ నుంచి శిమిలిగుడ రైల్వే స్టేషన్ వరకు రెండవ లైన్ వేయడం వల్ల అనేక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున అరకులోయలో రిక్వెస్ట్ స్టేజి తీసివేసినట్టు అధికారులు తెలిపి ఉన్నారన్నారని. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పాసింజర్ రైలు నిలుపుదలకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి. వినయ్, వైసిపి నాయకులు ప్రజాప్రతినిధులు మోటర్ యూనియన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి అసిస్టెంట్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ గా నవజ్యోతి మిశ్రా బాధ్యతలు స్వీకరణ







**చింతపల్లి పెన్ పవర్ జనవరి 16:-**
చింతపల్లి సబ్ డివిజన్ ఏఎస్పీగా నవ జ్యోతి మిశ్రా గురువారం బాధ్యతలు స్వీకరించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన నవజ్యోతి మిశ్రా 2021 బ్యాచ్ లో ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసుకుని గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్ గా విధులు నిర్వహించారు. ఇంతవరకు ఇక్కడ డిఎస్పీగా పనిచేసిన షేక్ షహబాజ్ అహ్మద్ సెలవు పై వెళ్ళారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పి నవజ్యోతి మిశ్రా మాట్లాడుతూ చింతపల్లి సబ్ డివిజన్ భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేస్తానన్నారు. అలాగే ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. శాంతిభద్రతల కల్పనకు కృషి చేస్తామన్నారు. అలాగే గంజాయి సాగు మరియు రవాణా వంటివి నిరోధించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటానని అన్నారు. పర్యాటక ప్రాంతం కావడంతో కొత్తగా వచ్చే వ్యక్తులపై దృష్టి పెడతామన్నారు. అనంతరం నూతన ఎస్పీకి పోలీసు సిబ్బంది , పాత్రికేయులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి గూడెం కొత్త వీధి కొయ్యూరు సిఐలు ఎం. వినోద్ బాబు, వరప్రసాద్, పీ.వీ. రమణ, ఎస్సైలు సూరిబాబు, వీరబాబు, కృష్ణ వర్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## డేటా ఎంట్రీని వేగవంతం చేయాలి.

**డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్.**



**చింతపల్లి పెన్ పవర్ జనవరి 16:-**
స్వర్ణ పంచాయితీ డేటా నమోదును వేగవంతం చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్ అన్నారు. గురువారం మండలంలోని లంబసింగి పంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఇంటి స్థలం విషయమై లోకాయుక్తలు ఫిర్యాదు మేరకు ఫిర్యాదుదారులు గ్రామ పెద్దల సమక్షంలో విచారణ జరిపారు. అనంతరం ఆయన సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. స్వర్ణ పంచాయితీ డేటా నమోదు చేయడం, ఎన్పీసీఐ బ్యాంకు లింకేజీ, హౌస్ హెూల్డ్ జియో టాకింగ్ చేయాలని సచివాలయం సిబ్బందికి సూచనలు జారీ చేశారు. అలాగే రాబోయే వేసవి దృష్టిలో పెంచుకొని త్రాగునీరుకు ఇబ్బందు లేకుండా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యుఎస్ వి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, ఎంపీటీసీ సభ్యులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 87వ వార్డ్ అన్న ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా వాలీబాల్ టార్నిమెంట్ ప్రారంభం





**ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం**

**గాజువాక :పెన్ పవర్, జనవరి 16:**తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, నట సార్వభౌమ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా 87 వార్డు పరిధిలో శ్రీశ్రీశ్రీ సీతారామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం లో వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, 87వ వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాథం పాల్గొని పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా ఎన్టీఆర్ వర్ధంతి ఘనంగా నిర్వహించే ఆలోచనలో భాగంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీలో పాల్గొనేవారు మంచి ప్రతిభను కనబరిచి విజయతులుగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు రాజన్ రాజు,బొడ్డా ప్రకాష్, జాన్ రమేష్, జల్లు సత్యనారాయణ,ఆదినారాయణ, దాలయ్య , ఏటీయస్ మూర్తి, పాల్, కోటేశ్వరరావు, అప్పలనాయుడు,గ్రామ పెద్దలు,క్రీడాకారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


# సజావుగా కానిస్టేబులు ఉద్యోగాల నియామక ప్రక్రియ





**విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్**

**విజయనగరం క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, జనవరి 16 :**స్టైఫెండరీ పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియా మకాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధిం చిన అభ్యర్థులకు,పి.ఎం.టి. మరియు పి.ఈ.టి. పరీక్షల ప్రక్రియ కొనసాగుతున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జనవరి 16న తెలిపారు.జనవరి 16న నిర్వహించిన 11వ రోజు పి.ఎం.టి. మరి య పి.ఈ.టి. పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా,415 అ భ్యర్థులు మాత్రమే పి.ఎం.టి./పి.ఈ.టి. పరీక్ష లకు హాజరయ్యారని, వారిలో 314మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు అర్హత సాధించా రన్నారు. నియామకాల ప్రక్రియ వేకువ జామున 5గంటల నుండే ప్రారంభం కావడం, ప్రణాళికాబ ద్ధంగా వ్యవహరించడంతో, పి.ఎం.టి. మరియు పి.ఈ.టి. పరీక్షలు సకాలంలో పూర్తయ్యాయ న్నారు. పోలీసు నియామకాల ప్రక్రియను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, అదనపు ఎస్పీ పి.సౌమ్య లత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు.అభ్యర్థులకు ముం దుగా హాల్ టిక్కెట్స్ను పరిశీలించి, పోలీసు పరేడ్ గ్రౌండులోకి అనుమతించారు. అనంతరం, అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేషన్లు, వయస్సు నిర్ధారించే ధృవపత్రాలను పరిశీలించి, అన్ని సర్టి ఫికేట్స్ సక్రమంగా ఉన్న అభ్యర్థులకు మాత్రమే బయోమెట్రిక్ తీసుకొని, పి.ఎం.టి. పరీక్షలకు అ నుమతించామన్నారు. ఆధునిక సాంకేతిక నైపు ణ్యం కలిగిన డిజిటల్ ఇక్విప్మెంట్స్ వినియోగిం చి, అభ్యర్థుల ఎత్తు, ఛాతీ కొలతలను నిర్ధారిం చి, అర్హత సాధించిన అభ్యర్థులకు పి.ఈ.టి. పరీక్షలను అనుమతించామని జిల్లా ఎస్పీ వకు ల్ జిందల్ తెలిపారు.ఈ నియామక ప్రక్రియలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డిఎస్పీలు ఎం.వీరకు మార్, యూనివర్స్, ఎస్.రాఘవులు, టి.ఎన్. శ్రీనివాసరావు, కే.థామస్ రెడ్డి, ఎఓ పి.శ్రీనివా సరావు, పలువురు సిఐలు, రిజర్వు ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పిఈటీలు మరియు ఇతర పోలీసు అధికారులు, పోలీసు కార్యాల య ఉద్యోగులు పాల్గొని, ఎంపిక ప్రక్రియ సజా వుగా జరిగే విధంగా విధులు నిర్వహించారు.






# ఐ టీ.లో విశాఖకు ఉజ్వల భవిష్యత్

**నామినేటెడ్ పోస్టుల్లో యువతకు ప్రాధాన్యమి స్తామన్న లోకేష్**

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జనవరి 16. :**విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ను టిడిపి యువనేత, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరా వు కుమారుడు గంటా రవితేజ, లోకేష్ స్వగ్రామ మైన నారావారిపల్లెలో సంక్రాంతి సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు. టీసీఎస్ సెంటర్ ను విశాఖకు తీసుకురావడంలో లోకేష్ కృషిని అభినందిస్తూ ఐటీ హబ్ విశాఖకు మరిన్ని అం తర్జాతీయ కంపెనీలను వచ్చేలా చూడాలని కో రారు. ఈనెల 20 నుంచి 24 మధ్య స్విట్జర్లాం డ్ దావోస్ పర్యటనలో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబ డులు తీసుకురావాలని కోరారు. కష్టపడి పనిచే సిన కార్యకర్తలకు, ముఖ్యంగా యువతకునామి నేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు. ఆర్థిక రాజధాని విశాఖకు భవిష్యత్ లో ఇంకా అనేక కంపెనీలు వచ్చే అవకాశముందని, దీంతో యువతకు పుష్కలమైన ఉపాధి అవకా శాలు లభిస్తాయని లోకేష్ ఈ సందర్భంగా తెలి పారు. తొందర్లోనే భర్తీ చేయబోయే నామినేటెడ్ పోస్టుల్లో యువతకు ప్రాధాన్యమిస్తామని హామీ ఇచ్చారు.



## మౌలిక సదుపాయాల కల్పనకు జెడ్పీ చైర్పర్సన్ హామీ

- త్రాగునీటి సౌకర్యానికి, డ్రైనేజీ, సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయిస్తానన్న జెడ్పీ చైర్ పర్సన్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జనవరి16.**మౌలిక సదుపాయాలు కల్పించాలని దారేల గ్రామస్తుల వినతిని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ సానుకూలంగా స్పందించారు. జిల్లా పరిషత్ నిధులు కేటాయించి దారేల పంచాయతీ పరిధిలో త్రాగునీటి సౌకర్యం, డ్రైనేజీ, సిసి రోడ్డు నిర్మాణాలు చేపడతానని హామీ ఇచ్చారు. ముంచంగిపుట్టు మండలం, దారెల పంచాయితీ కేంద్రంలో గురువారం విచ్చేసిన చైర్పర్సన్ సుభద్ర కు స్థానిక వైసీపీ నేతలు ధనుర్జాయ్, గౌరీ శంకర్, పులిరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. పంచాయతీ పరిధిలో గల ప్రధాన సమస్యలు సిసి రోడ్డు, డ్రైనేజీ, త్రాగునీటి సౌకర్యం, కల్పించాలని ఆమెను కోరారు. వర్షాకాలంలో పలు గ్రామాలలో రోడ్డు సౌకర్యం లేక బురదలోనే రాకపోకలు సాగించే పరిస్థితి నెలకొందని దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని చైర్పర్సన్ సుభద్ర కు వివరించారు. చైర్పర్సన్ సుభద్ర సానుకూలంగా స్పందించి పంచాయతీ పరిధిలో గల గ్రామాలలో త్రాగునీటి సౌకర్యం, సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టేందుకు జిల్లా పరిషత్ నిధులు కేటాయించి నిర్మాణ పనులు చేయుటకు కృషి చేస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధు, వైసిపి నేత జెవివిఎన్ మూర్తి, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి స్థానిక వైసిపి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలి



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం జనవరి 16. :**
విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతి రేకంగా దేశవ్యాప్తంగా ఉన్న స్టీల్ పరిశ్రమలలో ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని అఖిలభారత సిఐటియు ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ తప్పన్ సేన్ పిలుపునిచ్చారు. నేడు కోల్ కత్త లో స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో తప్పన్ సేన్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ పై కేంద్ర ప్రభు త్వం లోని బిజెపి తన నిరంకుశ వైఖరిని అత్యం త వేగంగా అమలు చేస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. అందులో భాగంగానే విశాఖ స్టీ ల్ ప్లాంట్ లో విఆర్ఎస్ ప్రవేశపెట్టి తద్వారా తన తాబేదారులకు కట్టబెట్టే ప్రక్రియను ప్రారంభించిం దని ఆయన వివరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతూ దీనికి సొంత ఐరన్ ఓర్ గనులను కేటాయించడమే పరిష్కా రమని ఆయన అన్నారు. నేడు ప్రభుత్వం ఒరి స్సా లోని సెయిల్ ఐరన్ ఓర్ గనులను అదాని ప్రైవేటు సంస్థకు కేటాయిస్తూ నిర్ణయం చేశార ని, దీనిని వ్యతిరేకిస్తూ అక్కడ ఉద్యమం సాగు తోందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. విశాఖ స్టీల్ కార్మికులకు నాలుగు నెలల నుండి జీతాలు చెల్లించకుండా కార్మికుల పై జరుపుతు న్న నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా ఉద్యమం చే యాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ను సెయిల్ లో వి లీనం చేయాలని, సొంత గనులు కేటాయించాల ని ఈ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. కనుక స్టీల్ పరిశ్రమ పట్ల ప్రభుత్వ వైఖరికి నిరస నగా ఉద్యమాలను మరింత ఉధృతం చేయడా నికి దేశవ్యాప్తంగా ఉన్న స్టీల్ కార్మికులు ఉద్య మానికి సిద్ధం కావాలని ఆయన పిలుపు నిచ్చా రు. ఈ సమావేశంలో విశాఖ స్టీల్ ప్లాంట్ స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ సభ్యులు జె అయోధ్య రామ్, యు రామస్వామి, ఓ విరావు, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా తదితరులతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ సభ్య లు పాల్గొన్నారు.

# ఊరు మాత్రం కొత్త ఊరిమధ్యలో చెత్త



సమస్యలుతో సతమతమవుతున్న ఒకటో నంబర్ వార్డుప్రజలు







**కొత్తపేట, పెన్ పవర్,జనవరి16:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట గ్రామ పంచాయతి ఒకటో నంబర్ వార్డులో ప్రజలు త్రాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని నెలలుగా వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న ప్రధాన విద్యుత్ పరికరాలు కాలిపోవడం వలన,వాటర్ ట్యాంక్ కు గల మోటారుకు కరెంటు నిలిచిపోయింది గత్యంతరం లేక చేతి పంపునుండి నీరు త్రాగుతున్నామని,మోటారు ను రిపేర్ చేయమని సంబంధించిన అధికారులుకు కొన్ని నెలలుగా ఫిర్యాదు చేస్తున్నామని అయినా పట్టించుకోవడంలేదని,అదీకాక వీధుల్లో డ్రైనేజీ సమస్య,
పారిశుద్ధ్యం, వీధి లైట్స్ సమస్య ఒకటేమిటి అన్నీ సమస్యలేనని,క్రమబద్ధంగా
పంచాయతీ పన్నులు కడుతున్నామని సమస్యలు పై అధికారులుకు పిర్యాదు చేసినా స్పందించే నాధుడే లేడని,కొన్ని వీధుల్లో ఇప్పటికీ విధ్యుత్ స్థంభాలు కూడా నిర్మించలేదని, పేరుకే ఒకటో నంబర్ వార్డు అభివృద్ధిలో మాత్రం సున్నా అని,పన్నులు కట్టినా తమ సమస్యలు పరిస్కారం చేసే నాయకులు లేరా, ఓట్ల కోసమే తప్ప మా పాట్లు కోసం కృషి చేసే నాయకుడు ఎక్కడఅంటూ తమ ఆవేదన వ్యక్తంచేశారు

# 20వసంతాలు పూర్తి చేసుకున్న నడుమురు స్టార్ యూత్







- గ్రామంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉమ్మడి విశాఖ జిల్లా చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర.
- పంచాయతీ సర్పంచ్ నరసింగరావు, ఎంపిటిసి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాల నిర్వహణ.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జనవరి 16.**మండలంలో గల ఏనుగు రాయి పంచాయితీ నడుమురు గ్రామంలో స్టార్ యూత్ ప్రారంభించి 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భం, దీనికి తోడు సంక్రాంతి పండగ తోడవడంతో విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు భారీ సందడి చేశారు. పంచాయతీ సర్పంచ్ నరసింగరావు, ఎంపిటిసి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. స్టార్ యూత్ ఏర్పడడం ద్వారా విద్యార్థులకు తల్లిదండ్రులకు ఎంతో చైతన్యపరిచి ఉద్యోగ ఉపాధి పొందడానికి కృషి చేయడం గొప్ప విషయం అని స్టార్ యూత్ సభ్యులను కొన్నియాడారు. స్టార్ యూత్ ప్రోత్సాహంతో ఉద్యోగంలో చేరిన ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాలి భాగస్తులై సహకరించటం ఆనందించదగ్గ విషయమని, వారి యొక్క సహకారం ఐక్యమత్యానికి నిదర్శనంగా ఆమె స్టార్ యూత్ సభ్యులను, ఉద్యోగస్తులను అభినందించారు. సంక్రాంతి పండగతో పాటు స్టార్ యూత్ ఏర్పడి 20 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా పంచాయతీ పరిధిలో క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం యువతను క్రీడల్లో ప్రోత్సాహం ఇవ్వడమే అన్నారు. తదనంతరం పంచాయతీ సర్పంచ్ నరసింగరావు మాట్లాడుతూ.. స్టార్ యూత్ ఏర్పడి 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భం, దానికి తోడు సంక్రాంతి పండగ నేపథ్యంలో క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్ లు నిర్వహించమన్నారు. క్రికెట్ టోర్నమెంట్ మొదటి విజేతగా నిలిచిన ముంచంగిపుట్టు పవర్ యూత్ జట్టుకు చైర్ పర్సన్ చేతుల మీదుగా మొదటి బహుమతి అందజేశారు. క్రికెట్ ద్వితీయ బహుమతి గాదెల బురుగుజట్టుకు బహుకరించారు. వాలీబాల్ లో మొదటి బహుమతి మాలగుమ్మి, ద్వితీయ బహుమతి కోడపుట్టు జట్లకు అందించారు. తదనంతరం సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మూర్తి, లెక్చరర్ పి పద్మారావు, దామోదరం, స్టార్ యూత్ సభ్యులు, ఉద్యోగస్తులు, విద్యార్థులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 48.7 క్వింటాల్ పి.డి. ఎస్.బియ్యం పట్టుకున్న





- విశాఖపట్నం సిటీ, వన్ టౌన్ పోలీసులు

**విశాఖ క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, జనవరి 16 :**విశాఖపట్నం సిటీ పోలీస్ కమిసనర్కి రాబడిన నమ్మదగిన సమాచారం ప్రకారం 13వ తేదీ మధ్యాహ్నం 1:00 సమయంలో విశాఖపట్నం సిటీ, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియా అయిన పూర్ణమార్కెట్, ఆయిల్ మిల్లు సందు సమీపం లో వేంకటేశ్వర రావు పేరు మీద ఉన్న రేషన్ డిపో నెంబర్ :0386153ను వన్ టౌన్ సీ.ఐ. వారి సిబ్బంది మరియు సివిల్ సప్లయ్ చెకింగ్ ఆఫీసర్ కలిసి రేషన్ డిపో: 038 6153ను తని ఖీ చేయగా ఆ డిపో నందు సివిల్ సప్లయ్ వారి ఈ పాస్ బుక్ ప్రకారం 44 బస్తాలు (620కేజిలు) ఉండాలి, కానీ 129 బస్తాలు (64 50 కేజిలు) ఉన్నవి. అదే సమయంలో రేషన్ డి పో కు ఎదు రుగా ఏపీ39 టియు0217 బొలెరో వాహనంలో 13 ప్లాస్టిక్ బస్తాలు పి.డి.ఎస్ బి య్యం ఉన్నవి. వాటిని నలుగురు వ్యక్తులు అ క్రమంగా తరలి స్తుండగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సి.ఐ.వారి సి బ్బందితో ఆ నలుగురు వ్యక్తులను చుట్టి ముట్టి పట్టుకొని ఏపీ39 టియు0217 బొలెరో వాహ నంను, 13 ప్లాస్టిక్ బస్తాల పిడిఎస్ బియ్యంను, నలుగురు వ్యక్తులును అదుపులోనికి తీసుకో వడం జరిగింది. విచారించాగ సదురు బియ్య మును ఆక్రముగా తరలిస్తునట్లు తెలియపరిచి నారు. వారిని అరెస్ట్ చేయడమైనది మరియు వేంకటేశ్వర రావు పేరు మీద ఉన్న రేషన్ డిపో నెంబర్ :0386153 లో అదనంగా పి.డి.ఎస్ బియ్యం ఉండడం వలన సివిల్ సప్లయ్ చెకింగ్ ఆఫీసర్ గారు ఆ రేషన్ డిపోను సీజ్ చేయడం జరిగినది. కావున విశాఖపట్నం సిటీ ప్రజలకి మీ ఏరియాలో ఇటువంటి అవకతవ కలు ఏమైనా జరిగిన వెంటనే సి.పిఫోన్ నెంబర్ అయిన 799 5095799, లేక వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇన్స్పెక్టర్ ఫోన్ నెంబర్ అయిన 9440796 019 కు తెలియపరచవలసిందిగా విశాఖ పోలీస్ వారి తరు పున కోరుకుంటున్నాము.

# నవోదయ ప్రవేశ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జనవరి 16** :జవహర్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతి లో ప్రవేశానికి గాను జనవరి 18 వ తేదీన జరగ నున్న ప్రవేశ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 39 కేంద్రాలలో పరీక్ష నిర్వహించను న్న నేపథ్యంలో సంబంధిత నిర్వహణ ఏర్పాట్లపై వివిధ అధికారులతో గురువారం ఉదయం తన ఛాంబర్లో సమీక్షా సమావేశం నిర్వహించారు. అ న్ని విభాగాల అధికారులు సమన్వయం వహిం చి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ క్రమంలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో 39 కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ డా.వై.ఎస్. ఎస్.చంద్రశేఖర్ చెప్పారు. 9,080 మంది హాజరుకానున్నట్లు వెల్లడించారు. మూడు జిల్లాలకు చెందిన పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లకు, పరిశీలకులకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాల యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శిక్షణ కూడా అందజేసినట్లు వివరించారు. పరీక్ష 18వ తేదీ ఉదయం 11.30 నుంచి 1.00 గంట వరకు జరుగుతుందని పేర్కొన్నారు. అన్ని అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించిన కలెక్టర్ జిల్లా అధికారులకు తగిన మార్గదర్శకాలు జారీ చేశారు. అందరూ సమన్వయం వహించాలని సూచించారు.
ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తో పాటు వివిధ విభాగా ల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# పెచ్చులూడి శిథిలావస్థలో చేరిన దారెల తారు రోడ్డు

కిలగాడ జంక్షన్ నుండి దారెల పంచాయతీ కేంద్రం వరకు రాకపోకలకు వాహన చోదకులు తీవ్ర ఇక్కట్లు

మరమ్మతులు పనులు చేపట్టాలని సరిహద్దు గ్రామ ప్రజల డిమాండ్.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జనవరి 16.**పెచ్చులూడి అధ్వానంగా మారి శిథిలావస్థలో చేరిన రహదారిపై రాకపోకలకు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెచ్చులూడి గోతుల మాయంగా మారిన రహదారిపై ఎలా ప్రయాణించాలంటూ ప్రజలు ప్రభుత్వం మీద ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకెళ్ళితే.. అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండల పరిధిలో గల కిలగాడ జంక్షన్ నుండి దారేలా పంచాయతీ కేంద్రము పలు గ్రామాలు కలుపుతూ గత 15 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వ హయాంలో వేసిన తారు రోడ్డు శిథిలావస్థలో చేరి గుంతలు మాయంగా మారడంతో రాకపోకలు కొన సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం రోడ్డు మరమ్మతు పనులు చేయుటకు నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడ దీని మీద దృష్టి సారించలేదన్నారు. దీంతో చేసేదిలేక ప్రజలు రాకపోకలు సాగించేందుకు గుంతల మాయంగా మారిన రహదారే శరణ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలగాడ ప్రధాన రహదారి నుండి గన్నెడ, దారెల, డింబుగూడ, తాలింభ, రంగేలాసింగి, డొక్రిపుట్టు, పనస గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో ఆయా గ్రామస్తులు నిరంతరం ఈ రహదారి గుండానే రాకపోకలు సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం రహదారి నిర్మాణానికి పత్రికలలో ప్రకటనలు మాత్రమే గుప్పిస్తున్నాయి తప్ప అవి చేతలో అమలు చెయ్యడం లేదని సంక్రాంతి సెలవులకు గ్రామాలలో వచ్చిన వారు, పంచాయతీ ప్రజలు బాహాటంగా మాట్లాడుతున్నారు. ఇప్పటికైనా కూటమీ ప్రభుత్వం స్పందించి కిలగాడ జంక్షన్ నుంచి దారేలా పంచాయతీ కేంద్రం వరకు అధ్వానంగా మారి పెచ్చులూడి శిథిలావస్థలో చేరిన తారు రోడ్డును పూర్తిస్థాయిలో మరమ్మతు పనులు చేపట్టాలని పంచాయతీ ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఎడ్లపందెలలో ప్రమాదం.. వ్యక్తికి తీవ్ర గాయాలు

**సూళ్లూరుపేట పెన్ పవర్: :** సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతులమీదుగా నాయుడుపేటలో ఎడ్ల పందాలు పోటీలు ప్రారంభం అయ్యాయి. , ఈ ఎడ్ల పోటీలో ఓ ఎడ్ల బండి అదుపుతప్పి ప్రేక్షకుడి మీదికి దూసుకెల్లడంతో ఒక వ్యక్తి తీవ్ర గాయాలు పాలైయాడు. బాధితుడు నాయుడుపేట మండలం మేనకూరు చెందిన పేరం శెట్టి పోలయ్య గా గుర్తించారు. సంక్రాంతి సంబరాలులో భాగంగా నాయుడుపేట లోని ఏఎల్సీఎం గ్రౌండ్ ఆవరణంలో జరిగిన ఎడ్ల బండి పోటీల్లో అపశృతి చోటు చేసుకుంది. ఎడ్ల బండి పరుగు పందెం జరుగుతున్న సమయంలో పందెం లో పాల్గొన్న ఓ ఎడ్ల బండి అదుపు తప్పి పందెం చూసేందుకు వచ్చిన ఓ ప్రేక్షకుడికి పైకి దూసుకువచ్చింది.దీంతో ఆ వ్యక్తి కి తీవ్ర గాయాలు అయ్యాయి, గాయపడిన వ్యక్తిని పోలీసులు హుటాహుటిన నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# ప్రజలకు మరిన్ని ఉన్నత సేవలు అందించడానికి క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదు దారుల ఫీడ్ బ్యాక్ సేకరణ..!

**పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ**

**సిద్దిపేట పెన్ పవర్:** ఫిర్యాదుదారులు పోలీస్ స్టేషన్ నుకు వచ్చి దరఖాస్తు ఇచ్చినప్పుడు వారికి అందుతున్న సేవలు గురించి క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఫీడ్ బ్యాక్ ఇచ్చే అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పోలీసు కమిషనర్ డాక్టర్ బి అనురాధ అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ ఆవరణ సర్కిల్ కార్యాలయము ఎసిపి కార్యాలయం సిపి కార్యాలయ ఆవరణలో క్యూఆర్ కోడ్ ఉన్న ఐదు పోస్టర్లు అంటించడం జరిగింది.

పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ మాట్లాడుతూ తెలంగాణ పోలీస్ సేవలపై ప్రజల అభిప్రాయము తెలుసుకోవడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తయారుచేసిన క్యూఆర్ కోడ్ ను లాంఛనంగా ప్రారంభించడం జరిగింది.

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ యందు, సర్కిల్ కార్యాలయాలు, ఏసిపి ఆఫీసులు, పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు దారుల సంబంధించి వారి ఫిర్యాదుల పట్ల సంబంధిత పోలీస్ సిబ్బంది స్పందించిన తీరు, పోలీస్ సిబ్బంది పట్ల ప్రజలు ఏ విధంగా తమ అభిప్రాయం తెలియజేయాలనుకుంటున్నరో అందుకోసం ఏర్పాటు చేయడం జరిగిందే ఈ క్యూఆర్ కోడ్. ఈ క్యూఆర్ కోడ్ వలన పోలీసుల గురించి ప్రజల నుండి వారి అభిప్రాయాలను సేకరించడం కోసం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్యూఆర్ కోడ్ పోస్టర్లు ప్రతి పోలీస్ స్టేషన్లో, సర్కిల్ కార్యాలయాల్లో, ఏసీపీ ఆఫీసులలో ఐదు ప్రదేశాలలో రిసెప్షన్, పోలీస్ స్టేషన్ ముందు బాగాన ప్రజలకు విజబుల్ ఉండే విధంగా ఏర్పాటు చేసామని వెల్లడించారు.

# కాలువలో వాహనం బోల్తా.. ముగ్గురు మృతి

**ప్రత్తిపాడు: పెన్ పవర్:** ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గోపాల చెరువు వద్ద కాలువలో టెంపో ట్రావెల్స్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఘటనలో ముగ్గురు మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ప్రతిపాడు పోలీసులు విచారణ ప్రారంభించారు. కాకినాడ నుండి దారపల్లి జలపాతానికి వెళుతుండగా ఘటన జరిగింది. సుమారు 20 మంది ప్రయాణిస్తున్నారు.

# తెలంగాణ కల సాకారంలో జైపాల్ రెడ్డి పాత్ర చిరస్మరణీయం

**ఢిల్లీ: పెన్ పవర్:** ప్రత్యేక తెలంగాణ కల సాకారంలో కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి పాత్ర చిరస్మరణీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ సూదిని జైపాల్ రెడ్డిరి జయంతిని పురస్కరించుకొని గురువారం ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో సాధారణ పల్లె నుంచి ఢిల్లీ దాకా సాగిన ఆయన ప్రస్థానంలో నైతిక విలువలకు కట్టుబడ్డారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో, పార్లమెంట్ ఉభయ సభల్లో బలమైన గళం వినిపించారని సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, బెల్లంపల్లి, పరిగి ఎంఎల్ఏలు గడ్డం వినోద్, రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నాయకులు రోహిన్ రెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

# బీదర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సినిమా సీన్ తరహాలో భారీ దోపిడీ

**బీదర్: పెన్ పవర్:** బీదర్ శివాజీ సర్కిల్ ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద ఎటీఎంలో నగదు డిపాజిట్ చేయడానికి వచ్చిన సిబ్బందిపై దుండగులు కాల్పులు జరిపారు. ముఖానికి మాస్క్ ధరించి బైక్ పై వచ్చి క్యాష్ డిపాజిట్ సిబ్బందిపై కారం చల్లి ఆరు రౌండ్ల కాల్పులు జరిపారు. 93 లక్షల రూపాయల నగదు ఎత్తుకెళ్ళినట్టు సమాచారం. డిపాజిట్ సిబ్బంది ఉద్యోగి గిరి వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా మరో ఉద్యోగికి తీవ్ర గాయాలు అయ్యాయి. సీనంతా సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి.

# అమెరికాలో సంపన్నుల ఆధిపత్యం పెరుగుతోంది

## యావత్తు ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా మారుతోంది

## మన ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛకు భంగం కలుగుతోంది

## అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆందోళన

**న్యూయార్క్ జనవరి 16: పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఫేర్‌వెల్ ప్రసంగం చేశారు. అమెరికాలో సంపన్నుల ఆధిపత్యం పెరుగుతోందని వార్నింగ్ ఇచ్చారు. అది ప్రమాదకరంగా మారుతోందన్నారు. దశాబ్ధాల రాజకీయ కెరీర్‌కు స్వస్తి పలుకుతూ.. బైడెన్ మీడియాతో మాట్లాడారు. అత్యంత సంపన్నమైన, శక్తివంతమైన, ప్రభావంతమైన వ్యక్తుల చేతుల్లో అధికారం ఉన్నదని, ఇది యావత్తు ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా మారుతోందని, మన ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛకు భంగం కలుగుతోందని బైడెన్ ఆందోళన వ్యక్తం చేశారు. 82 ఏళ్ల బైడెన్ శ్వేతసౌధం నుంచి చివరి టీవీ ప్రసంగం చేశారు. వాతావరణ మార్పులు, సోషల్ మీడియా దుష్ ప్రచారంపై వార్నింగ్ ఇచ్చారు.తన సింగిల్ టర్మ్ పాలనలో సాధించిన ఘనతల గురించి ఆయన వివరించారు. ఉద్యోగాల కల్పన, మౌళికసదుపాయాలపై ఖర్చు, ఆరోగ్య పరిరక్షణ, కోవిడ్ నుంచి బయటపడడం, మళ్లీ దేశాన్ని నెంబర్ వన్ స్థానంలో ఎలా నిలిపారన్న అంశాలను ఆయన తన ప్రసంగంలో చెప్పారు. తాము చేసిన పని ఫలితాలు అందాలంటే ఇంకా సమయం పడుతుందన్నారు. మేం విత్తనాలు నాటామని, అవి పెరుగుతాయని, కొన్ని దశాబ్ధాల పాటు ఆ పుష్పాలు వికసిస్తాయన్నారు.అమెరికా ప్రజలపై సమాచార దాడి జరుగుతోందని, తప్పుడు సమాచారం ప్రచారం ఎక్కువగా ఉందని, దీంతో అధికార దుర్వినియోగం జరుగుతోందన్నారు. మెటా లాంటి సోషల్ మీడియా కంపెనీలను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.

# కాళేశ్వరం విచారణ.. రాజకీయ పార్టీలకు అస్త్రం



**హైదరాబాద్, జనవరి 16, పెన్ పవర్:** తెలంగాణ గట్టు మీద కాక రేపుతోంది కాళేశ్వరం ప్రాజెక్టు. ఫినిషింగ్ టచ్‌లో భాగంగా.. రేపోమాపో కొందరు పెద్దలను విచారణకు పిలుస్తారని అంటున్నారు. ఇంతకీ కమిషన్ ఫైనల్ టార్గెట్ ఎవరు..? కమిషన్ విచారించబోయేది ఎవరెవరిని.?ఏడేళ్లుగా అదే హాట్ టాపిక్. ఆ ప్రాజెక్టుకు పునాది నుంచి..కుంగిపోయిందన్న ప్రచారం వరకు..తెలంగాణ పాలిటిక్స్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు రాజకీయ పార్టీలకు అస్త్రంగా మారింది. అటు బీజేపీ, కాంగ్రెస్..బీఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తుంటే..కాళేశ్వరంతో తెలంగాణ పచ్చని మాగానికిగా మారిందని గులాబీ పార్టీ చెప్పుకుంటూ వస్తోంది. ఈనేపథ్యంలో విమర్శలు, ప్రతి విమర్శలతో డైలీ ఎపిసోడ్ కంటిన్యూ అవుతూనే ఉంది.అందులో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై విచారణకు ఆదేశించింది రేవంత్ సర్కార్. జస్టిస్ పినాకిని చంద్రఘోష్ ఆధ్వర్యంలో గతేడాది మార్చి 14న విచారణ కమిషన్ ఏర్పాటు చేసింది. రెండున్నర నెలల్లో అంటే జూన్ 30లోపు విచారణ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ అనేక అంశాలు ముడిపడి ఉండటంతో సకాలంలో విచారణ పూర్తి కాలేదు.ఇలా ఇప్పటి వరకు నాలుగు సార్లు విచారణ కమిషన్ గడువును పొడిగించారు. ఇప్పటివరకు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగస్వామ్యం ఉన్న ఇంజనీర్లు, మాజీ ఇంజనీర్లతో పాటు ఈఎన్సీలను విచారించింది కమిషన్. పబ్లిక్ హియరింగ్‌లో భాగంగా టీజేఎస్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ కోదండరాం, వెదెరె శ్రీరాం వంటి వారి నుంచి కూడా సమాచారం తీసుకుంది. ఈ మధ్య కాలంలో ఐఏఎస్‌లు స్మితా సబర్వాల్, రామకృష్ణారావు, మాజీ సీఎస్ సోమేశ్ కుమార్, ఎస్కే జోషిని కూడా వివరాలు అడిగి తెలుసుకుంది జస్టిస్ చంద్రఘోష్ కమిషన్. ఇక ఫినిషింగ్ టచ్ ఇవ్వాలని చూస్తోంది.కాళేశ్వరం విచారణలో భాగంగా వివిధ దశల్లో భాగంగా సమగ్ర సమాచారాన్ని కమిషన్ సేకరించింది. ప్రజాకోర్టుల ద్వారా విచారణ చేయడంతో పాటు అఫిడవిట్ల నుంచి సమాచారం సేకరించింది కమిషన్. ఇక పొలిటికల్ లీడర్లపై ఫోకస్ చేయాలని చూస్తోంది. ఇప్పటివరకు అధికారుల ఇచ్చిన సమగ్ర సమాచారాన్ని పూర్తిస్థాయిలో స్టడీ చేసి.. నెక్స్ట్ స్టెప్‌లో భాగంగా పొలిటికల్ లీడర్లను విచారణ చేయాలని చూస్తోంది. కమిషన్ విచారణ గడువును ఇప్పటికే నాలుగు సార్లు పొడిగించిన నేపథ్యంలో.. ఇక ఫైనల్ వచ్చే నెల 28 లోపు విచారణను పూర్తి చేసి ప్రభుత్వానికి రిపోర్టు ఇవ్వాలని భావిస్తోంది. అందుకే రేపోమాపో విచారణ కమిషన్ తన ప్రక్రియను మరింత స్పీడప్ చేయనుంది.ఈ నెల 19న జస్టిస్ పినాకిని చంద్రఘోష్ హైదరాబాద్ వస్తున్నారు. ఈ నెల 21 నుంచి క్రాస్ ఎగ్జామినేషన్‌ను ప్రారంభించనున్నారు. ఈ దఫా ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు నిర్మాణ సంస్థల ప్రతినిధులను కమిషన్ విచారించనుంది. ఆ తర్వాత ఫినిషింగ్ టచ్‌లో భాగంగా..కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆర్థిక శాఖ మంత్రిగా, నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేసిన నేతలను విచారణకు పిలుస్తారని అంటున్నారు. ఈ నేపథ్యంలో గతంలో ఆర్థిక శాఖమంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్, ఇరిగేషన్ మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావుతో పాటు, మాజీ సీఎం కేసీఆర్‌ను కూడా విచారించాలని జస్టిస్ పినాకిని చంద్రఘోష్ కమిషన్ భావిస్తోందట.మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఇరిగేషన్ మినిస్టర్ హరీశ్‌రావుకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అవకాశం ఉంది. ఈ ముగ్గురిని విచారణ చేస్తేనే క్లారిటీ వస్తుందని కమిషన్ భావిస్తోందట. కమిషన్‌కు తమ వివరణ ఇచ్చిన ఇంజనీర్లు, స్మితాసబర్వాల్ వంటి ఐఏఎస్‌లు కూడా ఈ వ్యవహారం అంతా మంత్రులు, సీఎం స్థాయిలో జరిగిందని చెప్పారట. వారు చెప్పిన వివరాలను ముందుపెట్టి ఈ ముగ్గురు నేతల నుంచి సమాచారాన్ని సేకరించాలని కమిషన్ ఆలోచిస్తుందట.ఈ ప్రక్రియను కూడా వచ్చే నెలాఖరులోపు పూర్తి చేసి డిటేయిల్డ్ రిపోర్టును ప్రభుత్వానికి ఇవ్వాలని పినాకిని చంద్రఘోష్ కమిషన్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎవరెవరికి నోటీసులు రాబోతున్నాయి.? ఒకవేళ కమిషన్ పిలిస్తే కేసీఆర్, హరీశ్ రావు విచారణకు వెళ్తారా అన్నది చర్చనీయాంశంగా మారింది.

# జిల్లాలో ప్రజల అవసరాలకు ఉచిత ఇసుక రవాణా

# రిజిస్టర్ ట్రాక్టర్లలో మాత్రమే సరఫరా చేయాలి

- జిల్లాలోని 6 ఇసుక రీచ్ ల నుంచి అనుమతి
- నిర్దేశిత ధరకు మించి విక్రయిస్తే ట్రాక్టర్ సీజ్
- ఉదయం 8 నుంచి, సాయంత్రం 5 వరకు ఇసుకకు అనుమతి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి ప్రతినిధి: పెన్ పవర్:** సామాన్య ప్రజలు తమ సొంత అవసరాలకు జిల్లాలోని 6 రీచ్ ల నుంచి ఉచితంగా ఇసుక తీసుకొని వెళ్లవచ్చని గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ఇటీవల జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా స్థాయి సాండ్ కమిటి సమావేశం నిర్వహించి నూతన ఇసుక పాలసీ ఆమోదించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ× జనవరి 16 నుంచి జిల్లాలో సామాన్య ప్రజలు తమ సొంత అవసరాలకు జిల్లాలోని 6 రీచ్ ల నుంచి ఉచితంగా ఇసుక తీసుకోవచ్చని అన్నారు. పెద్దపల్లి జిల్లా పరిధిలో వినియోగించుకునేందుకు జిల్లా ప్రజలు సుల్తానాబాద్ లోని నీరుకుల్ల, గట్టెపల్లి, ముత్తారం లోని ముత్తారం, అడవి శ్రీ రాంపూర్, మంథని లోని విలోచవరం, అంతర్గాం లోని గోలివాడ ఇసుక రీచ్ లలో ఎక్కడి నుంచైనా ట్రాక్టర్లలో ఇసుక తీసుకోవచ్చని అన్నారు. ఇసుక రీచ్ ల నుంచి ఉచితంగా తీసుకునే ఇసుక సొంత అవసరాలకు మాత్రమే వాడాలని, ఈ ఇసుకను మన జిల్లా పరిధిలో మాత్రమే వాడాలని, ఎక్కడా ఇసుక డంప్ లు సృష్టించడానికి వీలు లేదని, ఇసుక డంప్ చేసి ఇతర ప్రాంతాలకు తరలించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ఇసుక తరలించాలని, సాయంత్రం 5 తరువాత ఇసుక తరలిస్తే సంబంధిత వాహనాలను సీజ్ చేసి మొదటి సారి 25 వేల జరిమానా, రెండవ సారి డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందని అన్నారు. ఇసుక తరలింపు కోసం వినియోగించే ట్రాక్టర్ ఓవర్ లోడ్ కావడానికి వీలు లేదని, డ్రైవర్ కు తప్పనిసరిగా లైసెన్సు ఉండాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయడానికి వీలు లేదని , వాహనానికి తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు అన్ని వైపులా అంటించాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని 6 ఇసుక రీచ్ లకు సంబంధిత తహసిల్దార్లు ప్రత్యేకంగా సిబ్బంది కేటాయించి, ప్రతి రోజు తరలించే ఇసుక వాహన వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని అన్నారు. ప్రతి వారం ఇసుక తరలింపు వివరాలను కలెక్టర్ కు సంబంధిత తహసిల్దార్లు నివేదిక అందించాలని అన్నారు. జిల్లాలోని ఇసుక రీచ్ ల నుంచి తీసుకునే ఇసుక ప్రజలకు జిల్లా యంత్రాంగం నిర్ణయించిన ధర మించకుండా విక్రయించాలని అన్నారు. ట్రాక్టర్ ఇసుక

పెద్దపల్లి పట్టణ ప్రాంతంలో 1400, సుల్తానాబాద్ లో 1000, జూలపల్లిలో 1700, ఓదెల లో 1150, శ్రీరాంపూర్ లో 1100, పాలకుర్తి లో 2500, అంతర్గాం లో 1000, రామగుండంలో 2600, మంథని లో 1500, ధర్మారంలో 2300, కమాన్ పూర్ 2200, రామగిరి లో 2200 మాత్రమే విక్రయించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా ట్రాక్టర్ ఇసుక నిర్ణీత ధర కంటే అధికాంగా విక్రయిస్తే 08728 223318, 08728 223310 ఫోన్ నెంబర్ల ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు ఫిర్యాదు నమోదు చేస్తే సంబంధిత ట్రాక్టర్ల సీజ్ చేయడం జరుగుతుందని, మొదటి సారి 25 వేలు, రెండవ సారి 50 వేల జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 6 ఇసుక రీచ్ ల నుంచి పెద్దపెల్లి జిల్లా రిజిస్టర్ ట్రాక్టర్లు మాత్రమే ఇసుక తీసుకొని వెళ్లాలని, లారీలు, టిప్పర్లు వంటి పెద్ద వాహనాలు, ఇతర జిల్లాల ట్రాక్టర్లు వినియోగించేందుకు వీలు లేదని అన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

**బద్వేలు పెన్ పవర్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 18వ తేదీన జిల్లా పర్యటనకు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు సన్వయంతో ఏర్పాట్లను పకడ్బందీగా చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. మైదుకూరు నందు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లపై మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పర్యటించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 18న మైదుకూరు కు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. స్వచ్ఛ్ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మైదుకూరు పట్టణ ప్రాంతంలో పర్యటించనున్నారని అన్నారు. ఈ సందర్భంగా అన్ని కార్యాలయాలు, కార్యాలయ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.

అందుకు సంబంధించి ఆయా జిల్లా అధికారులు నివేదికలను తయారుచేయాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, విజయవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు.

తొలుత మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ లతో కలిసి సభా వేదిక ప్రాంగణం, హెలిపాడ్,

డంపు యార్డ్ లను జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పర్యతించి అధికారులకు పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫార్ములా-ఈ కారు రేసు.. మంత్రిగా నేను తీసుకున్న గొప్ప నిర్ణయాల్లో ఒకటి

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్ జనవరి 16 పెన్ పవర్: :** ఫార్ములా-ఈ కారు రేసును తెలంగాణకు తీసుకువచ్చి ప్రపంచపటంలో హైదరాబాద్ నగరాన్ని నిలపడం మంత్రిగా తాను తీసుకున్న గొప్ప నిర్ణయాల్లో ఒకటిగా నిలుస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'ఫార్ములా-ఈ ఈ రేసు సందర్భంగా అంతర్జాతీయ రేసర్లు, ఈ-మొబిలిటీ రంగానికి చెందిన ప్రముఖులు హైదరాబాద్ నగరాన్ని ప్రశంసలతో ముంచెత్తారు. ఎన్ని రకాల చిల్లర కేసులు, బురదజల్లే కార్యక్రమాలు, రాజకీయ వేధింపులకు పాల్పడినా ఈ రేసు ద్వారా సాధించిన విజయాలను తగ్గించలేవు. మంత్రిగా ఉన్నా లేకున్నా బ్రాండ్ హైదరాబాద్‌ను పెంపొందించడమే ఎల్లవేళలా ముఖ్యమైన అంశంగా నేను భావిస్తాను. ఫార్ములా-ఈ రేసు హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ క్రీడా పటంలో నిలిపింది. ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విజన్, నిబద్ధత, హైదరాబాద్ నగరం అంటే అమితమైన ప్రేమ ఉండాలి. అందుకే ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నా..రాష్ట్ర ప్రభుత్వం పంపిన రూ.46 కోట్లు ఫార్ములా-ఈ సంస్థకు అత్యంత పారదర్శకంగా బదిలీ చేయడం జరిగింది. కేవలం బ్యాంకు లావాదేవీగా స్పష్టమైన రికార్డు ఉంది. ఒక్క రూపాయి కూడా వృథా కాలేదు. ప్రతి నయా పైసాకూ లెక్క ఉంది. మరి అలాంటప్పుడు ఇందులో అవినీతి, మనీలాండరింగ్ ఎక్కడ ఉంది?. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న అసంబద్ధమైన రేసు రద్దు నిర్ణయం వల్లే రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లింది. ఎలాంటి తప్పు లేకున్నా కేవలం రాజకీయ వేధింపుల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టు కేసుల విచారణ పేరుతో ఈ అంశాన్ని లాగుతున్నది. కచ్చితంగా ఈ అంశంలో నిజమే గెలుస్తుంది. ఇదే అంశాన్ని రాష్ట్ర ప్రజలు, కోర్టులు కూడా త్వరలో తెలుసుకుంటాయి. అప్పటిదాకా న్యాయం కోసం మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## నలుగురు పాత దొంగలు అరెస్టు

**కుత్బుల్లాపూర్: పెన్ పవర్:** జీడిమెట్ల పియస్ పరిధి తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తులు నలుగురిని పోలీసులు అరెస్టు చేసారు. మరోకరు పరారీ వున్నాడు. ఈ ముఠా షాపూర్ నగర్ లో స్క్రాప్ దుకాణంలో చోరీలకు పాల్పడుతుంది. నిందింతులంతా పాతబస్తీకి చెందిన వారు. వారి దగ్గర నుండి 7, 64 లక్షల నగదు , రెండు పోర్ వీలర్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 18.64 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

## అప్పుడే ప్రారంభమైన నీటి కష్టాలు




**శ్రీకాకుళం, జనవరి 16, పెన్ పవర్:** మెళియాపుట్టి మండలంలోని పలు గ్రామాల్లో వేసవికి ముందే దాహం కేకలు వినిపిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు వర్షాలు కురవడంతో కాస్త ఫర్వాలేదనిపించినా సంక్రాంతికే తాగునీటి సమస్య ఏర్పడింది. తాగునీటి పథకాలు పనిచేయకపోవడంతోపాటు బోరు బావులు అడుగంటిపోవడంతో సమస్య తలెత్తింది. సంక్రాంతి పూట తాగునీటి ఇబ్బందులను గతంలో ఎప్పుడూ చూడలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మెళియాపుట్టి మండలంలోని మురికింటిభద్ర గ్రామంలోని ఓ వీధి ప్రజలు తాగునీరు కావాంటే సుమారు రెండు కిలోమీటర్లు నడుచుకొని వెళ్తే తప్ప దాహం తీరడంలేదు. అదికూడా పక్కనే ఉన్న పలాస మండలంలోని గోపి వల్లభాపురం గ్రామానికి చెందిన బోరు పంపు వద్దకు వెళ్ళి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. దీంతో ఆ గ్రామస్థులు తమ గ్రామంలో ఓ వైపు వీధికి నీరు పుష్కలంగాఉంది. ఇంటింటా నీరందిస్తామని పైపులు వేసినప్పటికీ ఫలితం శూన్యమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యేటా ఇదే తాగు నీటి సమస్య తలెత్తుతోందని అంటున్నారు. గతంలో వేసవిలో తాగునీటి సమస్య వస్తే ఇప్పుడు మాత్రం జనవరిలోనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టికి తీసుకువెళ్ళామని అయినా ఫలితం లేదంటున్నారు. సంక్రాంతి టైంలో ఊరూరా బసవన్నలను తిప్పుకొని పొట్టనింపుకొనేవారమని, తమ ఇళ్ళ వద్ద వృద్ధులు మాత్రమే ఉన్నారని, దీంతో తమకు నీటి సమస్య తీవ్రతరంగా ఉందని వాపోతున్నారు. ఇది ఒక్క గ్రామానికి చెందిన సమస్యకాదు. మండలంలోని చాలా పల్లెల కథ. శాంపిల్‌గా ఒక గ్రామంలోని ప్రజలతో మాట్లాడితే అనేక విషయాలు పంచుకున్నారు. ఎన్నికల ముందు నాయకులు ఇచ్చే హామీలకు కొదవలేదు. ఇప్పుడు నీరు లేదని అడిగితే మొహం చాటేస్తున్నారని అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెప్పాడనికి చుట్టూ జలవనరులు ఉన్నప్పటికీ తాగడానికి మాత్రం చుక్క నీరుకు కరవు అవుతుందని వాపోతున్నారు. పక్క నుంచే వెళ్లే నీటిని స్టోరేజ్ చేసి వాడుకునేందుకు అవకాశం లేకుండా పోయింది ఏళ్లు దాటుతున్న ప్రాజెక్టులను పెండింగ్ ఉండిపోయని ఆవేదన చెందుతున్నారు. పెద్ద పండుగకు బంధువులు పిల్లలు అందరూ తాగునీటి సమస్య ఎదుర్కొన్నామని అంటున్నారు. బయట నుంచి మంచినీళ్లు కొనుక్కొని తీసుకొద్దాం అంటే ఒక 20 లీటర్ బాటిల్ 30 రూపాయలు ఉంది. అది కూడా తక్కువ మాత్రమే ఇస్తున్నారు. ఉదయాన్నే ఇంట్లో ఒక మనిషి మంచినీరు తెచ్చుకోవడానికి వెళ్లి వచ్చేసరికి మధ్యాహ్నం అవుతుంది. కూలి పనులు కూడా వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. మంచినీరు తెచ్చుకునేసరికి ఆ రోజు పోతుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ పంచాయతీ ఎలక్షన్స్ రానే వస్తున్నాయి ఇప్పుడు మళ్లీ ఈసారి మన ప్రభుత్వం వచ్చింది కచ్చితంగా చేస్తారు మాటిస్తున్నాను అంటూ నాయకులు గ్రామాలు చుట్టూ తిరుగుతున్నారు. పక్క మండలానికి చెందిన పంచాయతీ వాళ్లు నీరు ఇవ్వకుంటే పరిస్థితి మరింత దారుణమని ఆందోళన చెందుతున్నారు స్థానికులు. ఇప్పటికీ మండలంలో తాగునీటికి పక్క మండలంపై ఆధార పడడం కొంతమేర ఆలోచించాల్సిన విషయమని అంటున్నారు.ఎప్పటికైనా కిలోమీటర్ల దూరం నుంచి తమ అవసరాలకు నీటిని మోసి తెచ్చుకునే పరిస్థితి తప్పుతుందనే ఆశగా ఎదురుచూస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా తమ మంచినీటి కష్టాలు తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో నరసింహప్రసాద్ పండా వద్ద ప్రస్తావించగా సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ం

## విజయవాడలో పోలీసులపై దాడి అవాస్తవం

## : సీఐ కొండల్ రావు

**విజయవాడ: పెన్ పవర్:** విజయవాడ శివారు జక్కంపూడిలో జూద శిబిరాలు ఖాళీ చేయించామని కొత్తపేట సీఐ కొండలరావు తెలిపారు. బుధవారం రాత్రి ఆయన మాట్లాడుతూ.. జక్కంపూడిలో పోలీసులపై ఎటువంటి దాడి జరగలేదని ఎస్ఐ సివిల్ డ్రెస్లో ఉండటం వల్ల అక్కడ ఉన్న ఆకతాయిలు గుర్తుపట్టలేదని తెలిపారు. ప్రస్తుతం జూద శిబిరాన్ని ఖాళీ చేయించామని ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఐ తెలిపారు. మరల జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## బస్సు బోల్తా..ప్రయాణికులకు గాయాలు

**అన్నమయ్య: పెన్ పవర్:** కురబలకోట మండలంలోని అంగళ్లు సమీపాన గురువారం వేకువజామున బస్సు బోల్తా పడింది. సమాచారం తెలుసుకున్న మదనపల్లి డిఎస్పి కొండయ్య నాయుడు, సీఐలు రామచంద్ర, రమేష్, కళా వెంకటరమణ ఆగమేఘాలపై కురబలకోట మండలానికి చేరుకున్నారు. బస్సు ప్రకాశం జిల్లా మార్కాపురం నుండి బెంగళూరుకు వెళుతుంది. క్షతగాత్రులను దగ్గరుండి కురబలకోట, వాల్మీకిపురం 108 సిబ్బంది అంబులెన్స్ వాహనాలలో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## టిఫిన్ సెంటర్ లో అగ్ని ప్రమాదం

**హైదరాబాద్: పెన్ పవర్:** కెపిహెచ్బి పోలీస్ స్టేషన్ పరిధిలో అర్జున్ థియేటర్ దగ్గరలో ఉన్న కంచుకోట టిఫిన్ సెంటర్లో అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వాళ్లొచ్చి మంటలు ఆర్పి వేసారు. హోటల్ సిబ్బంది ఈ సమయంలో ఇదే హోటల్లో నిద్రిస్తున్నారు. అయితే ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ ఘటనలో హోటల్లోని ఫర్నిచర్ రెండు ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలిపోయాయి.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి నారా లోకేష్

### కువైట్ లో చిక్కుకున్న మహిళకు సాయం

### క్షేమంగా స్వస్థలానికి చేరిన వరగంటి సుగుణ



**అమరావతి: పెన్ పవర్:** విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు ఏజెంట్ చేతిలో మోసపోయి కువైట్ లో చిక్కుకున్న మహిళను రక్షించి క్షేమంగా స్వస్థలానికి చేర్చారు. జీవనోపాధి కోసం తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం గ్రామానికి చెందిన వరగంటి సుగుణ కువైట్ వెళ్లారు. అయితే అక్కడకు వెళ్లిన తర్వాత అనేక ఇబ్బందులు పడుతున్నానని, ఏజెంట్ మోసం చేశారని ఎక్స్ వేదికగా ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర అనారోగ్యం బారినపడిన తాను తిండిలేక అల్లాడుతున్నానని, ఎలాగైనా రక్షించి స్వస్థలానికి చేర్చాలని వీడియో ద్వారా మంత్రి నారా లోకేష్ ను విజ్ఞప్తి చేశారు. దీంతో వెంటనే స్పందించిన మంత్రి లోకేష్.. తన టీం ద్వారా వరగంటి సుగుణను క్షేమంగా రాష్ట్రానికి తీసుకువచ్చి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. సాయం అడిగిన వెంటనే స్పందించి అండగా నిలిచిన మంత్రి నారా లోకేష్ కు సుగుణ, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# రాయలసీమ పై కూటమి గురి




**కర్నూలు, కడప, జనవరి18, పెన్ పవర్: :** మొన్నటి ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించాం. అందరి అంచనాలను తలకిందులు చేసి రాయలసీమలో సత్తా చాటాం. ఇక సీమను వదలొద్దంటూ ఫిక్స్ అయిపోయిందట కూటమి. ప్రత్యేకంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్..రాయలసీమ మీద స్పెషల్ ఫోకస్ పెట్టాలని డిసైడ్ అయ్యారట. అందుకు ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు రాజకీయాలపై పైచేయి సాధించే ఎత్తులు వేస్తున్నారటఇప్పటికీ వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ బలం ఎక్కడుందంటే..రాజకీయ అవగాహన ఉన్న వాళ్లు టక్కున చెప్పేది రాయలసీమ అనే. రాయలసీమ నాలుగు జిల్లాల్లో మొత్తం 52 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. ఏపీలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా మ్యాజిక్ ఫిగర్ 88 సీట్లు. అందులో సగానికంటే ఎక్కువ సీట్లు రాయలసీమ రీజియన్‌లోనే ఉన్నాయి.2024 ఎన్నికల్లో రాయలసీమలో వైసీపీ ఘోర ఓటమిని చవిచూసింది. ఆ నాలుగు జిల్లాల్లో వైసీపీని దాదాపుగా జీరో చేసి పారేసింది కూటమి. కానీ ఆ పార్టీ మళ్లీ పుంజుకుంటే రాయలసీమలో స్వీప్ చేయడం కష్టం కాదన్న అభిప్రాయాలు ఉన్నాయి. రాయలసీమలో తిరిగి పట్టు సాధించి నెల్లూరు, ఒంగోలులో చెప్పుకోదగ్గ సీట్లు తెచ్చుకున్నా..కోస్తా జిల్లాల్లో ఏ మాత్రం అనుకూలత పెరిగినా మరోసారి జగన్ సీఎం అవడం పక్కా అన్నది పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయం. అందుకే వైసీపీని రాయలసీమలోనే కోలుకోలేని దెబ్బ కొట్టాలని భావిస్తున్నారట డిప్యూటీ సీఎం పవన్.టీడీపీ అధినేత చంద్రబాబు అయితే చాణక్య వ్యూహాలనే అమలు చేస్తున్నారట. 2024 ఎన్నికల్లో జగన్ పార్టీ ఓడినా ఒంటరిగా పోటీ చేసి నలభై శాతానికి తక్కువ కాకుండా ఓట్ షేర్ దక్కించుకున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. అందుకే సీఎం చంద్రబాబు ఇప్పటినుంచే 2029 ఎన్నికల కోసం పక్కాగా ప్లాన్ చేస్తున్నారట. జనసేన, బీజేపీతో కలసి రాబోయే ఎలక్షన్స్‌ను ఫేస్ చేయాలని ఫిక్స్ అయిన చంద్రబాబు అందుకు తగ్గట్లుగా సర్వం సిద్ధం చేసుకుంటున్నారట.సీమలో జనసేన ప్రభావం ఉందని నమ్ముతున్నారట చంద్రబాబు. పవన్‌కు ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్‌కు టీడీపీ, బీజేపీ ఓట్లు యాడ్ అయితే మళ్లీ ప్రభంజనమే అని లెక్కలు వేసుకుంటున్నారట. రాయలసీమ యూత్‌ను ఆకట్టుకునేలా పవన్‌ను అస్త్రంగా వాడాలని డిసైడ్ అయ్యారట బాబు. అలాగే బలమైన సామాజిక వర్గం కూడా గ్లాస్ పార్టీకి అండగా ఉంది. దాంతో వచ్చే ఎన్నికల్లోనూ ఇదే రకమైన థియరీని అమలు చేయాలని ఎత్తులు వేస్తున్నారట.పక్కా వ్యూహంలో భాగంగానే తరచూ రాయలసీమ పర్యటనలు చేస్తున్నారట డిప్యూటీ సీఎం పవన్. ఈ మధ్య కడప వెళ్ళి మరీ ఎంపీడీవో మీద జరిగిన దాడిని ఖండించి వచ్చారు. ఏకంగా రాయలసీమలోనే క్యాంప్ ఆఫీస్ పెడతానంటూ ప్రకటించేశారు. రాయలసీమ మీ జాగీరు కాదు.. గూండాగిరి చేస్తే ఊరుకునేది లేదంటూ వార్నింగ్ ఇచ్చారు పవన్. లేటెస్ట్‌గా కర్నూలు జిల్లాలో వెళ్లి డే లాంగ్ ప్రోగ్రాం పెట్టుకుని గ్రీన్ కో ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. త్వరలో కడపలో పర్యటించి.. సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల ఆధీనంలో ఉన్నాయని ఆరోపిస్తున్న అటవీ భూములను పరిశీలిస్తారట.సీఎం చంద్రబాబు రాయలసీమను రతనాల సీమగా చేస్తామంటున్నారు. వాటర్ రిసోర్స్ మీద ఫోకస్ పెట్టి..కరువు ప్రాంతంగా పేరున్న సీమలో పచ్చని పంటలు పండేలా చేయాలని భావిస్తున్నారట. గతేడాది గోదావరి, కృష్ణా నదీ జలాలు దాదాపు 6వేల టీఎంసీలు సముద్రంలో వృథాగా కలిసిపోయాయని..ఏపీ ప్రజలు అందులో 350 టీఎంసీలు మాత్రమే వాడుకోగలిగారని అంటున్నారు చంద్రబాబు. సముద్రంలో కలిసే నీళ్లు వ్యవసాయానికి ఇతర అవసరాలకు వాడుకుంటే రాయలసీమ రతనాల సీమగా మారుతుందని..ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పుకొస్తున్నారుఇదంతా ఎందుకు అంటే వైసీపీని రాజకీయంగా నిలువరించడానికేనన్న చర్చ జరుగుతోంది. రాయలసీమలో టీడీపీ బలానికి తోడు జనసేన కూడా తోడైతే మరోసారి సీమలో ఎదురు ఉండదని ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారని అంటున్నారు. అంతేకాదు వైసీపీని దెబ్బ తీయాలంటే అక్కడ పవన్ దూకుడు అవసరమని చంద్రబాబు భావిస్తున్నారట.ఇక గోదావరి జిల్లాలతో పాటు ఉత్తరాంధ్ర, కృష్ణా గుంటూరు జిల్లాల్లో తమకు రాజకీయ ఆధిపత్యం ఉందని భావిస్తోంది కూటమి. అందుకే వైసీపీకి హార్డ్ కోర్ రీజియన్‌గా ఉన్న రాయలసీమలోనే పాగా వేస్తే.. వైసీపీ ప్రభావం మిగిలిన ప్రాంతాల మీద పడకుండా ఉంటుందని ముందస్తు వ్యూహాలను అమలు చేస్తున్నారట టీడీపీ అధినేత. చంద్రబాబు, పవన్ వ్యూహాలు ఎంత వరకు ఫలిస్తాయి.. రాయలసీమలో వైసీపీని తిరిగి పుంజుకోకుండా చేయడంలో కూటమి సక్సెస్ అవుతుందా లేదా అనేది వేచి చూడాలి మరి.

# మళ్లీ పడిపోయిన యూరప్ జీడీపీ




**న్యూఢిల్లీ, జనవరి 16, పెన్ పవర్:** జర్మనీ ఆర్థిక వ్యవస్థ బాహ్య షాక్‌లు, దేశీయ సమస్యలతో బాధపడుతోంది. వీటిలో రెడ్ టేప్, నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత ఉన్నాయి. దీనిని ఎలా పరిష్కరించాలో రాజకీయ నాయకులు పలుపలు విధాలుగా ఆలోచిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను ఎలా పునరుద్ధరించాలనే దానిపై భిన్నాభిప్రాయాల మధ్య తన ఆర్థిక మంత్రిని తొలగించిన తర్వాత ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్ మూడు పార్టీల సంకీర్ణ ప్రభుత్వం నవంబర్‌లో కూలిపోయింది జర్మనీ ఆర్థిక వ్యవస్థ వరుసగా రెండవ సంవత్సరం క్షీణించింది. బుధవారం విడుదల చేసిన ప్రాథమిక అధికారిక డేటా నుండి ఈ సమాచారం అందింది. ఆర్థిక వ్యవస్థ ప్రధాన సమస్యగా ఉన్న జర్మనీ ఎన్నికలకు కొన్ని వారాల ముందు ఈ గణాంకాలు విడుదలయ్యాయి. జర్మనీ ఆర్థిక వ్యవస్థ ఐరోపాలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. 2023లో తగ్గుదల తర్వాత జర్మనీ స్థూల దేశీయోత్పత్తి (ఉఆఖ) గత సంవత్సరం 0.2 శాతం తగ్గిందని ఫెడరల్ స్టాటిస్టికల్ ఆఫీస్ తెలిపింది.జర్మనీ ఆర్థిక వ్యవస్థ బాహ్య షాక్‌లు, దేశీయ సమస్యలతో బాధపడుతోంది. వీటిలో రెడ్ టేప్, నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత ఉన్నాయి. దీనిని ఎలా పరిష్కరించాలో రాజకీయ నాయకులు పలుపలు విధాలుగా ఆలోచిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను ఎలా పునరుద్ధరించాలనే దానిపై భిన్నాభిప్రాయాల మధ్య తన ఆర్థిక మంత్రిని తొలగించిన తర్వాత ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్ మూడు పార్టీల సంకీర్ణ ప్రభుత్వం నవంబర్‌లో కూలిపోయింది. దీని కారణంగా, ఫిబ్రవరి 23న షెడ్యూల్ కంటే ముందుగానే ఎన్నికలు జరుగుతాయి. తదుపరి ప్రభుత్వానికి నాయకత్వం వహించే పోటీదారులు ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి విరుద్ధమైన ప్రతిపాదనలను ముందుకు తెచ్చారు.

**జర్మనీ ఆర్థిక వ్యవస్థ ఎందుకు సంక్షోభంలో ఉంది?**

యూరప్‌లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన జర్మనీ ఈ రోజుల్లో ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొంటోంది. దీనికి ప్రధాన కారణాలు ప్రపంచ ఆర్థిక మందగమనం, ఇంధన సంక్షోభం, అంతర్గత నిర్మాణ సమస్యలు.

ఇంధన సంక్షోభం: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత సహజ వాయువు సరఫరాలు తగ్గాయి. ఇంధన ధరలు పెరగడం వల్ల పరిశ్రమల ఉత్పత్తి ఖర్చులు పెరిగాయి, వాటి పోటీతత్వం తగ్గింది.

ప్రపంచ డిమాండ్ తగ్గుదల: జర్మనీ ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా ఎగుమతులపై ఆధారపడి ఉంది. కానీ ప్రపంచ మందగమనం, చైనా వంటి ప్రధాన మార్కెట్లలో తక్కువ డిమాండ్ కారణంగా ఆటోమొబైల్, యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ రంగాలు ప్రభావితమయ్యాయి.

సరఫరా గొలుసు సమస్యలు: ఊఎఐఆ-19 మహమ్మారి నుండి ముడి పదార్థాల సరఫరాలో జాప్యం, పెరుగుతున్న ఖర్చులు పరిశ్రమలను దెబ్బతీశాయి.

జనాభా సంక్షోభం: వేగంగా వృద్ధాప్యం చెందుతున్న జనాభా శ్రమశక్తిని తగ్గిస్తోంది. కొత్త తరం కొరత, పెరుగుతున్న సామాజిక సంక్షేమ వ్యయం ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచాయి.

ద్రవ్యోల్బణం, వినియోగదారుల వ్యయం తగ్గుదల: ఇంధనం, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వినియోగదారుల డిమాండ్‌ను బలహీనపరిచింది.

దీనికి పరిష్కార మార్గాలు: జర్మనీ తన ఇంధన వనరులను వైవిధ్యపరచాలి, పునరుత్పాదక ఇంధనంలో పెట్టుబడులను పెంచాలి. కొత్త సాంకేతికతలు, నైపుణ్య అభివృద్ధిపై దృష్టి పెట్టడం ద్వారా పరిశ్రమలను బలోపేతం చేయవచ్చు. అలాగే, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాల్సి ఉంటుంది. అంతర్గత డిమాండ్‌ను పెంచాల్సి ఉంటుంది...ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి, ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగించడానికి జర్మనీ ఆర్థిక వ్యవస్థకు దీర్ఘకాలిక సంస్కరణలు అవసరం.

# కాలిఫోర్నియాలో కార్చిచ్చు...




**న్యూఢిల్లీ, జనవరి16, పెన్ పవర్:** దక్షిణ కాలిఫోర్నియా అడవుల్లో చెలరేగిన కార్చిచ్చు ప్రపంచం మొత్తాన్ని కదిలించింది. రోజులు గడిచేకొద్దీ నష్టం పరిధి కూడా పెరుగుతోంది. అక్యూవెదర్ నివేదిక ప్రకారం.. ఈ అగ్నిప్రమాదం వల్ల జరిగిన నష్టం 250 నుండి 275 బిలియన్ డాలర్ల మధ్య ఉండవచ్చు. ఈ సంఖ్య చాలా పెద్దది. భారతదేశంలోని 5 మంది ధనవంతులైన బిలియనీర్ల సంపద కూడా ఇందులో ఉంది. ఇందులో ఆసియాలోని ఇద్దరు ధనవంతులైన వ్యాపారవేత్తలు గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీల పేర్లు కూడా ఉన్నాయి. కాలిఫోర్నియా అగ్నిప్రమాదం వల్ల ఎంత నష్టం జరిగి ఉంటుందో ఇప్పటికే మీకు అర్థం అయి ఉంటుంది. అక్యూవెదర్ తన నివేదికలో ఎలాంటి డేటాను సమర్పించిందో తెలుసుకుందాం..

దక్షిణ కాలిఫోర్నియాలో మంటలు చెలరేగుతూనే ఉండటంతో అక్కడ సంభవించే నష్టం కూడా పెరుగుతోంది. అక్యూవెదర్ దాని మునుపటి నష్ట అంచనాను 250 బిలియన్ డాలర్ల నుంచి 275 బిలియన్ డాలర్ల మధ్యకు అప్ డేట్ చేసింది. గాలి చాలా వేగంగా వీస్తోందని, దీని కారణంగా మంటల వేగం, దాని ప్రభావం నిరంతరం పెరుగుతోందని అక్యూవెదర్ ప్రధాన వాతావరణ శాస్త్రవేత్త జోనాథన్ పోర్టర్ అన్నారు. ఇది ఆధునిక అమెరికా చరిత్రలో అత్యంత ఖరీదైన అగ్ని ప్రమాదాలలో ఒకటి. ఈ అగ్నిప్రమాదం లక్షలాది డాలర్ల విలువైన ఇళ్లను తగలబెట్టింది. దీని కారణంగా వెలువడుతున్న నష్టాల అంచనా గణాంకాలు చాలాగ్రాభ్రాంతికరంగా ఉన్నాయి.కాలిఫోర్నియాలోని లాస్ ఏంజిల్స్‌లోని శాంటా మోనికా నుండి మాలిబు వరకు ఉన్న ప్రాంతంలో మంటలు మండుతున్నాయని పోర్టర్ చెప్పారు. ఇది దేశంలోని అత్యంత ఖరీదైన రియల్ ఎస్టేట్‌లలో కొన్నింటిని ప్రభావితం చేసింది. వాటి సగటు ధర 200 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ. రాబోయే రోజుల్లో జరిగే ఆర్థిక నష్టాలను బట్టి చూస్తే, ఇది కాలిఫోర్నియా చరిత్రలో అత్యంత దారుణమైన కార్చిచ్చుగా మారవచ్చు.కాలిఫోర్నియా అగ్నిప్రమాదానికి ముందు, ఇతర ప్రాంతాలలో కూడా అగ్నిప్రమాదాలు సంభవించాయి. బిలియన్ డాలర్ల విలువైన నష్టాలు కనిపించిన చోట. ఈ అగ్నిప్రమాదం వల్ల జరిగిన నష్టం గతంలో జరిగిన ప్రమాదాల వల్ల జరిగిన నష్టాన్ని చాలా ఎక్కువగా ఉంది. 2023 సంవత్సరంలో హవాయిలోని మౌయి ద్వీపం అడవుల్లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ అగ్నిప్రమాదం వల్ల 13 బిలియన్ డాలర్ల నుండి 16 బిలియన్ డాలర్ల విలువైన నష్టం వాటిల్లింది. గత సంవత్సరం, 2024లో హెలెన్ హరికేన్ తర్వాత ఆర్థిక నష్టం 225 నుండి 250 బిలియన్ డాలర్లుగా అంచనా వేయబడింది. కాలిఫోర్నియా కార్చిచ్చు వల్ల కలిగిన నష్టాలు ఆ సంఖ్యను మించిపోయాయి.ప్రత్యేకత ఏమిటంటే కాలిఫోర్నియా అగ్నిప్రమాదం వల్ల కలిగిన నష్టం భారతదేశంలోని ఐదుగురు బిలియనీర్ల సంపదకు సమానం. ఆసియాలోని అగ్రశ్రేణి బిలియనీర్లు గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీల పేర్లు కూడా ఇందులో ఉన్నాయి. ఈ ఇద్దరితో పాటు హెచ్‌సిఎల్ టెక్ వ్యవస్థాపకుడు శివ్ నాడార్, షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌కు చెందిన షాపూర్ మిస్త్రీ, విప్రో వ్యవస్థాపకుడు అజీమ్ ప్రేమ్‌జీ పేర్లు కూడా ఉన్నాయి. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం, ఈ ఐదుగురి మొత్తం నికర విలువ 268.5 బిలియన్ డాలర్లు, కాలిఫోర్నియా అగ్నిప్రమాదం వల్ల జరిగిన నష్టం 250 బిలియన్ల నుండి 275 బిలియన్ డాలర్ల మధ్య ఉంటుందని అంచనా.బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ తాజా డేటా ప్రకారం.. ఆసియాలో అత్యంత ధనవంతుడైన వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ సంపద 90.2 బిలియన్ డాలర్లు. ఆసియాలో రెండవ అత్యంత ధనవంతుడైన వ్యాపారవేత్త గౌతమ్ అదానీ మొత్తం నికర విలువ 66 బిలియన్ డాలర్లు. భారతదేశంలో మూడవ అత్యంత ధనవంతుడైన వ్యాపారవేత్త శివ్ నాడార్ మొత్తం నికర విలువ 44 బిలియన్ డాలర్లు. కాగా, షాపూర్ మిస్త్రీ సంపద 38.5 బిలియన్ డాలర్లు. విప్రో వ్యవస్థాపకుడు అజీమ్ ప్రేమ్‌జీ నికర విలువ 29.8 బిలియన్ డాలర్లు

# టీడీపీ- జనసేన మధ్య విభేదాలు ఉన్నాయా

**విజయవాడ, జనవరి 16 పెన్ పవర్:** దేశంలో వన్ నేషన్ – వన్ ఎలక్షన్ గురించి చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రా రాజకీయాలు ఊహించని టర్న్ తీసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇంకా ఏడాది కూడా కాలేదు. అప్పుడే చీలిక వచ్చే ప్రమాదం ఉందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అందుకు కారణం గతంలో, తాజాగా పరిణామాలపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలేననే చర్చ జరుగుతోంది.



1.ఈనెల 8న తిరుపతిలో తొక్కిసలాట జరిగింది. ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈఘటనపై టీడీపీ చీఫ్, ముఖ్యమంత్రి చంద్రబాబు దూకుడు వైఖరిని ప్రదర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం టోకెన్ వ్యవస్థను ప్రవేశపెట్టిందని ఆరోపించారు. తొక్కిసలాట జరగడానికి కారణం ఇదేనని వ్యాఖ్యానించారు. కానీ.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇందుకు విరుద్ధంగా స్పందించారు. ఈ విషాదానికి కారణమైన వారు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

2.ఈ ఘటనపై ఆరాతీసిన ప్రభుత్వం.. అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఘటన జరిగినప్పుడు పర్యవేక్షించిన డీఎస్పీ రమణ కుమార్, టీటీడీ శ్రీ వెంకటేశ్వర గోసంరక్షణశాల డైరెక్టర్ కె.హరనాథ్ రెడ్డి ఇద్దరినీ సస్పెండ్ చేసింది. ఆ తర్వాత కూడా మరికొందరు అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఇక్కడితో వివాదం ముగిసిందని అంతా అనుకున్నారు.

3.గతేడాది సెప్టెంబర్‌లో తిరుపతి లడ్డూ వివాదం జరిగింది, ఈ వివాదంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వును 'స్వచ్ఛమైన' నెయ్యితో కలపడానికి అనుమతించారని టీడీపీ, జనసేన ఆరోపించాయి. కచ్చితమైన ఆధారాలు లేనప్పటికీ.. పవన్ కళ్యాణ్ కాషాయ వస్త్రాలు ధరించి 11 రోజుల దీక్ష చేశారు. సనాతన ధర్మాన్ని అణగదొక్కడానికి జగన్, నకిలీ లౌకిక శక్తులు కుట్ర పన్నాయని ఆరోపించారు.

4. తాజాగా తన సొంత నియోజకవర్గం పిఠాపురంలో జరిగిన ఒక కార్యక్రమంలో కళ్యాణ్ మాట్లాడుతూ.. తొక్కిసలాట ఘటనకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే.. దేవాదాయ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి సహా వేరే ఇతర టీడీపీ నాయకుల నుండి ఇలాంటి డిమాండ్లు రాలేదు.

5.కళ్యాణ్ డిమాండ్ గురించి అడిగినప్పుడు.. టీటీడీ ఛైర్మన్.. క్షమాపణ చెప్పడం వల్ల చనిపోయినవారు తిరిగి రారు. తాము బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాము.. ఎవరో క్షమాపణ కోరారని తాను క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అసలు వివాదం ఇక్కడే మొదలైంది.

6.బీఆర్ నాయుడు క్షమాపణ చెప్పడానికి నిరాకరించడంతో.. జనసేన, బీజేపీ, సంఘ్ పరివార్ – టీడీపీ మద్దతుదారుల మధ్య సోషల్ మీడియా యుద్ధం మొదలైంది. ఇది పెద్ద వివాదంగా మారకముందే.. టీడీపీ జాగ్రత్త పడింది. పవన్ డిమాండ్ చేసిన రెండు రోజుల తర్వాత.. బీఆర్ నాయుడు క్షమాపణలు చెప్పారు. ఆయన గతంలో ధిక్కార వైఖరిని ప్రదర్శించినప్పటికీ.. ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు రావడంతో క్షమాపణలు చెప్పారని ప్రచారం జరుగుతోంది.

7.ఈ మొత్తం ఎపిసోడ్‌లో పవన్ కళ్యాణ్ రాజకీయ విజేత అనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి నిందను పవన్ కళ్యాణ్ తెలుగుదేశం పార్టీపై విజయవంతంగా మోపారనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.

8.పవన్ కళ్యాణ్ ఇలాంటి వ్యూహాన్ని అనుసరించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో మహిళలపై పెరుగుతున్న నేరాలపై స్పందిస్తూ.. డీజీపీ, హోంమంత్రిని విమర్శించారు. బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత హోంమంత్రి తన విధులను సమర్థవంతంగా నిర్వహించలేకపోతే.. తాను హోం మంత్రిత్వ శాఖను చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు.

9.సానుకూల పరిణామాలను పవన్ తన ఖాతాలో వేసుకుంటూ.. లోపాలను సమర్థవంతంగా టీడీపీ ఖాతాలోకి నెట్టేస్తున్నారనే రాజకీయ అభిప్రాయాయలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే సమయంలో.. సనాతన ధర్మ రక్షకుడిగా పవన్ తనకు తాను ప్రాజెక్ట్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అటు బీజేపీ, ఇటు సంఘ్ పరివార్ పవన్‌కు సపోర్ట్‌గా నిలుస్తున్నాయనే అభిప్రాయాలు ఉన్నాయి.

10.తాజా పరిణామాలతో తెలుగుదేశం పార్టీలో ఆందోళన మొదలైందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో హిందూ ఓట్ల ఏకీకరకణ, పవన్ కళ్యాణ్, బీజేపీ ప్రభావం పెరగడం ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ పరిణామాలు భవిష్యత్తులో లోకేష్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో.. ఓ ప్రముఖ మీడియాలో 'ఉప ముఖ్యమంత్రి' సాంకేతికంగా రాజ్యాంగబద్ధమైన పదవి కాదని, కళ్యాణ్ మంత్రివర్గంలోని ఇతర మంత్రుల మాదిరిగానే ఉంటారనే కథనం వచ్చింది. దీనిపైనా జనసైనికులు గుర్రుగా ఉన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో జనసేన వర్సెస్ టీడీపీ ఫైట్ జరుగుతుంటే.. జనసేనకు బీజేపీ, సంఘ్ పరివార్ మద్దతు ఇస్తున్నాయి. ఇందుకే కూటమిలో చీలిక వచ్చిందనే ప్రచారం జరుగుతోంది.

# ఐదు నెలల నుంచి జీతాల్లేవ్

**విశాఖపట్టణం, జనవరి 16, పెన్ పవర్:** ప్రతిష్ఠాత్మక వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు.. పండగ పూట కూడా పస్తులే ఉంటున్నారు. ఐదు నెలలుగా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వటం లేదు. దీంతో ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. జీతాలు లేకపోతే పండగ ఎలా చేసుకోవాలంటూ.. కార్మికులు ప్రశ్నిస్తున్నారు.వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో 9,460 మంది శాశ్వత అధికారులు, ఉద్యోగులు, 12 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల? ఉన్నారు. వీరికి గత కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వటం లేదు. సెప్టెంబర్‌లో 50 శాతం, అక్టోబర్ 25 శాతం, నవంబర్‌లో 25 శాతం, డిసెంబర్‌లో 35 శాతం మాత్రమే ఇచ్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు నాలుగైదు నెలల నుంచి పూర్తిస్థాయి జీతాలు ఇవ్వటం లేదు. హెఆర్ఏ, ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, దసరా, దీపావళి బోనస్‌ను పూర్తిగా ఆపేశారు. వేతన సవరణ జరగలేదు.కార్మికులను సాగనంపేందుకు యాజమాన్యం కుట్రకు తెరతీసింది. కార్మికులను సాగనంపేందుకు సిద్ధమైంది. వీఆర్ఎస్ పథకం అమలుకు ఆర్ఐఎన్ఎల్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ నోటిఫికేషన్‌లో 45 ఏళ్ల వయసు, 15 ఏళ్ల సర్వీస్ పూర్తి అయిన వారు వీఆర్ఎస్ దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. తద్వారా 2025 మార్చిలోపు వెయ్యి మందిని బయటకు పంపేందుకు యాజమాన్యం సిద్ధమైంది. గత ఐదేళ్ల నుంచి ప్రతి ఏడాది 1000 నుంచి 1,100 మంది ఉద్యోగులు రిటైర్ అవుతున్నారు. వారిస్థానంలో నియామకాలు జరగటం లేదని సీఐటీయూ నేత కేఎం శ్రీనివాస్ వివరించారు. జీతాల కోత విధింపు, ఉద్యోగులకు జీతాల కోత వంటి చర్యలతో కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు.మరోవైపు బలవంతగా వీఆర్ఎస్‌కు పంపిస్తున్నారు. ఇప్పటికి ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని విశాఖ ఉక్కు కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. జీతాలు లేకపోతే పండగ ఎలా చేసుకోవాలంటూ కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఈ దౌర్భాగ్య పరిస్థితికి కేంద్రంలోని ఎన్డీఏ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలే కారణమని ఆరోపిస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్-ఆర్ఐఎన్ఎల్)ను ప్రైవేటీకరణ చేసేందుకు మొగ్గు చూపుతోంది. ఇప్పటికే కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో చర్యలకు పూనుకుంటుంది. అందులో భాగంగానే స్టీల్‌ప్లాంట్‌లోని ఒక్కో భాగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధపడింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోని వంద శాతం పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి ప్రకటన వెలువడిన తరువాత ఒక్కొక్క చర్యలు చేపట్టిందిఇప్పటికే దాదాపు 2,000 మంది ఉద్యోగులను ఛత్తీస్‌గఢ్‌లోని నాగర్నర్ స్టీల్‌ప్లాంట్‌కు పంపడానికి సిద్ధపడింది. అలాగే 4,200 మంది స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్‌ను తొలగించేందుకు వారికి ఎంట్రీ, ఎగ్జిట్ పాస్‌లను ఇవ్వకుండా కుట్రలు చేసింది. కార్మికులు పోరాటంతో యాజమాన్యం వెనక్కి తగ్గింది. అలాగే బ్లాస్ ఫర్నేస్‌ను నిలిపివేసింది. ఆక్సిజన్ ప్లాంట్‌ను నిలిపివేసింది. మళ్లీ కార్మికుల ఆందోళనతో వెనక్కి తగ్గింది. ఇలాంటి కుట్రలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిపై ప్రభావం చూపే విధంగా యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం చర్యలకు పూనుకున్నాయి.తాజాగా స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఒక యూనిట్‌ను ప్రైవేట్ పరం చేసేందుకు రంగం సిద్ధం అయ్యింది. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఫైర్ స్టేషన్ నడిపే బాధ్యతను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబందించి వైజాగ్ స్టీల్ యాజమాన్యం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈవోఐ)కు దరఖాస్తులు ఆహ్వానించింది. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఆర్ఎంహెచ్‌పీ, సింటర్ ప్లాంట్, కోక్ ఓవెన్స్, స్టీల్‌మెల్ట్ షాప్, బ్లాస్ట్‌ఫర్నేస్, రోలింగ్ మిల్స్, ఎయిర్ సెపరేషన్ ప్లాంట్, సీఆర్ఎంపీ, థర్మల్ పవర్ ప్లాంట్, ఎల్‌పీజీ స్టోరేజ్ ట్యాంక్‌లు, వాటర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్, గ్యాస్ హోల్డర్లు, ఎనర్జీ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్, స్టీల్‌ప్లాంట్‌లోని ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ తదితర కీలకమైన విభాగాల్లో ఫైర్ స్టేషన్ సేవలు అందిస్తుంది.వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కానివ్వబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశారు. కానీ ఇప్పుడు ఒక్కొక్కటి ప్రైవేట్ పరం అవుతుంటే కనీసం స్పందించడం లేదు. మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కానీ ఆయన కూడా మౌనం దాల్చడంపై స్టీల్‌ప్లాంట్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎంపీ భరత్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పందించడం లేదు. అలాగే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు కోరిన రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రి అయిన తరువాత.. స్టీల్‌ప్లాంట్ గురించి కనీసం పట్టించుకోవడం లేదని కార్మికులు విమర్శిస్తున్నారు.

# వైసీపీ గూటికి శైలజానాథ్



**అనంతపురం, జనవరి 16, పెన్ పవర్:** అనంతపురం జిల్లాలో సింగనమల ఎస్సీ నియో జకవర్గానికి ఒక సెంటిమెంట్ ఉంది. ఇక్కడ ఎవరు గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందని సెంటిమెంట్. గత 30 సంవత్సరాలుగా అదే సెంటిమెంట్ వర్క్ అవుట్ అవుతూ వస్తోంది. కాంగ్రెస్ అధికారంలో ఉండగా శైలజనాథ్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహించారు. తర్వాత టిడిపి నుంచి శమంతకమణి, ఆమె కుమార్తె యామిని బాల మంత్రులుగా , ఎంఎల్ఏలుగా ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత 2019లో వైసీపీ నుంచి జొన్నలగడ్డ పద్మావతి ఎమ్మెల్యేగా గెలిచిన 2024 ఎన్నికల్లో మాత్రం జొన్నలగడ్డ పద్మావతికి వైసిపి టికెట్ దక్కలేదు. తెలుగుదేశం పార్టీ నుంచి బండారు శ్రావణి 2024 ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైసీపీ తరపున జొన్నలగడ్డ పద్మావతి స్థానంలో వీరంజానేయులు అనే టిప్పర్ డ్రైవర్‌నీ వైసిపి బరిలోకి దింపింది. దీంతో అక్కడ వైసిపి ఓటమి చవి చూసింది. ఓటమి అనంతరం సింగనమల అసెంబ్లీ సమన్వయకర్తగా వీరాంజనేయులు నియమించింది వైసీపీ అధిష్టానం. కానీ పైకి మాత్రమే వీరాంజనేయులు పేరు కానీ నియోజక వర్గంలో మాత్రం మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త వైసీపీ నాయకుడు ఆలూరు సాంబశివ రెడ్డిదే హవా కొనసాగుతుందని వైసీపీ నేతలే బహిరంగంగా వ్యాఖ్యలు చేశారు.

ఇప్పుడు మరోసారి సెంటిమెంట్ సెగ్మెంట్‌లో మార్పులకు వైసిపి సిద్ధమౌతోంది అని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. వైసిపి సింగనమల నియోజకవర్గం ఇన్చార్జిగా వీరాంజనేయులు కొనసాగుతున్నా ఆయనకు పెద్దగా ఎక్కడ సపోర్ట్ లేదు. దీంతో ఆయన ఉన్న లేనట్టే అని వైసిపి అధిష్టానం భావిస్తూండడంతో ఇక వేరే వ్యక్తి కోసం వెతుకులాట ప్రారంభించింది. ఇదిలా ఉంటే, శైలజానాథ్ వైసీపీలోకి వచ్చే అవకాశం ఉందని మరో ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా అనంతపురం జిల్లా సింగనమలలో జరుగుతున్న మార్పులతో శైలజానాథ్ వైసీపీలోకి రానున్నారని టాక్ నడుసోతంది. దీనిపై చర్చలు జరుగుతున్నాయట. 2019లో పద్మావతి అదే స్థానంలో గెలిచింది. 2024లో పద్మావతిపై పోటీ చేసేందుకు బలమైన అభ్యర్థిని వెతుక్కోవాలని చంద్రబాబు భావించడంతో చాలా మంది శైలజానాథ్‌ను తలచుకున్నారు. శైలజానాథ్‌ను తమ పార్టీలో చేర్చుకుని ఎన్నికల్లో పోటీ చేసేలా పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరిగాయి. దానికి బదులు చంద్రబాబు శ్రావణిని ఎంపిక చేశారు. వైసీపీ జొన్నలగడ్డ పద్మావతికి బదులు వీరాంజనేయులు అనే టిప్పర్ ట్రక్ డ్రైవర్‌ను ఎంచుకుంది. కానీ ఎన్నికల్లో ఓడిపోయారు. ఇప్పుడు సింగనమలలో వైసీపీకి కొత్త నాయకుడు కావాలి కాబట్టి జగన్ మళ్లీ శైలజానాథ్‌ను పరిశీలిస్తున్నారు. రాజశేఖర్ రెడ్డి ప్రోత్సహించిన కారణంగానే సాకే శైలజానాథ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. తొలిసారిగా 2004లో ఎమ్మెల్యే పోటీ చేసి గెలిచారు. 2009లో మళ్లీ గెలుపొందారు. కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో కూడా పని చేశారు. 2014లో శైలజానాథ్ తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేస్తారని జోరుగా ప్రచారం సాగింది. కానీ అప్పటికే అక్కడ తెలుగుదేశం పార్టీలో మాజీ మంత్రి శమంతకమణి కూతురు యామిని బాలకు టికెట్ కేటాయించారు. దీంతో శైలజనాథ్ కొద్దిరోజులుగా సైలెంట్ అయ్యారు. మరోసారి ఎంపీగా ఉన్న జెసి దివాకర్ రెడ్డి ఒకరోజు శైలజనాథ్ ఇంటికి వెళ్లి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించినట్లు అప్పట్లో ప్రచారం సాగింది అయితే 2019 ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి పోటీ చేస్తారని గట్టిగా వినపడింది. ఆ టైంలో కూడా శైలజానాథ్‌కు టికెట్ రాలేదు. ఆ స్థానంలో బండారు శ్రావణికి చంద్రబాబు టికెట్ కేటాయించారు. దీంతో శైలజనాథ్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ ఉన్నారు. వైసీపీలో చేరికపై శైలజానాథ్ కూడా సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తొంది. శైలజానాథ్ కుమారుడుకి మరో స్థానం అడుగుతున్నట్టు ప్రచారం. ఈ సారి నియోజకవర్గాలు పెంచే అవకాశం ఉండడంతో శైలజానాథ్ తన కుమారుడు రిత్విక్‌కి ఒకస్థానం అడుగుతున్నారు అని టాక్ వినపడుతుంది. అందుకు తగ్గట్టు శైలజానాథ్ కుమారుడు కూడా వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. దీంతో ఈసారి శైలజానాథ్ కుమారుడిని రాజకీయ రంగంలోకి దింపుతాడని కన్ఫర్మ్ అయినట్టు సమాచారం. చూడాలి మరి సెంటిమెంట్ సెగ్మెంట్‌లో ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటాయో.

## భారీగా మద్యం అమ్మకాలు..?




**భీమవరం, జనవరి 16 పెన్ పవర్:** రాష్ట్రంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతున్న వేళ కోడి పందేలు, పేకాట, గుండాట వంటి జూద క్రీడల్లో కోట్లు చేతులు మారుతున్నాయి. డబ్బులు వచ్చిన వారు ఆనందంతో ఇళ్లకు వెళ్తున్నారు. డబ్బులు పోయినవారు దుఃఖంతో ఇంటికి వెళ్తున్నారు. భోగి రోజున ప్రారంభమైన కోడి పందేలు, పేకాట, గుండాట రాత్రి పగలు తేడా లేకుండా నిరాటంకంగా కొనసాగుతోన్నాయి. అక్కడే భోజనం, మందు, నీళ్లు, ఇతర తినిబండరాళ్లు స్టాల్స్ పెట్టి అమ్మడంతో పందె రాయుళ్లు, జూద క్రీడలు ఆడేవారు అక్కడ నుంచి వెళ్లటం లేదు.ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం లాటరీ పద్ధతిలో మద్యం షాపులను కేటాయించింది. దీంతో రాష్ట్రంలోని విచ్చల విడిగా బెల్ట్‌షాప్‌లు పుట్టుకొచ్చాయి. ఈ సంక్రాంతి వేళ కొత్తగా సంతలో స్టాల్స్ మాదిగా మద్యం స్టాల్స్ వచ్చాయి. కోడి పందేలు జరుగుతున్న ప్రాంతాల్లో స్టాల్స్ పెట్టి మరి అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. దీంతో రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం ఏరులై పారుతోంది. స్టాల్స్ పెట్టి మద్యం అమ్మేవారికి స్థానిక అధికార పార్టీ నేతలు అండదండలు ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి. పైగా కోడి పందేల బరుల నిర్వహకులు కూడా వీరికి మద్దతుగా నిలవడంతో ఎవరు ఏమీ అనడం లేదు. ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా వారి జోలికి పోవటం లేదన్న వార్తలు వినిపిస్తున్నాయి.కోడి పందేల బరుల వద్ద భారీగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని దేవిపట్నం మండలంలోని ఎం.రావిలంక గ్రామ శివార్లలో మామిడ తోట వద్ద జోరుగా కోడి పందేలు, నంబర్ గుండాట జరుగుతోంది. అక్కడ కోడి పందేలు ప్రాంగణంలో విచ్చల విడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్స్ తరహాలోనే మద్యం సీసాలు పెట్టి అమ్మకాలు నిర్వహిస్తున్నారు. బహిరంగంగా మద్యం అమ్మే వారిలో మహిళలు కూడా ఉన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అక్రమంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి.ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఒక్క భోగి రోజే అధికారిక లెక్కల ప్రకారం రూ.28.40 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఇంకా సంక్రాంతి, కనుమ రోజుల లెక్కలు చూస్తే? మరింత పెరుగుతుంది. కాకినాడ జిల్లాలో రూ.11.25 కోట్లు, కోనసీమ జిల్లాలో రూ.7 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో రూ.10.15 కోట్ల మద్యాన్ని ఆయా జిల్లాల్లోని ఉన్న దుకాణాలు కొనుగోలు చేశాయి.గతేడాది భోగి రోజు రూ.12.60 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. అంటే గతేడాది కంటే ఈసారి రూ.15.80 కోట్లు అమ్మకాలు జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఇదంతా డిస్టలరీల స్టోర్లు విక్రయించిన లెక్కల ప్రకారమే. అయితే అక్రమంగా మద్యం ఏరులై పారడంతో ఈ లెక్క మారుతుంది. మద్యం ఒక్కటే కాదు సారా కూడా పెద్ద ఎత్తున అమ్మకాలు జరిగాయి?!

## కనిపించని ప్రతిపక్షం

**గుంటూరు, జనవరి 16, పెన్ పవర్:** ఏ అవకాశం వచ్చినా అంది పుచ్చుకోవాలి. అదే రాజకీయం. చంద్రబాబు ను చూసైనా నేర్చుకుంటారా? అంటే అదీ లేదు. ఎందుకంటే నాలభై ఐదేళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నుంచి నేటి తరం రాజకీయ నేతలు, పార్టీ అగ్రనేతలు ఎన్నో నేర్చుకోవాలి. చంద్రబాబు వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారు. దేనినీ వదలిపెట్టరు. ఎటూ ఆయనకు మీడియా మద్దతు ఉంది కాబట్టి ఇక తాను అనుకున్నది చేసుకుని ముందుకు వెళతారు. ప్రజల్లో ఒకరకమైన వ్యతిరేకతను ప్రభుత్వంపై తేవడంలో చంద్రబాబును మించిన వారు మరొకరు లేరు. గతంలో ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు చేసిన సమరాన్ని చూసి కూడా నేడు వైసీపీ నేతలు నేర్చుకోలేకపోతున్నారు. చంద్రబాబు నాయుడు వచ్చిన ఏ అవకాశాన్ని జారవిడుచుకోరు. గతంలో సంక్రాంతి వచ్చిందటే చాలు.. భోగి నాడు నాటి ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ పండగ చేసుకునే వారు. ప్రభుత్వ ఉత్తర్వులను అందులో దహనం చేసేవారు. ఒక ఏడాది మూడు రాజధానుల ఉత్తర్వులు.. మరొక ఏడాది చెత్త పన్ను ఉత్తర్వులు.. ఇంకొక ఏడాది విద్యుత్తు బిల్లులు.. మరో ఏడాది నాసిరకం మద్యం ఇలా ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ వెళ్లేవారు. ఇక చివర ఏడాది ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కు సంబంధించిన ఉత్తర్వులను కూడా భోగిమంటల్లో వేసి దగ్ధం చేసి మరీ ప్రజలకు చేరువయ్యారు. అందుకే ఆయనను ప్రజలు ఆదరించారు. సంక్రాంతి నాడు సెంటిమెంట్ ను పట్టించుకోకుండా కేవలం పొలిటికల్ ఆయింట్ మెంట్ ను పూసి మరీ ఆయన జనంలోకి చొచ్చుకెళ్లారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. వైసీపీ ప్రతిపక్షంలో ఉంది. కానీ సంక్రాంతి నాడు చేసింది శూన్యం. ఎవరింట్లో వారు నేతలు పండగ చేసుకున్నారు తప్పించి జనంలోకి వచ్చి సమస్యలను ప్రస్తావన తేలేకపోయారు. ఇది పూర్తిగా జగన్ వైఫల్యంగానే చూడాలి. ఎందుకంటే కనీసం గతంలో చంద్రబాబును చూసైనా జగన్ నేర్చుకోలేదనిపిస్తుంది. అలాగే జగన్ కు చెప్పేవారు కూడా ఎవరూ లేరనే అనిపిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేదు. అలాగే విద్యుత్తు బిల్లులను పెంచారు. కానీ జగన్ పార్టీ మాత్రం భోగి మంటలు చేసుకుంది. కానీ పిడకలు వేసి కానిచ్చేసింది. ఇలా ఉంటే ఇక జనంలోకి ఎలా వెళతారు సామీ అని సొంత పార్టీ క్యాడర్ ప్రశ్నిస్తుంది. అంది వచ్చిన అవకాశాన్ని చేజార్చుకోవడంలో జగన్ కు మించిన వారు మరొకరు లేరంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## చిరంజీవిపై కమలం గురి...

**విజయవాడ, జనవరి 16, పెన్ పవర్:** మెగాస్టార్ చిరంజీవి ప్రజారాజ్యంపార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసిన తర్వాత ఆ పార్టీ నాయకుడిగా మారారు. కానీ చివరికి రాజకీయాలపై అసంతృప్తితో వైదొలిగారు . తన రాజ్యసభ సభ్యత్వం ఇంకా రెండేళ్లు ఉన్నప్పటికీ ఆయన సభాసమావేశాలకు కూడా హాజరు కాలేదు. తాను ప్రత్యక్ష రాజకీయాలకు దూరమని ప్రకటించారు. సోదరుడు పవన్ కల్యాణ్‌కు మద్దతు పలికారు.అయితే చిరంజీవిపై బీజేపీ ప్రత్యేకమైన ఆసక్తిని చూపిస్తోంది. ప్రత్యేక ప్రాధాన్యత ను ఇచ్చి ఆయనను రాజకీయాల్లోకి తెచ్చే ప్రయత్నాలు చేస్తోంది.గతంలో పలు మార్లు ప్రధాని మోదీ పాల్గొనే పర్యటనల్లో ఆయనకు అవకాశం కల్పించారు. అదే సమయంలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ .. చిరంజీవితో ప్రత్యేక అనుబంధం కొనసాగిస్తున్నారు. గోవాలో ఓ సారి అవార్డు ప్రకటన సందర్భంగా.. మళ్లీ రాజకీయాల్లోకి వస్తారా అని అనురాగ్ ఠాకూర్ అడిగారు కూడా . అయితే చిరంజీవి మాత్రం నిర్మోహమాటంగా...తాను మళ్లీ ప్రత్యక్షరాజకీయాల్లోకి వచ్చేది లేదని స్పష్టం చేశారు. మధ్యలో వైసీపీ కూడా కూడా ఆయనకు రాజ్యసభ సీటు ఆఫర్ చేసిందని ప్రచారం జరిగింది.దాన్ని చిరంజీవి కూడా ఖండించారు. తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానని చెప్పారు. అయినా బీజేపీ మాత్రం ఆయనను ఆకర్షించడానికి అదే ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఢిల్లీ నివాసంలో జరిగిన సంక్రాంతి సంబరాలకు.. చిరంజీవిని అతిథిగా ఆహ్వానించారు. ప్రత్యేకంగా ఆయననే ఆహ్వానించడం వెనుక ప్రత్యేకమైన సమీకరణాలు లేవని అనుకోలేమని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే బీజేపీ ఎం చేసినా పూర్తి స్థాయిలో రాజకీయ కోణంలోనే చేస్తుంది.ఇటీవల చిరంజీవికి రాష్ట్రపతి కోటాలో రాజ్యసభ సీటు వస్తుందన్న ప్రచారం జరిగింది. రాష్ట్రపతి కోటాలో ఆయనకు రాజ్యసభ సీటు ఇవ్వడానికి.. రాజకీయ పార్టీల్లో చేరాల్సిన అవసరం లేదు. బీజేపీలో చేరాల్సిన అవసరం లేదు. రాష్ట్రపతి వివిధ రంగాల్లోని నిపుణులను రాజ్యసభకు నామినేట్ చేసే కోటా అది. అయితే కేంద్రం సిఫారసు మేరకే నామినేట్ చేస్తారు. గతంలో కాంగ్రెస్ తరపున రాజ్యసభకు ఎన్నికైనప్పటికీ చిరంజీవిపై బీజేపీ ప్రత్యేక అభిమానం చూపిస్తున్నందున కళాకారుని కోటాలో ఆయనకు చాన్స్ ఇవ్వొచ్చని చెబుతున్నారు. అయితే దీనికి చిరంజీవి అంగీకరిస్తారా లేదా అన్నది కూడా కీలకమే. రాష్ట్రపతి కోటాలో రాజ్యసభ తీసుకుంటే.. ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నట్లుగా కాదు. బీజేపీకి అనుకూలంగా మాట్లాడాల్సిన పని లేదు

# కొత్త బ్యాటింగ్ కోచ్ వేటలో బీసీసీఐ.. రేస్‌లో ఇంగ్లాండ్ మాజీ స్టార్ క్రికెటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** గౌతమ్ గంభీర్ ప్రధాన కోచ్ గా భారత జట్టులోకి వచ్చినప్పటి నుంచి టీమిండియా బ్యాటింగ్ లో ఘోరంగా విఫలమవుతూ వస్తుంది. బౌలింగ్ లో రాణిస్తున్నా బ్యాటింగ్ లో చేతులెత్తేస్తున్నారు. ఈ క్రమంలో శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్ ను 0-2 తేడాతో.. స్వదేశంలో న్యూజిలాండ్ తో జరిగిన మూడు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను 0-3 తేడాతో వైట్ వాష్ అయ్యారు. ఇటీవలే జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలోనూ పేలవ బ్యాటింగ్ తో తీవ్ర నిరాశకు గురి చేసింది. దీంతో బీసీసీఐ భారత్ కు కొత్త బ్యాటింగ్ కోచ్ తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. రిపోర్ట్స్ ప్రకారం త్వరలో భారత జట్టుకు కొత్త బ్యాటింగ్ కోచ్ రానున్నాడు. అదే జరిగితే ఈ రేస్ లో ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ అందరి కంటే ముందున్నాడు. భారత జట్టుకు బ్యాటింగ్ కోచ్ గా తనకు ఆసక్తి ఉందని వెల్లడించాడు. టీమిండియా బ్యాటింగ్ కోచ్ కు సిద్ధంగా ఉన్నానని..తన అధికారిక ఎక్స్ ద్వారా వెల్లడించాడు.ఒకవేళ కెవిన్ పీటర్సన్ భారత జట్టు కోచ్ గా వస్తే అనుకూలంగా మారనుంది. పీటర్సన్ ఇంగ్లాండ్ క్రికెట్ లో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడు. 104 టెస్టుల్లో 47.28 సగటుతో 8181 పరుగులు చేశాడు. వీటిలో 23 సెంచరీలు ఉన్నాయి.

ప్రస్తుతం భారత కోచింగ్ సిబ్బందిలో ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు మోర్నే మోర్కెల్ (బౌలింగ్ కోచ్), అభిషేక్ నాయర్ (సహాయక కోచ్), ర్యాన్ టెన్ డోస్చాట్ (అసిస్టెంట్ కోచ్), టి దిలీప్ (ఫీల్డింగ్ కోచ్) ఉన్నారు. టీమిండియా జనవరి 22 నుంచి ఇంగ్లాండ్ తో టీ20, వన్డే సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీ ఆడాల్సి ఉంది. జూన్ నెలలో ఇంగ్లాండ్ వేదికగా 5 టెస్ట్ మ్యాచ్ ల సిరీస్ ఆడాల్సి ఉంది. ఈ సిరీస్ కు పీటర్సన్ ను బ్యాటింగ్ కోచ్ గా సెలక్ట్ చేసే అవకాశం ఉంది.

# టీమిండియా కొత్త బ్యాటింగ్ కోచ్ గా సితాంశు కోటక్!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల న్యూజిలాండ్ చేతిలో సొంతగడ్డపై వైట్ వాష్... ఆస్ట్రేలియాతో సిరీస్ లోనూ ఘోర ఓటమి... ఇదీ టీమిండియా ప్రస్తుత పరిస్థితి. ఈ నేపథ్యంలో, టీమిండియా కోచింగ్ సిబ్బందిలో ప్రక్షాళనపై బీసీసీఐ దృష్టి సారించింది. జట్టు బ్యాటింగ్ కోచ్ ను మార్చాలని బోర్డు నిర్ణయించింది. టీమిండియా కొత్త బ్యాటింగ్ కోచ్ గా సితాంశు కోటక్ పేరును ఖరారు చేసినట్టు తెలుస్తోంది. సితాంశు కోటక్ ప్రస్తుతం ఇండియా-ఏ జట్టు హెడ్ కోచ్ గా వ్యహరిస్తున్నాడు. 2023లో జస్ప్రీత్ బుమ్రా నాయకత్వంలో ఐర్లాండ్ లో టీ20 సిరీస్ ఆడిన టీమిండియాకు కోటక్ హెడ్ కోచ్ గా వ్యవహరించాడు. 52 ఏళ్ల సితాంశు కోటక్ దేశవాళీ క్రికెట్లో ఘనమైన చరిత్రను కలిగి ఉన్నాడు. కోటక్ గతంలో సౌరాష్ట్ర రంజీ సారథిగా వ్యవహరించాడు. 1992 నుంచి 2013 వరకు దేశవాళీ క్రికెట్ ఆడాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో 130 ఇన్నింగ్స్ లలో 41.76తో 8,061 పరుగులు చేశాడు. అందులో 15 సెంచరీలు, 55 అర్ధసెంచరీలు ఉన్నాయి. దేశవాళీ క్రికెట్ కు వీడ్కోలు పలికాక... సితాంశు కోటక్ కోచింగ్ వైపు మళ్లాడు. బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో బ్యాటింగ్ కోచ్ గానూ పనిచేశాడు. గత నాలుగేళ్లగా ఇండియా-ఏ టీమ్ పర్యటనలకు బ్యాటింగ్ కోచ్ గా సేవలందిస్తున్నాడు. 2017 ఐపీఎల్ సీజన్ లో గుజరాత్ లయన్స్ జట్టుకు అసిస్టెంట్ కోచ్ గా పనిచేశాడు.

ప్రస్తుతం టీమిండియాకు బ్యాటింగ్ కోచ్ లేదు. గౌతమ్ గంభీర్ చీఫ్ కోచ్ కాగా... మోర్నీ మోర్కెల్ బౌలింగ్ కోచ్ గా వ్యవహరిస్తున్నాడు. ర్యాన్ టెన్ డస్కాటే అసిస్టెంట్ కోచ్ గా, టి.దిలీప్ ఫీల్డింగ్ కోచ్ గా వ్యవహరిస్తున్నారు.

**బ్యాటింగ్ కోచ్ రేసులో కేపీ...!**

ఇంగ్లండ్ లెజెండ్ కెవిన్ పీటర్సన్ (కేపీ) కూడా టీమిండియా బ్యాటింగ్ కోచ్ రేసులో ఉన్నట్టు



సమాచారం. తనకు టీమిండియా బ్యాటింగ్ కోచ్ గా రావాలని ఉందని కేపీ ఇటీవలే ప్రకటించాడు. టెస్టు క్రికెట్ లో సైతం దూకుడుగా ఆడతాడని పీటర్సన్ కు పేరుంది. దక్షిణాఫ్రికా జాతీయుడైన కెవిన్ పీటర్సన్ 104 టెస్టుల్లో 8,181 పరుగులు చేశాడు. సగటు 47.28 కాగా... 23 సెంచరీలు అతడి ఖాతాలో ఉన్నాయి.

# క్రమశిక్షణ లేని ఆటగాళ్లు... కోచ్ గంభీర్ తీవ్ర అసంతృప్తి... త్వరలోనే కొత్త రూల్స్!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవలే ముగిసిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టు ఘోర వైఫల్యం నేపథ్యంలో కీలక మార్పులపై బీసీసీఐ దృష్టిసారించింది. ఈ విషయమై ఇటీవలే నిర్వహించిన సమీక్షా సమావేశంలో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కీలక సూచనలు చేసినట్టు తెలుస్తోంది. జట్టులోని ఆటగాళ్లకు క్రమశిక్షణ లేదంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేసిన గంభీర్, ఈ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందంటూ బీసీసీఐ పెద్దలను కోరినట్టు సమాచారం.



సుధీర్ఘ పర్యటనల్లో, ముఖ్యంగా విదేశీ పర్యటనల సమయంలో కుటుంబ సభ్యుల కారణంగా ఆటగాళ్ల దృష్టి మళ్లుతోందని గౌతమ్ గంభీర్ భావిస్తున్నాడు. ఈ విషయంలో కఠినమైన మార్గదర్శకాలు అవసరమని అభిప్రాయపడుతున్నాడు. కోచ్ సూచనల మేరకు బీసీసీఐ ఆలోచిస్తోందని, ఆటగాళ్ల కుటుంబాలను కలిసి సమయాన్ని పరిమితం చేసే అవకాశాలు ఉన్నాయని 'ఇండియా టుడే' పేర్కొంది."ఆటగాళ్ల క్రమశిక్షణారహిత్యంపై గంభీర్ చాలా గుర్రుగా ఉన్నాడు. కఠినమైన మార్గదర్శకాలు ఉండాలని ఆయన కోరుకుంటున్నాడు. బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో ఓటమిపై బీసీసీఐ సమీక్ష సమావేశంలో భారత డ్రెస్సింగ్ రూమ్‌లో క్రమశిక్షణా రాహిత్యంపై ఆయన మాట్లాడారు. కొవిడ్‌కు ముందు ఉన్న నిబంధనలకు తిరిగి తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. సుదీర్ఘ పర్యటనల్లో రెండు వారాల పాటు మాత్రమే కుటుంబ సభ్యులను అనుమతించాలని సూచించాడు. ఈ విషయంలో గౌతమ్ గంభీర్, ఆటగాళ్లు కూడా ఒకే అభిప్రాయంతో ఉన్నారు" అని బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు చెప్పినట్టు వివరించింది.

మరోవైపు, కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో కలిసి సమీక్షా సమావేశానికి హాజరైన కెప్టెన్ రోహిత్ శర్మ ఆటగాళ్ల మ్యాచ్ ఫీజు చెల్లింపు విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సలహా ఇచ్చాడు. మ్యాచ్ ఫీజును వెంటనే చెల్లించవద్దని, డబ్బు చెల్లింపునకు ఆటగాళ్ల ప్రదర్శనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని బీసీసీఐ పెద్దలకు సూచించినట్టు తెలుస్తోంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సమయంలో టీమ్ అంతా కలిసి ఒకే ఒక్క డిన్నర్ కోసం బయటకు వెళ్లగా, మరికొన్ని సందర్భాల్లో కొందరు ఆటగాళ్లు మాత్రం బృందాలుగా బయటకు వెళ్లారు. ఈ పరిణామాలే కోచ్ గంభీర్‌కు ఏమాత్రం రుచించడం లేదు.

# తెలుగు చీరలో నడుము అందం చూపిస్తోన్న ముద్దుగుమ్మ

తెలుగు అమ్మాయి శోభిత దూళిపాళ ముంబైలో మోడలింగ్ తో తన సినీ కెరీర్ ను మొదలు పెట్టి ఆ తర్వాత అక్కడే నటిగా కూడా మెప్పించింది. అక్కడ మంచి పేరు దక్కించుకున్న తర్వాత ఇప్పుడు శోభిత దూళిపాళ టాలీవుడ్ లో మరియు కోలీవుడ్ లో వరుసగా సినిమాల్లో నటిస్తోంది.

తాజాగా పొన్నియన్ సెల్వన్ సినిమాలో నటించి ఆకట్టుకున్న ఈ అమ్మడు తెలుగు లో మరోసారి గూఢచారి సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. మొత్తానికి ఇండస్ట్రీ లో బిజీ బిజీగా ఉన్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత చేస్తూ అలరిస్తోంది. సోషల్ మీడియాలో ఈమె షేర్ చేస్తున్న ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటాయి. తాజాగా మరోసారి ఈ అమ్మడి యొక్క అందాల విందు ఆకట్టుకుంది. ఈసారి చీర కట్టులో నడుము అందం చూపిస్తూ ఫోటోలకు ఫోజ్ ఇచ్చి సర్ ప్రైజ్ చేసింది. చీర కట్టు లో మరింత అందంగా శోభిత కనిపిస్తుంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. ఇక ఈ అమ్మడి వ్యక్తిగత విషయానికి వస్తే గత కొన్నాళ్లుగా ఈ అమ్మడు నాగ చైతన్య తో ప్రేమలో ఉందనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై స్పష్టత రావాల్సి ఉంది. పుకార్లే అంటూ పలు సార్లు చెప్పినా కూడా కొన్ని ఫోటోలు ఇద్దరు ప్రేమలో ఉన్నారేమో అనిపించేలా సాక్ష్యంగా ఉన్నాయి.



# వైట్ డ్రెస్ లో రకుల్ మైండ్ బ్లాక్ అందాలు



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ గా ఎదిగిన వారిలో రకుల్ ఒకరు. ప్రస్తుతం టాలీవుడ్ లో అవకాశాలు లేకపోయినా బాలీవుడ్ లో అవకాశాలు చేజిక్కించుకుంటోంది. కెరటం సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యింది. ఆ తర్వాత వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ తో హిట్ కొట్టింది. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసింది లేదు. తెలుగులో దాదాపు స్టార్ హీరోలు అందరితోనూ ఆడిపాడింది. ప్రస్తుతం ఈ బ్యూటీ తెలుగులో ఎలాంటి ఛాన్స్ లు లేకపోయినా సోషల్ మీడియా ద్వారా మాత్రం ఇక్కడి అభిమానులను అలరిస్తూ ఉంటుంది. రకుల్ కి ఫ్యాషన్ సెన్స్ చాలా ఎక్కువ. అది ఆమె ఫోటోలు చూస్తే అర్థమౌపోతంది. చాలా డిఫరెంట్ గా కనిపించడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. తన లేటెస్ట్ ఫోటో షూట్ లతో ఆకట్టుకుంటూ ఉంటుంది. తాజాగా ఓ తెలుగు రంగు వైట్ డ్రెస్ లో మెరిసింది. తెల్లని వైట్ డ్రెస్ ఒక వైపు స్లీవ్స్ మరో వైపు స్లీవ్ లెస్ గా ఉంది. పూర్తిగా జంప్ సూట్ లా కనిపిస్తోంది. దానికి మ్యాచింగ్ ఇయర్ రింగ్స్ తో పెయిర్ చేసింది. ఇక ఈ డ్రెస్ లో తన బాడీలో ఉన్న ఒంపులన్నింటినీ చూపిస్తోంది. ముందుర అందాలను కూడా చూపించీ చూపించనట్లుగా చూపిస్తూ ఆకట్టుకుంటోంది. ఈ డ్రెస్ క్లాత్ కూడా చాలా డిఫరెంట్ గా ఉంది. ఒంటికి మంచిగా గాలి ఆడాలని జాలీ క్లాత్ తో తయారు చేసినట్లుగా ఉంది. ఇప్పుడు ఈ ఫోటోలు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. సన్నజాజి తీగలా మెరిసిపోతున్నావంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. గతేడాది రకుల్ హిందీలో ఏకంగా ఐదు చిత్రాలతో అలరించింది. ఒక్క హిట్ పడినా ఈ బ్యూటీ బాలీవుడ్ లో సెటిల్ అయిపోయినట్లే అని అందరూ అనుకున్నారు. కానీ పాపం లక్ లేక అవన్నీ బాక్సాఫీసు దగ్గర బోల్తా పడ్డాయి. దీంతో అక్కడ కూడా ఈ అమ్మడి స్పీడ్ కాస్త తగ్గింది. ప్రస్తుతం హిందీలో ఎలాంటి చిత్రాలు లేకపోవడంతో దీంతో మళ్లీ రకుల్ సౌత్ సినిమాలవైపే చూస్తోంది. తెలుగులో ఛాన్స్ రాకపోయినా తమిళంలో మాత్రం వరుస అవకాశాలను అందుకుంటోంది. మరి ఈ విధంగా మళ్లీ ఆమె దక్షిణాది ప్రేక్షకులకు చేరువయ్యే అవకాశం ఉంది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com